

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే

గాల్వాన్ ఘర్షణ తర్వాత చైనా రహస్య అణుపరీక్ష
అమెరికా ఆరోపణ 03



సంపుటి 09, సంచిక: 72 | సోమవారం | 09-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




12న దేశవ్యాప్త సమ్మెకు

## వామపక్ష పార్టీల మద్దతు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను , విద్యుత్ సవరణ చట్టం బిల్లు 2025, విబి–జి శ్రీరామ్ జి చట్టం, విత్తన సవరణ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న 'సార్వత్రిక సమ్మె'ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తోందని, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల నాయకులు కూనంనేని సాంబశివ రావు (సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ) , జాన్‌వెస్లీ (సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి), పోటు రంగారావు (సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి), పి.సూర్యం((సిపిఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి), గాదగోని రవి(ఎంసిపిఐ(యు), మామిండ్ల రమేష్ రాజా(సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి), సి.హెచ్. మురహరి(ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి), జానకి రాములు(రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి), ప్రసాదన్న(సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శి), ఆర్.వి.ప్రసాద్ (ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ సభ్యులు) ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఎల్ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం లాంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు తరువాయి 2లో



మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి

# నేటితో తెర

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రానికి తెరపడనుంది. దీంతో రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని హోరెత్తిస్తూ, పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. అన్ని పార్టీల అగ్రనాయకత్వం మొత్తం జిల్లాలకు తరలింది. రాజకీయ పార్టీల ముఖ్యనాయకులు ప్రచార పర్వంలో తలామునకలయ్యారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు,7 మున్సిపల్ కార్పొరేషన్లకు రెండో సాధారణ ఎన్నికల పోలింగ్ ఈ నెల 11న జరగనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్య నాయకులు హైదరాబాద్‌ను వీడి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. అధికార కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నాయకులు జిల్లాల్లోని పట్టణాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో తలామునకలయ్యారు. మంత్రులు తాము ప్రతినిధ్యం వహిస్తున్న తరువాయి 2లో



కార్పొరేషన్ సమగ్రాభివృద్ధి

## సిపిఐతోనే సాధ్యం

- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- ప్రతీ గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తాం
- ప్రలోభాలతో ప్రజల నుండి దూరం చేయలేరు
- కార్పొరేషన్ తొలిపీఠం సిపిఐదే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పోరేషన్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అవినీతి రహిత పాలన కేవలం కమ్యూనిస్టులతోనే చేకూరుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం 26,50,54 డివిజన్లలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని తో పాటు అభ్యర్థులకు మహిళలు హారతులు పట్టి అడుగడుగునా ఘన స్వాగతం పలికాలు. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కూనంనేని మాట్లాడుతూ నన్ను రెండు సార్లు ఎంఎల్‌ఏగా ఆశీర్వదించారని, పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులను తెచ్చి ఈ ప్రాంతాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. కమ్యూనిస్టులతో తరువాయి 12లో

జిల్లాల మార్పు... సింగరేణిలో మెడికల్ బోర్డు రద్దు అంటూ...

# రాజకీయ లబ్ధికోసం దుష్ప్రచారాలు



ప్రజాపక్షం/భూపాలపల్లి

- బిఆర్‌ఎస్ అంటే 'బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి'
- నాడు కాంగ్రెస్ పాలనలోనే భూపాలపల్లి అభివృద్ధి
- సింగరేణి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ బాధ్యత
- కార్మికులకు నష్టం కలిగించే ఏ పనీ ఈ ప్రభుత్వం చేయదు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.17,442 వేల కోట్లు ఇచ్చాం
- ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

బిఆర్‌ఎస్ అంటే 'బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాంపరింగ్, ఈ ఫార్ములా కుంభకోణం, ఎలక్టోరల్ బ్రాండ్ల పేరుతో జడ్జిలను, జర్నలిస్టులను సైతం బ్లాక్ మెయిల్ చేసి రూ. వేలకోట్లు దోచుకొని, అదేవిధంగా ఇప్పుడు జిల్లాల మార్పు పేరుతో, సింగరేణిలో మెడికల్ బోర్డు రద్దు లాంటి దుష్ప్రచారాలు రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానం పునఃప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తరువాయి 2లో



ఎఫ్ఎస్ఎల్‌లో

## కేసు ఆస్తులు సురక్షితం

ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోరెన్సిక్ సైన్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) అగ్నిప్రమాద ఘటనలో కీలక కేసులకు సంబంధించిన రికార్డులు, ఫైళ్లు ఆహుతయ్యాయని ఆరోపిస్తున్న వార్తల్లో నిజం లేదని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ స్పష్టం చేశారు.ప్రమాద ఘటనను ఆదివారం ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయని జరుగుతున్న ప్రచారంపై శిఖాగోయల్ క్లారిటీ ఇచ్చారు. 2024లో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో 136 మెటీరియల్స్ ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమిత్తం వచ్చాయని ఇందులో 7 మెటీరియల్స్ తాజా ప్రమాదంలో కాలిపోయాయని తరువాయి 2లో

రష్యా నుంచి చమురు దిగుమతులపై

# మౌనం వెనుక అర్థం ఏమిటో?

ట్రంప్ వ్యాఖ్యలపై ఇప్పటి వరకూ అధికారికంగా స్పందన ఏదీ?

అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత గల అంశంపై మోదీ విస్పష్టమైన వివరణ ఎందుకు ఇవ్వడం లేదు

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీలను విమర్శించడానికి, ప్రజా వ్యతిరేక చర్యలను కూడా సంక్షేమ పథకాలుగా నమ్మించడానికి ఎప్పుడూ ముందు ఉండే కేంద్ర ప్రభుత్వం, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం... రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. 'రష్యా ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించింది' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటి వరకూ అధికారికంగా తరువాయి 12లో





వారికి ఎందుకు ఓటు వేయాలి ?

## ప్రశ్నించండి.. ఆలోచించండి

- డిప్యూటీ సిఎం భట్టి

12

అగ్రరాజ్యాలకు 'నో' చెప్పి

## ఎదురు నిలబడటమే అసలైన అణుబాంబు

గల్ఫ్‌లో సైన్యానికి భయపడం : ఇరాన్




**టెహ్రాన్ :** మన అణుబాంబును చూసి వాళ్ళు (అమెరికా–ఇజ్రాయెల్) భయపడుతున్నారని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీ అన్నారు. తమపై కయ్యానికి కారణం, అసలు విషయం అది కాదని, వాస్తవానికి తమ వద్ద అలాంటిదేమీలేదన్నారు. ''అగ్రరాజ్యాలకు 'నో' అని చెప్పి ఎదురు నిలబడటమే ఇరాన్ దగ్గర ఉన్న అసలైన అణుబాంబు'' అన్నారు. టెహ్రాన్‌లో ఆదివారం జరిగిన దౌత్యవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ అవసరాల కోసం యురేనియంను శుద్ధిచేసే ప్రక్రియను నిలిపివేసే ప్రశ్నేలేదని, ఇరాన్ తన పూర్వ వైఖరికి కట్టుబడి ఉందని అన్నారు. అమెరికాను చూసి భయపడేదే లేదని, అరేబియా జలాల్లో మోహరించిన అమెరికా యుద్ధసేనలను చూసి బెదిరేదే లేదన్నారు. అగ్ర రాజ్యాలకు ''నో'' అని ఎదురుచెప్పి తిరస్కరించడమే ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ శక్తిసామర్థ్యాల వెనుక ఉన్న అసలైన తరువాయి 2లో

## రూ.5000 కోట్ల అక్రమ లావాదేవీలు

- జిఎస్‌టి ఎగవేత
- ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టు రట్టు
- హైదరాబాద్, ఢిల్లీ, ముంబయిలలో జిఎస్‌టి ఇంటెలిజెన్స్ అధికారుల మెరుపుదాడులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సుమారు రూ.5 వేల కోట్ల అక్రమ లావాదేవీలుతో పాటు జిఎస్‌టి ఎగవేసిన అంతర్జాతీయ ఆన్‌లైన్ గేమింగ్ ముఠా ఉదంతం తాజాగా వెలుగు చూసింది. దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ ఆన్‌లైన్ గేమింగ్ ముఠాపై హైదరాబాద్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ అధికారులు గుట్టు రట్టు చేశారు.ఈ మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ5,000 కోట్ల విలువైన అక్రమ తరువాయి 2లో



# సైబర్ నేరగాళ్లపై పోలీసుల ఉక్కుపాదం

జనవరిలో 37 మంది అరెస్ట్, రూ. 65 కోట్ల లావాదేవీల గుర్తింపు

ప్రజాపక్షం/హైదరాబాద్



సైబర్ నేరాలను అరికట్టడమే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. జనవరిలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాలకు చెందిన 37 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి అరెస్టుతో మొత్తం 26 కీలక కేసులను ఛేదించినట్లు అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్, ఎస్ఐటి) ఎం. శ్రీనివాసులు వెల్లడించారు. కేవలం ఒక్క నెలలోనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో మొత్తం 117 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, పోలీసుల సత్వర చర్యల వల్ల బాధితులకు చెందిన రూ. 71,91,371 మొత్తాన్ని విజయవంతంగా రీఫండ్ చేయించడం జరిగిందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 'అరెస్ట్ అయిన నిందితులకు దేశవ్యాప్తంగా 86 కేసులతో సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. వీరి బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా సుమారు రూ. 65 కోట్ల భారీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 79 సిమ్ కార్డులు, 62 డెబిట్ కార్డులు, 57 చెక్కు పుస్తకాలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నాం' అని తెలిపారు.

**సైబర్ మోసాలతో జాగ్రత్త..**

**నకిలీ ప్రొఫైల్స్ :** ఉన్నతాధికారుల పేర్లతో వచ్చే వాట్సాప్, సోషల్ మీడియా మెసేజ్‌లను నమ్మి తరువాయి 2లో

# సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే..

పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుంది: సిపి సజ్జనార్

ప్రజాపక్షం/హైదరాబాద్



విధులకు అతీతంగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీస్ సిబ్బందికి ఆదివారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి వేదికగా 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యతని అన్నారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తి చేయడం కంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే తరువాయి 12లో

సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్యురాలు

## సరస్వతి కన్నుమూత

ప్రజాపక్షం/హైదరాబాద్



సి.ఆర్.ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్యురాలిగా ఉచిత సేవలను అందిస్తూ, సి ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్న సరోజినిదేవి ఆస్పత్రి రిటైర్డ్ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ పి.సరస్వతి (90 సంవత్సరాలు) ఆదివారం మృతి చెందారు. ఆమె భర్త సుబ్బారావు 2004 సంవత్సరంలోనే మరణించారు. సరస్వతి కుమారుడు శ్రీనివాస్ వృత్తి రీత్యా కెనడాలో నివసిస్తున్నారు. సరస్వతి పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 10 గంటల వరకు సి ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం ఆవరణలో సందర్శనార్థం ఉంటుంది. అనంతరం తరువాయి 2లో

# ఇటలీలో వేలాదిమంది ప్రజా ప్రదర్శన

## పోలీసులతో ఘర్షణ, అరెస్టులు



**మిలాన్ :** వింటర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇస్తున్న ఇటలీలో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. పోలీసులపై రాళ్ళు విసిరారు. దీంతో పోలీసులు కూడా తీవ్రంగా స్పందించారు. ప్రదర్శకులపై నీటిగొట్టాలను ప్రయోగించారు. అనేకమందిని అరెస్టు చేశారు. ఒలింపిక్స్ జరుగుతున్న మిలాన్ నగరంలో ప్రజలు వేలాదిగా వీధుల్లోకి వచ్చి ధరల పెరుగుదలతోపాటు అనేక సమస్యల పరిష్కారం కోరుతూ ప్రదర్శనలు నిర్వహించారు. ఒలింపిక్స్ ప్రారంభమైన మొదటిరోజే ఈ ప్రదర్శనలు జరిగాయి.గత వారంలో తురిన్‌లో జరిగిన భారీ ప్రదర్శనలో ఘర్షణలు చెలరేగడంతో ప్రభుత్వం ప్రజా ప్రదర్శనకు ఉన్న హక్కులను కఠినతరం చేసింది. అనేక ఆంక్షలు విధించింది. వారం క్రితం జరిగిన ప్రదర్శన, ఘర్షణలో దాదాపు 100 మంది అధికారుగు గాయపడటంతో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రజలు ఈసారి మిలాన్‌లో వేలాదిమంది వీధుల్లోకి వచ్చి తిరగబడ్డారు. జీవనాధారం కోల్పోతున్నామని, జీవన వ్యయాలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు నిరసనలు తెలియజేస్తున్నారు. కాగా ఉత్తర ఇటలీలో రైలు పట్టాలపై విద్రోహ చర్యలకు పాల్పడింది ఎవరో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మిలాన్‌లో ఘర్షణలకు పాల్పడినవారంతా నేరస్థులేనని ఇటలీ ఉప ప్రధానమంత్రి మాటియో సాల్విని విమర్శించారు. దుండగులు, నేరస్థులపై కొత్త భద్రతా ప్రమాణాలతో కఠిన అణచివేత చర్యలు తీసుకుంటామన్నారు. తురిన్‌లో ప్రజాప్రదర్శన హింసాత్మకంగా మారింది. కొందరు మారణాయుధాలతో అధికారులపై దాడి చేశారు. ఒకరైతే సుత్తితో ఒక అధికారిని తీవ్రంగా గాయపరిచారు.

# జపాన్‌లో తకైచీ అనుకూల పవనాలు!

## పోలింగ్‌కు మంచు ఆటంకం



**టోక్యో :** జపాన్ పార్లమెంటు దిగువసభకు ఆదివారం జరిగిన పోలింగ్‌కు రికార్డు స్థాయిలో కురుస్తున్న మంచు పెద్ద ఆటంకంగా మారింది. ఐనప్పటికీ జపాన్ ఓటర్లు ఎంతో ధైర్యంగా వీధుల్లోకి వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నప్పటికీ గతంకంటే చాలా తక్కువస్థాయిలో ఈసారి పోలింగ్ నమోదైంది. కొన్ని పోలింగ్ కేంద్రాలలో రెండు గంటలసేపు పోలింగ్‌ను ఆపేశారు. నిక్కీపోల్ సర్వే ప్రకారం తకైచీకి చెందిన లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి), జపాన్ ఇన్నొవేషన్ పార్టీ (జెఐపి) ప్రధానంగా ఉన్నాయి. ప్రస్తుత ప్రధానమంత్రి సనే తకైచీకి ఉన్న ప్రజాదరణ ఆమె విజయానికి 70శాతం మేరకు దోహదం చేస్తుందని విశ్లేషకులు అంచనావేశారు. ఐతే ప్రజలు సుఖప్రదమైన జీవనం, ద్రవ్యోల్బణంలేని జీవితం కోరుకుంటున్నారు. ముఖ్యంగా 300 స్థానాలకోసం గట్టి పోటీ జరుగుతోంది. తెల్లవారుజామునాటికి తుది ఫలితాలు వెలువడతాయి.

ఎల్‌డిపి ప్రస్తుతం జెఐపితో కలిసి సంకీర్ణ ప్రభుత్వం నడిపిస్తోంది. గడచిన 36 ఏళ్ళలో ఎన్నడూలేనివిధంగా దేశంలో శీతాకాలంలో మధ్యంతర ఎన్నికలకు తకైచీ మెరుపు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు ఆమె గెలుపు దిశగా అడుగులు వేస్తున్నారని ఎగ్జిట్‌పోల్స్ నివేదికలు చెబుతున్నాయి. అధికార ఎల్‌డిపిలో ఇటీవల అవినీతి పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చైనాతో యుద్ధ భయం కూడా వారిని వెంటాడుతోంది. జపాన్‌లో గృహం అతిపెద్ద సమస్యగా మారింది. ఉద్యోగాలున్నప్పటికీ గతంకంటే భిన్నంగా ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓటర్ల నిర్ణయం కొద్ది గంటల్లో తెలుస్తుంది.

గత ఏడాది అక్టోబరు 21వ తేదీన ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్న సనే తకైచీ (65) అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే చైనాతో ఏర్పడిన తీవ్ర ఉద్రిక్త పరిస్థితులమధ్య దిగువసభలో పూర్తి మెజారిటీ సంపాదించుకోవడం కోసం ఆమె మెరుపు ఎన్నికలకు పిలుపు ఇచ్చారు. ఐతే ఓటర్లలో భయం నెలకుంది. తకైచీ గనుక విజయం సాధిస్తే చైనాతో యుద్ధం చేసేంకు సిద్ధపడతారని కొందరు పౌరులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తాము యుద్ధానికి సిద్ధంగా లేమని లైవ్ ఇంటర్వ్యూలలో ఓటర్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దిగువసభలో ఎవ్వరి సహాయం లేకుండా మెజారిటీకి అవసరమైన 233 స్థానాలను లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) సంపాదించుకోవాలని తకైచీ పట్టుదలగా ఉన్నారు.తకాచీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలన్నీ అమలు చేయాలంటే కనీసం 261 స్థానాలను లిబరల్ డెమోక్రాట్లు సంపాదించుకోవాల్సి ఉంటుంది.

# నైజీరియాలో 51 మంది కిడ్నాప్

**లాగోస్ :** ఉత్తర నైజీరియా కదునా ప్రాంతంలోని నాలుగు ప్రాంతాలపై గడచిన మూడు రోజులుగా జరుగుతున్న వరుస దాడుల్లో సాయుధ దుండగులు 51 మందిని కిడ్నాప్ చేశారు. మరో ముగ్గురిని కాల్చి చంపారు. కజురు ప్రాంతం నుండి 11మందిని అపహరించారు. అదే ప్రాంతంలో ముగ్గురిని కాల్చి చంపారు. ఆఫ్రికాలో అత్యధిక జనాభా గల నైజీరియాలో తరచు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. గత ఏడాదిలో ప్రభుత్వాన్ని బెదిరించి నగదు దోచుకోవడం కోసం వందలమంది స్కూలు పిల్లలు, ఉపాధ్యాయులను సాయుధ ముఠాలు కిడ్నాప్ తీసుకువెళ్ళడం అలవాటుగా మారింది. ప్రభుత్వం ఈ ముఠాలను అదుపుచేయలేకపోతోంది. నైజీరియా అధ్యక్షుడు దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించి సైన్యాన్ని, పోలీసులను కొత్తగా రిక్రూట్ చేసుకుంటామని ప్రకటించారు.

# సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్ దాడి 24మంది మృతి

**కైరో :** సూడాన్‌లో రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఫ్) చేసిన దాడిలో ఎనిమిది మంది పిల్లలు, ఇద్దరు చంటిబిడ్డలు సహా 24 మంది పౌరులు మరణించారు. సూడాన్ డాక్టర్స్ నెట్‌వర్క్ శనివారం ఈ ప్రకటన చేసింది. ఉత్తర కోర్డోఫాన్ రాష్ట్రంలో ఆర్ఎస్ఎఫ్ ఈ దాడులు చేసింది. డెబైకర్ ప్రాంతంలో యుద్ధం చెలరేగడంతో ఆ ప్రాంతం నుండి పారిపోతున్న ప్రజలను తీసకువెళుతున్న వాహనంపై ఆర్ఎస్ఎఫ్ సైనికులు రహద్ నగర సమీపంలో దాడి చేయడంతో వీరంతా మరణించారు. ఈ దాడిలో అనేకమంది గాయపడ్డారు. సూడాన్‌లో రెండు సైనిక వర్గాలమధ్య మూడు సంవత్సరాలుగా చెలరేగిన యుద్ధం వల్ల లక్షలాదిమంది ప్రజలు దేశం వదలి, యుద్ధ ప్రాంతాలు వదలి సురక్షిత ప్రదేశాలకు పారిపోయారు. ఈ యుద్ధంలో వేలాదిమంది అమాయకులైన సాధారణ పౌరులు మరణించారు. వందలమంది స్త్రీలు అత్యాచారాలకు గురయ్యారు.

# థాయ్‌లాండ్‌లో పీపుల్స్‌పార్టీ హవా

## పోలింగ్ పూర్తి, మూడు పార్టీల మధ్య పోటీ



**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్‌లో ఆదివారం పార్లమెంటుకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. దీంతోపాటు 2017 నాటి సైన్యం రూపొందించిన రాజ్యాంగాన్ని మార్పు చేయాలా? వద్దా అనే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరిగింది. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించేందుకు వీలుగా పార్లమెంటుకు అధికారాలు దాఖలుపరచాలా?వద్దా? అనే విషయంపై ప్రధానంగా ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిచేశారు. అనుతిన్ ఛార్న్ విరాకుల్ (ప్రస్తుత ప్రధానమంత్రి–భూమిజైతయ్ పార్టీ),నత్తఫోంగ్ రుయోంగ్ పన్యావుట్ (పీపుల్స్‌పార్టీ),యోడ్చనన్ వోంగ్సావత్(ఫూ థాయ్ పార్టీ)లు ముగ్గురూ అధికారంకోసం ప్రధానంగా పోటీపడుతున్నారు. ముందస్తు సర్వేలో పీపుల్స్ పార్టీ పైచేయి సాధించింది. దిగువసభలో 500 స్థానాలున్నాయి. ఈ సభ్యులందరూ కొత్త ప్రధానమంత్రిని ఎన్నుకుంటారు.

పార్లమెంటులో 251ఓట్లు సంపాదించుకున్నవారినే ప్రధానమంత్రి పదవి వరిస్తుంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం 5,089 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ప్రధానమంత్రి పదవికి 43 పార్టీల నుండి 92 మంది అభ్యర్థులు ప్రధానమంత్రి పదవికి పోటీపడ్డారు దేశంలో 53 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. ఇంతకు ముందు వరుసగా ఆరుసార్లు జరిగిన ఎన్నికల్లో ఐదుసార్లు ఫూథాయ్ పార్టీ విజయం సాధించింది.

మూడేళ్ళ వ్యవధిలోనే నలుగురు ప్రధానమంత్రులు ప్రభుత్వం నుండి వైదొలగడంతో దేశంలో అస్థిర పరిస్థితులు నెలకున్నాయి. భూమిజైతయ్ పార్టీ నాయకుడు, ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్ విరాకుల్ నాయకత్వంలో నిన్నమొన్నటి దాకా కాంబోడియాతో సరిహద్దుల్లో మూడుసార్లు వరుసగా తీవ్ర సైనిక ఘర్షణలు, ఆర్థిక అవినీతి ఆరోపణలు, చరిత్రాత్మకమైన వరద బీభత్సం నుండి ప్రజలను రక్షించి సహాయం చేయడంలో వైఫల్యం వంటి పరిణామాల తర్వాత రాజు ప్రభుత్వాన్ని రద్దుచేసి ఎన్నికలకు ఆదేశించారు. ఫూ థాయ్ పార్టీ, భూమిజైయ్‌తయ్ పార్టీ, పీపుల్స్‌పార్టీ, మూవ్ ఫార్వార్డ్ పార్టీ ఎన్నికల్లో నువ్వానేనా అనే రీతిలో పోటీపడుతున్నాయి. దేశంలో రిజిస్టరైన 57పార్టీలు వాస్తవానికి పోటీలో ఉన్నాయి.

# చైనా పరిశ్రమలో పేలుడు

## ఎనిమిది మంది కార్మికులు మృతి

**బీజింగ్ :** ఉత్తర చైనాలోని ఒక బయోటెక్ పరిశ్రమలో ఆదివారం పెద్ద పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిదిమంది కార్మికులు మరణించారు. షాంగ్జీ రాష్ట్రం షుయోయాంగ్‌లో ఉన్న పరిశ్రమలో పేలుడు సంభవించినట్లు చైనా మీడియా తెలియజేసింది. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జియాపెంగ్ బయోటెక్నాలజీకి చెందిన ప్రభుత్వ ప్రతినిధిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఒక ప్రమాద దర్యాప్తు బృందాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక లోయ ప్రాంతంలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ కార్యాలయానికి వెబ్‌సైటు కూడా లేదు. గత ఏడాది జూన్ నెలలోనే కొత్తగా ఈ పరిశ్రమను ఏర్పాటు చేశారు.



## వామపక్ష పార్టీల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లను కేంద్రం ప్రవేశపెట్టిందని, తద్వారా ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సామాజిక భద్రతకు కార్మికులు దూరమవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత ఉండబోదని, ఇప్పటికే అనేక రాష్ట్రాలల్లో కార్మికుల పని గంటలను పెంచుతూ చట్ట సవరణ చేశారన్నారు. విబిజిరామ్ జి చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ బాధ్యతలను నుంచి కేంద్రం తప్పుకుంటున్నదని, బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించిందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు తో సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయని, స్మార్ట్ మీటర్లు, క్రాస్ సబ్సిడీ రద్దుతో ప్రస్తుతం రైతులు, పేదలకు అమలు చేస్తున్న ఉచిత, సబ్సిడీ విద్యుత్ ప్రమాదంలో పడుతుందని వారు తెలిపారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తుందని, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని దుయ్యబట్టారు. విద్యుత్ ఛార్జీల ధరల నిర్ణయాల అంశంలో రాష్ట్రాలకు ఉన్న అధికారాలను తగ్గించి, కేంద్రం తన పట్టును పెంచుకుంటుందని విమర్శించారు. విత్తన సవరణ బిల్లుతో విత్తనాల ధరలను నియంత్రించే అధికారం ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళ్తుందని, బహుళజాతి కంపెనీల పట్టు పెరుగుతుందని, తద్వారా సాగు ఖర్చు భారీగా పెరుగుతుందని వారు వివరించారు. ఎల్ఐసిలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం ద్వారా విదేశీ కంపెనీలు కేవలం లాభాపేక్షతో పని చేస్తాయని, క్లెయిమ్ల విషయంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును దేశ అభివృద్ధికి కాకుండా, విదేశీ కంపెనీల లాభాలకు మళ్ళిస్తారని విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇప్పటికే వారి మద్దతు ప్రకటించాయని వామపక్ష పార్టీ నాయకులు తెలిపారు.

## అసలైన అణుబాంబు

(మొదటి పేజీ తరువాయి)

రహస్యమని అన్నారు. ఇరాన్ అణుబాంబును తయారు చేస్తుందని అమెరికా భయపడుతోందని, కానీ అసలు కారణం అదికాదని ఆయన తేల్చి చెప్పారు. ఒమన్ రాజధాని నగరం మస్కట్‌లో అమెరికా అధికార ప్రతినిధులతో మధ్యవర్తుల ద్వారా చర్చలు జరిగిన రెండు రోజులకు అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ గల్ఫ్‌లో ఉన్న అబ్రహాంలింకన్ విమానవాహక యుద్ధనౌకలోకి వెళ్ళి ఆ ప్రాంతాన్ని పర్యటించిన నేపథ్యంలో ఇరాన్ మంత్రి అరాఘ్చి పైవిధంగా స్పందించారు. అణ్వాయుధాలకు ఉపయోగించే యురేనియంను టన్నులకొద్దీ పూర్తిస్థాయిలో శుద్ధిచేసి ఇరాన్ సిద్ధంగా ఉంచుకుందన్న విషయమే ఆ దేశంపై యుద్ధానికి సిద్ధం కావడం ప్రధాన కారణంగా ఉంది. కానీ ఇరాన్ ఈ కారణాన్ని తిరస్కరిస్తున్నది. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని అమెరికా వాదిస్తున్నది. యురేనియంను ఇరాన్ శుద్ధి చేయడానికి వీల్లేదని ఇప్పటికే అనేక ఆంక్షలు విధించింది. ఈ విషయంపై ఒత్తిడిచేసి ఒప్పంద చట్రంలో ఇరాన్‌ను బిగించి ఉంచడంకోసమే అరేబియా జలాల్లో అమెరికా యుద్ధనౌకలను మోహరించి బెదిరింపులకు పాల్పడుతున్నది. ఇరాన్ శాంతియుత ప్రయోజనాలకోసమే అణుపదార్థాన్ని శుద్ధిచేస్తోందని, ఎప్పటికీ తమ దేశం అణుబాంబును తయారు చేయబోదని ఇరాన్ పాలకులు మొదటినుండీ చెబుతూ వస్తున్నారు. కానీ అమెరికా,యూరప్‌దేశాలు, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ మాత్రం ఇరాన్ అణుశుద్ధివెనుక కారణాలను ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

## కేసు ఆస్తులు సురక్షితం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వీటిని సైతం రిట్రైవ్ చేస్తున్నామని మిగతావన్నీ సంబంధింత అధికారులకు అప్పగించామన్నారు. ఇక 2015లో ఎసిబి నమోదు చేసిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన మెటీరియల్ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్లో లేదన్నారు. ఈ కేసులో 2015లో రెండు విడతల్లో 16 మెటీరియల్ ఆబ్జెక్టులు ఎఫ్ఎస్ఎల్ పరీక్షించి అదే ఏడాదిలో నివేదికలను ఎసిబి కోర్టుకు సమర్పించినట్టు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన 16 వస్తువులు ఇప్పటికే కోర్టుకు తిరిగి అప్పగించినట్టు తెలిపారు.ఈ అగ్ని ప్రమాదం కారణంగా కంప్యూటర్ ఫోరెన్సిక్ ల్యాబ్, దానికి అనుబంధ సదుపాయాలు, ట్రైనింగ్ హాల్‌తో పాటు మొదటి అంతస్తులోని కొన్ని ఇతర విభాగాలకు నష్టం వాటిల్లిందన్నారు.అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని పంచుల సమక్షంలో పరిశీలించి, పెద్ద మొత్తంలో కేసు ఫైళ్లను భద్రంగా స్వాధీనం చేసుకుని భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.అగ్ని ప్రమాదానికి సంబంధించి కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ఆధార రహిత ప్రచారం జరుగుతోందని శిఖాగోయల్ ఖండించారు. ప్రస్తుతం ఎఫ్ఎస్ఎల్‌లోని చాలా విభాగాలు సాధారణంగా పనిచేస్తున్నాయని, నష్టపోయిన సదుపాయాలను త్వరలోనే పూర్తిగా పునరుద్ధరిస్తామని శిఖా గోయల్ తెలిపారు. అగ్నిప్రమాదంపై విచారణ జరుగుతోందని జరిగిన ఆస్తినష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారని, నష్టం అంచనాకు వచ్చాక వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అగ్నిప్రమాదం సమయంలో ఎవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు.

**ఎఫ్ఐఆర్‌లో కీలక సమాచారం..**

అగ్నిప్రమాదంపై ఎఫ్ఎస్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు ఎఫ్ఐఆర్ చేశారు.ఈ ఎఫ్ఐఆర్‌లో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. మధ్యాహ్నం 1.30 గంటలకు మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తరువాత ఎఫ్ఎస్ఎల్ జాయింట్ డైరెక్టర్ కె.రవికుమార్ గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.జ్ఞానేశ్వరరావు, ఇన్‌చార్జి సైంటిఫిక్ ఆఫీసర్ కె.అంజనతో ఎఫ్ఎస్ఎల్ మొదటి అంతస్తు తనిఖీ చేయగా కంప్యూటర్ ఫోరెన్సిక్ లాబోరేటరీ, దాని ప్రాపర్టీ రూమ్ (రికార్డులు భద్రపరిచేగది), కేస్ వెరిఫికేషన్ ఛాంబర్, అనాలిసిస్ ఛాంబర్‌తో పాటు సర్వర్ రూమ్‌కు నష్టం వాటిలినట్లు కనుగొన్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ కేసును సిఐ సైదులు దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

#### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అగ్నిప్రమాదం అనేక అనుమానాలకు తావిస్తోందని, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్, నయీం కేసు, భూ కుంభకోణాలు, ఓటుకు నోటు లాంటి పలు రాజకీయ అవినీతి కేసులకు సంబంధించిన విచారణ కీలక దశలో ఉన్న సమయంలోనే ప్రమాదం జరగడం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సచివాలయం, ఇప్పుడు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఇలా పదే పదే ప్రభుత్వ రికార్డులే తగల బడటం వెనుక ఉన్న కారణాలు ఏమిటనే నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులకు కట్టుదిట్టమైన భద్రతను కల్పించాల్సిన అవసరం ఉన్నదని జాన్ వెస్లీ తెలిపారు.

## అక్రమ లావాదేవీలు

(మొదటి పేజీ తరువాయి)

లావాదేవీలకు పాల్పడిన ఆన్‌లైన్ గేమింగ్ ముఠాపై హైదరాబాద్, ఢిల్లీ, ముంబై నగరాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రాథమిక దర్యాప్తులో ముంబైకి చెందిన వైఎస్.ప్రభు కుమార్, హైదరాబాద్‌కు చెందిన రాజ శేఖర్ రెడ్డి ఈ సిండికేట్‌కు ప్రధాన సూత్రధారులుగా అధికారులు గుర్తించారు. వీరి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు జిఎస్‌టి ఇంటెలిజెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు.

దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్

ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు, వెబ్ ప్లాట్‌ఫాంలను ఉపయోగిస్తూ దేశవ్యాప్తంగా వినియోగదారుల నుంచి భారీ మొత్తంలో డబ్బును సేకరించినట్లు విచారణలో వెల్లడైంది. గేమింగ్ పేరుతో బెట్టింగ్, చట్టవిరుద్ధ లావాదేవీలు జరిపి, జిఎస్‌టి ఎగవేతకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారిస్తున్నారు.

సోదాల సందర్భంగా అనేక కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు లావాదేవీల వివరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశీ సర్వర్ల ద్వారా లావాదేవీలు జరిపినట్లు, బెనామీ ఖాతాల ద్వారా నిధులను తరలించినట్లు కూడా అనుమానం వ్యక్తమవుతోంది.ప్రస్తుతం జిఎస్‌టి ఎగవేత, అక్రమ ఆర్థిక లావాదేవీలు, మనీ లాండరింగ్ కోణాల్లో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో మరికొందరు కీలక వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని, ఈ ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్‌కు సంబంధించిన సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని జిఎస్‌టి విజిలెన్స్ వర్గాలు పేర్కొన్నాయి.

## సరస్వతి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 11 గంటలకు ఆమె పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజికి ఆమె కుమారుడు శ్రీనివాస్ అప్పగించనున్నారు. కాగా విద్యార్థుల వైద్య, విద్య అవసరాల నిమిత్తం తన భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజికి అప్పగించాలని గతంలోనే సరస్వతి రాతపూర్వకంగా తెలిపారు. డాక్టర్ పబ్బరాజు సరస్వతిసుబ్బారావు దంపతులు 2004 సంవత్సరంలో చంద్రరాజేశ్వర్ రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సి.ఆర్ ఫౌండేషన్) వృద్ధాశ్రమంలో చేరారు .

సరస్వతి భర్త సుబ్బారావు 2009 సంవత్సరంలో మృతి చెందారు. సి.ఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో ఆమె కంటి వైద్యు రాలిగా గత 11సంవత్సరాలు ఉచిత సేవలను అందించారు. సి.ఆర్ పాలిక్లినిక్ మెడికల్ క్యాం పులకు, ఆశ్రమంలో వసతులు, సౌకర్యాలకు, సిబ్బంది సంక్షేమానికి వ్యక్తిగతంగాను, ఆర్థికంగా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యకలాపాలకు కూడా ఆమె తోడ్పాటును అందించారు. సి.ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో డాక్టర్ సరస్వతి 21 సంవత్సరాలుగా ఉంటున్నారు.

కాగా డాక్టర్ సరస్వతి మృతి పట్ల సి.ఆర్.ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రామకృష్ణ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## నేటితో తెర

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలతో పాటు తమ తమ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థలను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిపిఐ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిపిఐ ముఖ్యనాయకులతో పాటు పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సిపిఐ అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర పార్టీ కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. వివిధ ప్రాంతాలలోని పార్టీ శ్రేణులను సిపిఐ అభ్యర్థుల ప్రచారంలో మోహరించారు. అలాగే బిఆర్ఎస్ తరపున ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామరావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నారు. బిజెపి కూడా ఈసారి భారీ స్థాయిలో అగ్ర నాయకత్వంతో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టింది. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యనాయకులను కూడా ప్రచారం పర్వంలోనికి దింపింది. ఆదిలాబాద్ సిర్పూర్ కాగజ్ నగర్‌లలో మహరాష్ట్ర సిఎం దేవేంద్ర పడ్నవీస్ ఎన్నికల సభలలో పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన సింహం గుర్తుపై తమ పార్టీ అభ్యర్థులను పోటీలోకి దింపింది. బిఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన అనంతరం ఆమె మొదటిసారిగా తన అభ్యర్థులను పోటీలో దింపడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు..

ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పలు చర్యలు చేపట్టింది. పోలింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసింది. పోలింగ్ స్టేషన్‌ల వారీగా చేపట్టే చర్యలు, తీసుకునే జాగ్రత్తలపై ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కముదిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌లు, ఎన్నికల అధికారులకు దిశనిర్దేశం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుపై ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులకు బాధ్యతలను కూడా అప్పగించారు. ఎన్నికల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఇప్పటికే జిల్లాల వారీగా క్లస్టర్ నోడల్ అధికారులను నియమించిన విషయం తెలిసిందే. ఈ నోడల్ అధికారుల ఫోన్ నెంబర్లను ప్రజలకు, మున్సిపల్ కమిషనర్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి తెలిసే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించి ఏదైన ఫిర్యాదులు లేదా సందేహాలు ఉన్న వారు తమ పరిధిలోని నోడల్ అధికారులను సంప్రదించాలని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దీనికి సంబంధించి ఈ నెల 9వ తేదీవరకు ఒక ప్రత్యేక ఫోన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచింది. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు 9247597066 ఫోన్ నెంబర్ ద్వారా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, నమోదు చేయనున్నారు.

## పోలీసుల ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు పంపవద్దు.

**పెట్టుబడి మోసాలు:** వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో అధిక లాభాలు ఆశ చూపే స్కీమ్‌లను నమ్మకండి. కేవలం సెబి గుర్తింపు పొందిన యాప్స్ ద్వారానే పెట్టుబడులు పెట్టండి.

**ఏపికె ఫైల్స్ :** బ్యాంకుల పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు, ఏపికె ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు.

డిజిటల్ అరెస్ట్: సిబిఐ, ఈడి లేదా పోలీస్ అధికారులు ఫోన్ కాల్స్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయరు. 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం చట్టంలో లేదు. భయపడి డబ్బులు పంపకండి.

**బాధితులు వెంటనే స్పందించండి:** సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయండి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయండి. సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల మీ సొమ్మును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది.

## దుష్ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిల్ల శ్రీధర్ బాబు, కొండ సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన అనంతరం జిల్లాలోని గణపురం మండలం చెల్పూర్ పంచాయతీ పరిధిలోని 8 ఇంక్లైన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. జిల్లాల మార్పు ప్రభుత్వ ఆలోచనలు లేదని ఒకవేళ మార్చదలుచుకుంటే అసెంబ్లీ లోనే ప్రతిపక్ష పార్టీలతో చర్చించిన తర్వాతనే నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. భూపాలపల్లి జిల్లా ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. తెలంగాణ సాధనలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్ర క్రియాశీలకమని అన్నారు. అందులో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల ఉద్యమం, అట్లాగే భూపాలపల్లి సింగరేణి కార్మికులు తెలంగాణ ఉద్యమ సాధనలో ముందున్నారని అన్నారు. భూపాలపల్లి లో సింగరేణి శ్రీకారం చుట్టింది ఆనాటి ఎన్టీఆర్ ప్రభుత్వమని తెలిపారు. సింగరేణి కార్మికులు దేశానికి ఆదర్శమని, కార్మికుల శ్రమ వల్లే దేశానికి వెలుగులు అందుతున్నాయని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను బాధ్యతతో ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల స్వంత ఇంటి కలను, డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించడం, ఇన్కమ్ టాక్స్ రద్దు లాంటి విషయాలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. సింగరేణి బోర్డు రద్దు అనేది ప్రభుత్వ ఆలోచనలో లేదని అవి ప్రతిపక్షాల దుష్ప్రచారాలైనని పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఏ పని కాంగ్రెస్ ప్రభుత్వం చేరని వెల్లడించారు. గత ప్రభుత్వం ఏడాదికి 10 ఏళ్లలో రెండు లక్షల ఇళ్లు నిర్మిస్తే ఈరోజు 20 లక్షల ఇళ్ల నిర్మాణం జరిగేదని పేదవాని ఆత్మగౌరవం భిఆర్ఎస్ పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. 10 ఏళ్లలో కెసిఆర్ కుటుంబానికి ఫామ్ ఫామ్ హౌస్ లు వచ్చాయి కానీ పేదవాని ఆత్మగౌరవమైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందలేదని అన్నారు. సరస్వతీ పుష్కరాలను, మేడారం జాతరను దిగ్విజయంగా జరుపుకున్నామని, 2027లో రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మూడు నాలుగు వేల కోట్లన ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అదిలాబాద్ జిల్లా బాసర నుండి ఖమ్మం జిల్లా భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మోడీ, కేసీఆర్ లు బొమ్మలను చూసి ఓట్లు అడగటానికి పనిచేస్తారని అభివృద్ధికి పనికిరారని ఆరోపించారు. మోడీ కేసీఆర్‌ను చూసి ఓట్లు వేస్తే మోసపోతారు గోసపడతారని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం

# కమ్యూనిస్టులను గెలిపించండి



సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్‌ను గెలిపించండి
ప్రచారంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి

**ప్రజాపక్షం/చండూరు :** 11న చండూరు మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో 4వ వార్డు అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చండూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నాల్గవ వార్డు సిపిఐ అభ్యర్థిగా బరిలో నిలిచిన జెల్లా ధనమ్మ శ్రీనివాస్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పార్టీ నాయకులతో కలిసి డప్పు కళాకారులతో ఉత్సాహభరిత వాతావరణంలో భారీ ర్యాలీగా గడపగడప తిరుగుతూ జెల్లా ధనమ్మ శ్రీనివాస్‌కు మీ అమూల్యమైన ఓటు కంకి కొడవలి గుర్తుపై వేసి గెలించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వార్డు సమస్యలపై అవగాహన ఉన్న జెల్లా ధనమ్మ శ్రీనివాస్‌ను గెలిపిస్తే వార్డు పరిస్కారం కోసం కృషి చేస్తారని అన్నారు. ప్రశ్నించే గొంతుకగా వార్డు సమస్యలపై ఎప్పుడు స్పందించే నిజాయితీ పరులైన జెల్లా ధనమ్మశ్రీనివాస్ కంకి కొడవలి గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా చేనేత మగ్గంను స్వయంగా నేస్తూ చేనేత కార్మికులను ఆప్యాయంగా పలుకరించారు. చేనేత సమస్యలను ,తుర్కకాశీ సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ సత్యం సార్ మా ఓటు మీకే అంటూ వార్డులో ఉన్న చేనేత కార్మికులు, తుర్క కాశీలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, బొల్గూరి నర్సింహ్మా, సిపిఐ చండూరు, మునుగోడు మండల కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, చాపల శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగంటి మల్లేశం, ఇరిగి వెంకటేశం, సిపిఐ నాయకులు, తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మాదగోని విజయలక్ష్మి, బోయపల్లి భిక్షమయ్య, బిక్షంరెడ్డి, కైలాసం, నేతాల రాజు, బరిగెల వెంకటేశ్, దోటి వెంకన్న, లేదన్న సత్యం పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే లక్ష్యం

ఇందిరమ్మ చీరల ఆర్డర్ పోచంపల్లికి ఇచ్చే యోచనలో ప్రభుత్వం
ప్రచారంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రానున్న సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ఇందిరమ్మ చీరల ఆర్డర్ పోచంపల్లికి ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026 ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి ఆమె పోచంపల్లి పురపాలక సంఘం 13 వార్డుల కౌన్సిలర్, చైర్మన్ అభ్యర్థులను గెలుపు కాంక్షిస్తూ పోచంపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నందువల్ల కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధికి సరికొత్త దారులను చూసుకునే అవకాశం వస్తుందని చెయ్యి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. దేశమంతా కాంగ్రెస్ ప్రభంజనం వీస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా పేదల కళ్ళల్లో కొత్త వెలుగులు చూస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల కోసం ఉచిత బస్సు వడ్డీ లేని రుణాలు డ్వాక్రా మహిళల ప్రమాద భీమా వంటి అనేక పథకాలతో రుణ గ్రహీతలు అనువార్య కారణాలవల్ల మరణిస్తే ఆ రుణం ప్రభుత్వమే తీర్చి తీర్చేలా ముఖ్యమంత్రి మహిళల సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని పునరుద్ఘాటించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ప్రజాసేవ అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తులని నిధుల కోసం పోట్లాడి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. చేనేత కార్మికులకు లక్ష, రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసి చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేవలం మున్సిపాలిటీకి పోచంపల్లి మున్సిపాలిటీకి దాదాపు 50 కోట్ల రూపాయలు ఇచ్చి అభివృద్ధి చేస్తుందని అలాగే ఎన్నో పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని పురపాలక ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తడక వెంకటేశం, పాక మల్లేశం, సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే



సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్
చైర్మన్ డా.కె.నారాయణ

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సేవకులకు ఓట్లు వేసి గెలిపించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అవకాశవాదులకు తావివ్వకుండా అభివృద్ధికాముకులకే ఓట్లు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నారాయణ ఆదివారం ప్రచారం నిర్వహించారు. దప్పుకొట్టి రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేడ్కర్‌కు పూలమాలలు వేసిన అనంతరం ఆయన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాభివృద్ధి కోసం కృషి చేసిన ఘనత సిపిఐకు దక్కుతుందన్నారు. కమ్యూనిస్టులు కరపత్రాలతో ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కానీ ఇతర పార్టీలు కరెన్సీ నోట్లతో ప్రజలను కొనుగోలు చేయాలని చూస్తాయని నారాయణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పుణ్యమా అని ఈ ప్రాంతం గురించి తెలియనటువంటి వారు ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు అడుగుతున్నారని అనేక దశాబ్దాల పాటు ఈ ప్రాంతానికి ఏమి చేశారో సమాధానం చెప్పాలని నారాయణ నిలదీశారు. శాసనసభలో ఒక శాసన సభ్యుడు సిపిఐకి ఉంటే ప్రజాసమస్యలపై గళమెత్తుతూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని, కాకుల్లో కోకిల్లా శాసనసభలో సాంబశివరావు వ్యవహరిస్తున్నారని నారాయణ తెలిపారు. ప్రతి ఎన్నికకు పార్టీలు మార్చేవారు ప్రజలకు సేవ చేయరని ఆయన స్పష్టం చేశారు. పార్టీలు మారే వారి స్థానం ఎప్పుడు ఎక్కడ ఉంటుందో తెలియదని కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు మాత్రం ఒకే చోట స్థానం ఉటుందని ఆయన అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో పలు కాలనీలను తొలగించాలని పాలకులు ప్రయత్నించినప్పుడు అడ్డుపడి ప్రజల పక్షాన నిలబడి పోరాడింది సిపిఐ మాత్రమేనని ఆయన తెలిపారు. కంకి కొడవలి గుర్తుకు ఓటు వేస్తేనే ప్రజలకు రక్షణ అని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ గెలుపును ఎవరు నిలుపుదల చేయలేరని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మిడికంటి వెంకటరెడ్డి, మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు దండి రంగారావు, మిడికంటి ధనలక్ష్మి, చెరుకుపల్లి పవిత్ర, మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, దండి శ్రీజ, మిడికంటి అరుణశ్రీ, గుడె వీరభద్రం, చెరుకుపల్లి రజని, సత్తి శ్రీలక్ష్మి, నునావత్ పాండురంగా తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ మద్దతుదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.


## సామాజిక సేవలో జర్నలిస్టులు ముందుండాలి



టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సేవా కార్యక్రమాలలో జర్నలిస్టులు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ సూచించారు. ఆదివారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్ రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యరంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్ తదితరులు ఆయనను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కలిసిన ఈ సందర్భంగా విరాహత్ అలీ ఉప్పల్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిజంలో నానాటికి పెరిగిపోతున్న పెడ ధోరణులను అరికట్టి, జర్నలిజం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు.

**పాత్రికేయుల పాత్ర అభినందనీయం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఎవి శ్రీధర్‌రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్‌క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా కొడవటంచ అభివృద్ధి

సిఎం రేవంత్ రెడ్డి
రూ.12.15 కోట్ల వ్యయంతో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునర్ ప్రతిష్టాపన
రూ.74.15 కోట్లతో అతిథి గృహాలు, అంతర్గత రహదారుల నిర్మాణ పనుల ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో రూ.12.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునర్ ప్రతిష్టాపన పనులు, అలాగే రూ.74.15 కోట్లతో అతిథి గృహాలు, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంభోత్సవం చేసి ఆలయ ప్రాంగణంలో రావి మొక్క నాటారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేవాలయాల పునరుద్ధరణతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు ఆర్థిక ప్రగతి, పర్యాటక అవకాశాలు పెరుగుతాయన్నారు. కొడవటంచ గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ పునర్ ప్రతిష్టాపన అనంతరం భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అతిథి గృహాలు, అంతర్గత రహదారుల నిర్మాణం ద్వారా గ్రామ అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పేరుతో దోచుకున్న కెసిఆర్‌కు బుద్ధి చెప్పాలి



గజ్వేల్ మున్సిపల్ అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తాం
మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో దోచుకున్న కెసిఆర్‌కు గజ్వేల్ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇన్‌ఛార్జి కూన శ్రీశైలం గౌడ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంక్షారెడ్డితో కలిసి ఆదివారం గజ్వేల్, నిర్వాసిత గ్రామాలలో ఆయన కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో సర్వం కోల్పోయిన ముంపు బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఈ అంశం ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉన్నట్లు చెప్పారు. అయినప్పటికీ తన వంతు ప్రయత్నంగా సమస్యలన్నింటికీ కృషి చేయడంతో పాటు వారిని అన్ని రకాలుగా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కెసిఆర్, హరీష్ రావుల తప్పుడు నిర్ణయాలతో మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా పథకాలను పేదలకు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గ కార్యకర్తల కృషితో సర్పంచులను గెలిపించుకున్నట్లుగానే, గజ్వేల్ మున్సిపల్‌ను దక్కించుకుందామని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తుండగా, ఇటీవల రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మహిళల కోసం రూ.50 వేల కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తుండగా, గ్రామాల్లోని పేదలకు ఇండ్ల నిర్మాణానికి నిధులు, అంతేకాకుండా సన్న బియ్యం ఇవ్వడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ ఎంపీపీ మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త పాల్గొన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంలో కెటిఆర్ హస్తం! : ఎంపి చామల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం వెనుక కుట్ర ఉంటే అందులో మాజీ మంత్రి తారక రామారావు హస్తం ఉందన్న అనుమానం కలుగుతోందని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ అంశంలో కెటిఆర్ ఆయన కుటుంబం విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యం తనకు ఈ అనుమానం ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగానే ఎస్ఐబి ఆఫీస్‌లో సీసీ కెమెరాలు బంద్ చేసి ఇజ్రాయెల్ నుంచి తెచ్చిన పరికరాలు, ఫైల్స్ మొత్తం ధ్వంసం చేసి మూసీ నదిలో పారవేసిన బిఆర్‌ఎస్ చరిత్రను గతంలో తెలంగాణ ప్రజలు చూశారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి బిఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని తెలిసే కెటిఆర్ సిఎంపై విష ప్రచారం చేస్తే ఓట్లు వస్తాయని చిల్లర ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ వివరాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఉన్నాయని అందుకే ముందే వచ్చి కెటిఆర్ రేవంత్ రెడ్డిపై అబాండాలు వేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఏళ్లు పాలించిన బిఆర్‌ఎస్ పూర్తిగా అప్పుల పాలు చేసిందన్నారు. కెటిఆర్ కుటుంబం తెలంగాణ ప్రజలను క్షమించమని కోరాలని చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ భూములు అమ్మొద్దు



ఆ స్థలాల్లో బిసి హాస్టళ్లు, గురుకులాలను నిర్మించండి
విద్యార్థుల సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ప్రభుత్వ భూములను వేలం వేసే బదులు ఆ స్థలాలను బిసి హాస్టళ్ళు, గురుకులాల స్వంత భవనాల నిర్మాణానికి వినియోగించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలహీనవర్గాల వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య చదివేలా అదనంగా 150 బిసి కాలేజ్ హాస్టళ్ళు, 240 రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సి.రాజేందర్ అధ్యక్షతన జరిగిన విద్యార్థుల కోర్ కమిటీ సమావేశానికి ఎంపి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. హాస్టళ్ళ నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, ప్రజల ఆస్తులను ప్రజా అవసరాలకు, పేదల ఇండ్ల నిర్మాణాలకు, ప్రభుత్వ ఆఫీసులకు, పాఠశాలల నిర్మాణానికి ఉపయోగించాలే కానీ, అమ్మడానికి కాదన్నారు. భవన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం 80 శాతం ఇస్తుందన్నారు. అలాగే మల్టీ నేషనల్ కంపెనీల నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ తీసుకొని భవనాలు నిర్మించాలన్నారు. దీనికి ఎంపీగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో గత 27 ఏళ్లుగా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 325 హాస్టళ్ళకు గాను 320 బీసీ గురుకులాలకు స్వంత భవనాలు లేవన్నారు. దీంతో ఐదు మంది ఉండాల్సిన గదుల్లో 20 నుంచి 30 మంది ఉంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ప్రభుత్వ స్థలాల్లో హాస్టళ్లు, గురుకులాలు కట్టివ్వాలని కోరారు. నీలం వెంకటేశ్, అనంతయ్య సమన్వయకర్తగా వ్యవహరించిన సమావేశంలో బిసి సంఘం నేతలు శివ కుమార్ యాదవ్, మల్లేష్ యాదవ్, జిల్లపల్లి అంజి, చిక్కుడు బాలయ్య, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గాల్వాన్ ఘర్షణ తర్వాత

# చైనా రహస్య అణుపరీక్ష

అమెరికా ఆరోపణ



**వాషింగ్టన్:** గాల్వాన్ లోయలో భారత్–చైనా సైనికులమధ్య ప్రాణాంతక సంఘర్షణ జరిగిన కొద్ది రోజులకు రహస్యంగా చైనా ప్రభుత్వం అణు పరీక్ష నిర్వహించిందని అమెరికా ఆరోపించింది. అమెరికా ఆయుధాల నియంత్రణ–అంతర్జాతీయ భద్రతకు సంబంధించిన విదేశీ సహాయమంత్రి థామస్ జి.డినన్నో జెనీవాలో గడచిన శుక్రవారం (ఫిబ్రవరి 6) జరిగిన ఐక్యరాజ్యసమితి నిరాయుధీకరణ సదస్సులో ఈ విషయం చెప్పారు. అదే రోజు ఎక్స్ వేదికగా ఆయన పోస్టింగ్ చేశారు. అమెరికా–రష్యా మధ్య ''న్యూ స్టార్ట్'' ఒప్పం దం (వ్యూహాత్మక ఆయుధాల కుదింపు ఒప్పందం), దాని నిబంధనల పరిమితులు ఫిబ్రవరి ఐదో తేదీనాటికి అధికారికంగా కాలంచెల్లింది. దీనిపై ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ చైనా రహస్య అణ పరీక్ష ప్రస్తావన చేశారు. ''ద ఎకనామిక్ టైమ్స్' ఆదివారం ఉదయం ఈ వార్త ప్రచురించింది. ఈ 'న్యూ స్టార్ట్' ఒప్పందం పునరుద్ధరణకు చైనాను కూడా భాగస్వామిగా చేరాలని అమెరికా ఒత్తిడి చేసినాగానీ అందుకు చైనా తిరస్కరించింది. ఈ ఒప్పందాన్ని ఐదు సంవత్సరాలపాటు పొడిగించినాగానీ దానివల్ల అమెరికాకు ప్రయోజనం లేదని, అందువల్ల మరింత మేలైన ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారని డినన్నో చెప్పారు. చైనా తన అణ్వాయుధాలను రెట్టింపు చేసుకోవాలని భావిస్తోందని, జాతీయ వ్యూహాత్మక రక్షణ విధానానికి అనుగుణంగా చైనా చరిత్రాత్మకస్థాయిలో శరవేగంగా తన సైన్యం పరిమాణాన్ని, ఆయుధాలను విస్తరించుకోవడం కళ్ళారా చూస్తున్నామని, ఈ నేపథ్యంలో చైనా కూడా న్యూ స్టార్ట్ ఒప్పందంలో భాగస్వామిగా ఉండాలని సదస్సులో ఆయన ప్రతిపాదిస్తూ చైనా రహస్య అణు పరీక్ష గురించి చెప్పారు.

''చైనా అణు పేలుడు పదార్థాల పరీక్షలు నిర్వహించింది, వాటిల్లో వందల టన్నులకు సరిపడేవిధంగా సిద్ధమయ్యేవిధంగా నమూనా ఫలితాలు సాధించడానికి ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు నిర్వహించేటప్పుడు విపరీతమైన ప్రకంపనలు పుడతాయి. ఈ ప్రకంపనలు ఇతరచోట్ల నమోదవుతాయి. ఈ విధంగా అణుపరీక్షల ప్రకంపనలు నమోదు కాకుండా, పేలుడు కార్యకలాపాలను ప్రపంచం నుండి దాచడానికి, పేలుడు ప్రభావాన్ని తక్కువ చేయడం కోసం 'డీకప్లింగ్' అనేక ఒక విధానాన్ని చైనా ఉపయోగించింది. ఈ విధంగా 2020 జూన్ 22వ తేదీన చైనా అణు పరీక్ష నిర్వహించింది'' అని థామస్ జి.డినన్నో తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. చైనాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన, సరిహద్దు వివాద పరిష్కారం, వాణిజ్య సంబంధాల పురోగతికి ముమ్మర కార్యకలాపాలు, సుంకాల బెడదవల్ల అమెరికా నుండి భారత్ కొంచెం దూరంగా జరిగే పరిస్థితులు తలెత్తిన పరిణామాలు గత ఏడాది సంభవించాయి. ఈ కొత్త సంవత్సరంలో రష్యా నుండి భారత్‌ను దూరం చేసేందుకు చమురు కొనుగోలును క్రమంగా తగ్గించేందుకు ఒత్తిడి చేయడంతోపాటు అమెరికా–భారత్ మధ్య పూర్తిస్థాయి బిటిఏకు ముందుగా కుదిరిన ఒక తాత్కాలిక ఒప్పందం పూర్వరంగంలో థామస్ డినన్నో పోస్టింగ్ ప్రాముఖ్యత సంతరించుకుంది.

గాల్వాన్ లోయలో భారత్–చైనా సైనికులమధ్య ప్రాణాంతకమైన ఘర్షణ జరిగిన వారం రోజులకు ఈ అణు పరీక్ష చైనా నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. లడఖ్‌లోని వివాదాస్ప పాంగాంగ్ సరస్సు, టిబెట్ అటానమస్ రీజియన్ సమీపంలో, సిక్కిం–టిబెట్ అటానమస్ రీజియన్ మధ్య సరిహద్దు సమీపంసహా, సరిహద్దుల వెంట పలు ప్రాంతాలలో 2020 మే నెల ఐదో తేదీ నుండి రెండు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణలు ప్రారంభమయ్యాయి. వాస్తవ నియంత్రణ రేఖ వెంట ఉన్న తూర్పు లడఖ్ ప్రాంతాల సరిహద్దుల్లో కూడా ఘర్షణలు కొనసాగాయి. మే నెలాఖరునాటికి గల్వాన్ లోయలో భారత్ రహదారి నిర్మాణ కార్యక్రమాన్ని చైనా దళాలు వ్యతిరేకించాయి. భారత ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం జూన్ 15,16 తేదీలలో జరిగిన పోరాటంలో భారత్–చైనా సైనికులు మరణించారు. భారత్ తరపున 20 మంది సైనికులు ప్రాణత్యాగం చేశారు. ఇరు దేశాల సైనికులు పరస్పరం నిందించుకున్నారు. తర్వాత ఆగస్టు 30న భారత సైన్యం హెచ్చరిక కాల్పులు చేసింది. ఈ సరిహద్దుల్లో 45 సంవత్సరాల తర్వాత మొదటి సారి సెప్టెంబరు ఏడో తేదీన కాల్పులు జరిగాయి. ఈ పరిణామాలకు ముందే ఇరువైపులా సైనికులు మరణించిన (జూన్ 16) తర్వాత ఆరు రోజులకు చైనా అణు పరీక్షలు చేసిందని డినన్నో పేర్కొన్నారు. గూఢచారి వర్గాల సమాచారం ప్రకారం 30 మంది చైనా సైనికులు, 20 మంది భారత సైనికులు ఆరోజు గాల్వాన్ పోరాటంలో మరణించారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
6-1-50. కార్పొరేట్ కార్యాలయం, మింట్ కాంపౌండ్, హైదరాబాద్-500 063.

**షార్ట్ టెండర్ నోటీస్**

Tender Notice No: 19/2025-26 of SE/Civil/Corporate office/Mint Compound/Hyd, Dt : 06.02.2026.

సంతకం చేసిన వ్యక్తి ఈ క్రింది పనులకు టెండర్లను ఆహ్వానించడమైనది.

1) టెండర్ స్పెసిఫికేషన్ నెం.40/2025-26-హైదరాబాద్ కార్పొరేట్ ఆఫీస్, A & B బ్లాక్‌ల్లో ఇతర కార్యాలయాలు, ఫైనాన్స్ HRD, ECCC, ఇతర కార్యాయాలలో ఆఫీస్ ఫర్నీచర్, ఎలక్ట్రికల్ ఫిక్చర్స్, ఇతర సివిల్ పనులను అందించడం. (వడ్డెర / నగర కోసం రిజర్వ్ చేయబడింది) (2nd call)
2) టెండర్ స్పెసిఫికేషన్ నెం. 47/2025-26-హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ వైరింగ్ ఉపకరణాలు, PVC Casing, మోడ్యులర్ స్విచ్ గేర్, LED లైటింగ్ ఫిక్చర్స్, అసోసియేటెడ్ సర్ఫేస్ బాక్స్‌ల సరఫరా ఇన్‌స్టాలేషన్ (ఎస్‌సి కేటగిరీ కోసం రిజర్వ్ చేయబడింది).
3) టెండర్ స్పెసిఫికేషన్ నెం.48/2025-26 ఉపకరణాల సరఫరా మరియు బిగింపు సహా ఎలక్ట్రికల్ పనుల నిర్వహణ, LED లైటింగ్ ఫిక్చర్స్, సిసిటివి కెమెరాలు, డోర్ హార్డ్‌వేర్, కర్టెన్లు మరియు వాటర్ డిస్పెన్సర్ కంప్రెసర్ కార్పొరేట్ కార్యాలయం, TGSPDCL, మింట్ కాంపౌండ్ , హైదరాబాద్ వద్ద (ఎస్‌సి కేటగిరీ కోసం రిజర్వ్ చేయబడింది).
4) టెండర్ స్పెసిఫికేషన్ నెం. 49/2025-26-హైదరాబాద్‌లోని TGSPDCL కార్పొరేట్ ఆఫీస్‌లోని అన్ని బ్లాక్‌లలో అనుబంధ భాగాలతో కూడిన ఎయిర్ కూలర్ల సరఫరా, ఇన్‌స్టాలేషన్ మరియు మరమ్మతులు.

వివరణాత్మక స్పెసిఫికేషన్ల కోసం అర్హత ప్రమాణాలు మరియు ఇతర నిబంధలు మరియు షరతులు మొదలైన వాటికోసం www.tgsouthernpower.com వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం దయచేసి SE/Civil/ Corporate office/TGSPDCL/Hyderabadను సంప్రదించగలరు. టెండర్ అమ్మకానికి చివరి తేదీ: **17.02.2026** మరియు టెండర్ ప్రారంభ తేదీ: **18.02.2026.**

ఫోన్ నెం. **8712468186** సం/-
Fax No. 23431006 సూపరింటెండింగ్ ఇంజినీర్/Civil/TGSPDCL
DIPR R.O. No. : 15107-PP/CL/ADVT/1/2025-26, Date: 07-02-2026

## తిరుపతి లడ్డు ఘటనపై ఏకసభ్య కమిటీతో విచారించాలి




**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** పవిత్ర తిరుమల తిరుపతి లడ్డు విషయంలో ఏకసభ్య కమిటీచే విచారణ జరిపించాలని శ్రీ శివ పీఠం అధిపతి శివ స్వామి కోరారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏడుకొండలపైన కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదం వివాదం నెలకొనడం విచారకరమన్నారు. ప్రస్తుతం దర్యాప్తు ముగింపు నివేదికలో నెయ్యి ప్రస్తావనే ఉన్నదని , అసలు ఆ ప్రసాదంలో ఏమి కలిపారో స్పష్టంగా లేదని, ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరగాల్సి ఉన్నదని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో దర్యాప్తు సంస్థలు నివేదికలు వెల్లడించే వరకు దీనికి రాజకీయం చేయకుండా వివాదస్పద వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. ఈ ఘటనను రాజకీయ అవసరాలకు వాడుకొంటే హిందువుల మనోభావాలు దెబ్బతినే ఆస్కారం ఉన్నదని, ఇలాగే కొనసాగితే సమస్య మరో రూపం దాల్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

## క్రీడాకారిణి స్రవంతికి మైత్రీ సేవా ఫౌండేషన్ అండ




రూ.లక్ష అందజేసిన ఫైట్‌మాస్టర్ రామ్, లక్ష్మణ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** క్రికెట్‌లో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణి బొడ్డుపల్లి స్రవంతికి అన్ని రకాలుగా అండగా ఉంటామని మైత్రీ సేవా ఫౌండేషన్ ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఫైట్ మాస్టర్లు రామలక్ష్మణ్ హాజరై, స్రవంతికి తమవంతు సాయంగా రూ. 1 లక్ష చెక్కును అంజేశారు. అలాగే ఫౌండేషన్ తరపున క్రికెట్, న్యూట్రిషియన్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ చెడువ్యసనాలకు లోనై అనేక మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి తరుణంలో పట్టుదలతో స్రవంతి క్రికెట్ నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదుగుతున్న స్రవంతిని వారు అభినందించారు. మైత్రి సేవా ఫౌండేషన్ తన వంతు సాయంగా క్రీడాకారిణి స్రవంతిని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ అలమయ్య నాయుడు మాట్లాడుతూ స్రవంతి ఆరేండ్ల వయస్సు నుంచే క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఆ క్రీడలో కష్టపడి రాణించిందన్నారు. అండర్ 19 రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్రవంతి ఆడారని తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ తిరుపతయ్య, రాజేశ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ జగదీశ్, కోచ్ నజీర్, నిర్వహకులు వెంకట్, స్రవంతి తల్లిదండ్రులు బాలమణి, శ్రీనివాస్, నానమ్మ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నగరవ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు


కేవలం రెండు రోజుల్లో 604 మందిపై కేసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగర రహదారులపై భద్రతను పటిష్టం చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీ సంఖ్యలో మందు బాబులు పట్టుబడ్డారు. నగరవ్యాప్తంగా 6,7 తేదీల్లో నిర్వహించిన ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 604 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన 604 మందిలో ద్విచక్ర వాహనదారులు 492, త్రీవీలర్ (ఆటోలు) 42, ఫోర్‌వీలర్, ఇతర వాహనాలు 70 ఉన్నారని, మద్యం మోతాదు స్థాయిలు పరిగణిస్తే 30/50 ఎంజి 141 కేసులు, 51/100 ఎంజి 238, 101/150 ఎంజి 127, 151/200 ఎంజి 61, 201/250 ఎంజి 25, 251/300 ఎంజి 07, 300 ఎంజి పైబడి 05 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలకే కాకుండా ఇతర అమాయక పాదచారుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఉల్లంఘనల పట్ల తాము 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నామని, ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని జోయల్ డేవిస్ విజ్ఞప్తి చేశారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో బాబా శ్యామ్ నిషాన్ రథ యాత్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫల్గుణి ఏకాదశి వేడుకలలో భాగంగా శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 'బాబా శ్యామ్ (శ్రీ కృష్ణుడు) నిషాన్ (జండా) రథ యాత్ర' నిర్వహించారు. హైదరాబాద్ చార్మినార్, మహదేవ్ మందిరం వద్ద ప్రారంభమైన రథ యాత్ర కాచిగూడ శ్రీ శ్యామ్ బాబా మందిరం వరకు కొనసాగింది. దారిపొడవునా భక్తులు పూల వర్షం కురిపిస్తూ నిషాన్ యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబా శ్యామ్ రథశోభ యాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్, వైస్ చైర్మన్లు రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తం దాస్ గోయల్‌లు మాట్లాడుతూ అత్యంత వైభవంగా నిర్వహించిన బాబా శ్యామ్ రథయాత్రలో భక్తుల వెల్లువ, భక్తికి ఒక అపురూప దృశ్యం అని, దుఃఖాలు, బాధలు తొలగిపోతాయని, అచంచలమైన విశ్వాసంతో కాలినడకన నిషాన్ యాత్ర చేసే భక్తులపై బాబా శ్యామ్ ప్రత్యేక ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. ఈ యాత్రలో కమిటీ సలహాదారు చంద్రకాంత్ దకోటియా. కన్వీనర్లు అమిత్ అగర్వాల్, రాంనిరంజన్ అగర్వాల్, సంతోష్ అగర్వాల్, నర్సింగ్ జైస్వాల్, జీవన్ భాటి, అభిషేక్ శర్మ, సుశీల్ అగర్వాల్, గోవింద్ పొద్దార్, శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ దకోటియా, ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్ బడేగావ్వాలే, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కోశాధికారి కపిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకత్వం-సారత్విక సందేశం



**ప్రజాపక్షం/ఇందిరాపార్క్:** దక్షిణ భారత సంత్ నిరంకారి సమాగమం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో దక్షిణ భారత సంత్ నిరంకారి సమాగమం రెండు రోజుల పాటు జరిగింది. సద్గురు మాతా సుదీక్షా జీ, నిరంకారి రాజపిత రమిత్‌జీ పాల్గొని.... ప్రేమ, శాంతి, సామరస్యం, సోదరభావం లక్ష్యంగా ఏకత్వంసారత్విక సందేశాన్ని భక్తులకు అందించడం జరిగింది.

# భారత్–మలేసియా సహకార విస్తరణ

కౌలాలంపూర్‌లో మోదీ వెల్లడి



**కౌలాలంపూర్:** గత ఏడాది రికార్డుస్థాయిలో ప్రపంచ పర్యటనలు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కొత్త సంవత్సరం మొదట మలేసియాతో పర్యటనలు ప్రారంభించారు. శనివారం ఆయనకు కౌలాలంపూర్‌లో ఘన స్వాగతం లభించింది. ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం, మానవ వనరుల మంత్రి రమణన్ రామకృష్ణన్, విదేశీశాఖ డిప్యూటీమంత్రి లుకనిష్మన్ బిన్ అవాంగ్ సౌని, ఇతర ఉన్నతాధికారులు విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం పలికారు, ఈ సందర్భంగా పెర్దనాపుత్ర వద్ద సైనిక వందనం స్వీకరించారు. మలేసియా ప్రధానమంత్రితో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇరు దేశాలమధ్యా ఎంతో బలమైన మైత్రీబంధం ఉందని ఉద్ఘాటించారు. మలేసియాలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తమిళ వలస ప్రజల సంతతి, తమిళభాషతో అనుసంధానమైన మలేసియాలో 'తిరువళ్ళువర్ పీఠం' ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.
రెండు దేశాల మధ్యా భాగస్వామ్యం, పరస్పర విశ్వసనీయతలను లోతుగా విస్తరించుకుంటాయన్నారు. రెండు దేశాలమధ్యా ఒక ప్రత్యేక అనుబంధం ఉందని, ఇరుదేశాలమధ్యా వివిధ రంగాలలో సహకారం కూడా విస్తరిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి భారతీయ సంతతితో సమావేశమయ్యారు. వారికి అభివాదాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. రామాయణగాథను భరతనాట్య ప్రదర్శన, మలేసియా మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనలను ఆయన తిలకించారు. మలేసియాలో భారత సంస్కృతికి వెల్లివిరుస్తోందని ఆయన అన్నారు. మలేసియా–భారత్ వారసత్వ సంఘ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. భారత్–మలేసియా సంబంధాల్లో సంస్కృతభాష చారిత్రక పాత్ర అనే అంశంపై రాసిన ఒక పుస్తకాన్ని ఈ సంఘం సభ్యులు బహుమతిగా ఆయనకు ఇచ్చారు. భారత సంతతి తనకు పలికిన ఘనస్వాగతాన్ని ఎన్నటికీ మరచిపోనని ఆయన అన్నారు. రెండు రోజుల పర్యటన భారత్–మలేసియా మధ్య ఉన్న లోతైన ద్వైపాక్షిక అనుబంధానికి చిహ్నమని విదేశీమంత్రిత్వశాఖ పేర్కొంది.

# ప్రభుత్వ స్థలంలో భవనాలు నిర్మించండి




ప్రభుత్వానికి దాసారం బస్తీవాసుల వేడుకోలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఆర్ నగర్ డివిజన్ పరిధిలోని దాసారం బస్తీలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రజాప్రయోజనార్థం భవనాలు నిర్మించాలని దాసారం బస్తీ సంక్షేమ సంఘం నేతలు కోరారు. ఆదివారం దాసారం బస్తీలో దాసారం బస్తీ అధ్యక్షులు పోతురాజు కుమార్, బస్తీవాసులు విక్రమ్ పంతులు, ఎస్.ఉషారాజ్, పి.రాజనర్సింగ్, బాలయ్యనగర్ వెస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షులు సిహెచ్ సుధీర్ కుమార్, జనరల్ సెక్రటరీ పి.శ్రీనివాస్, రవీందర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. బస్తీలోని మిగులు స్థలంలో నిరంతరం చెత్త డంపింగ్ చెత్త వాహనాల అక్రమ పార్కింగ్ వల్ల తమ ప్రాంత ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను మొత్తం ఇక్కడికి తీసుకొచ్చి చెత్తతో నిండిన వాహనాలను గంటల తరబడి కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి ఇక్కడే నిలిపి వేస్తున్నారని ఆరోపించారు. ఈ చెత్తలో కుళ్లిపోయిన వ్యర్థాలు, జంతువుల కళేబరాలు ఉండటం వలన భరించలేని దుర్వాసనతో పాటు అత్యంత అనారోగ్యకర వాతావరణం ఏర్పడిందని తెలిపారు. ఈ ప్రాంతం ప్రసుత్తం దోమలు, ఈగలు, ఎలుకలు, వీధి కుక్కలు పెరగడం వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చెత్త డంపింగ్, చెత్త వాహనాల పార్కింగ్‌ను శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. బస్తీలోని మిగుల స్థలంలో సాయంత్రం వేళలో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని, ఇక్కడ పోలీస్ గస్తీని ముమ్మరం చేయాలని కోరారు. సమావేశంలో దాసారం బస్తీ, సి టైప్ క్వార్టర్స్, రవీందర్ నగర్ కాలనీ, బాలయ్య నగర్, వెస్ట్ పరిసర రెసిడెన్షియల్ కాలనీల సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పదేళ్ల దోపిడీని ఎందుకు అడ్డుకోలేదు?

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ప్రభుత్వం గత 10 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుంటుంటే కేంద్ర మంత్రిగా జి.కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు అడ్డుకోలేకపోయారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లక్ష్యంగా ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తన ఉనికిని చాటుకోలేక, పరోక్షంగా బీజేపీకి 'అవయవదానం' చేసి గెలిపించిందని ఎద్దేవా చేశారు. ఆ కృతజ్ఞతతోనే ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టి, బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకుంటుంటే కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని, అప్పుడు తన 'జేబు సంస్థలైన' ఐటీ, సీబీఐ, ఈడీలను ఎందుకు ప్రయోగించలేదని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి గురించి ఆలోచించని కిషన్ రెడ్డి తీరు వల్ల రాష్ట్రం మిగులు హోదాను కోల్పోయిందని, ఆయన ఒక రాష్ట్ర ద్రోహిగా మిగిలిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కూడా చామల నిప్పులు చెరిగారు. తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యమని, నిధులన్నీ ఏపీ, బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాలకే మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల పాలవుతుంటే గతంలో బీజేపీ అధ్యక్షుడిగా ఉండి ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను విమర్శించే నైతిక హక్కు సంజయ్‌కు లేదని, 420 హామీలంటూ మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బండి సంజయ్ ఒక కేంద్ర మంత్రి అనే విషయాన్ని మర్చిపోయి, ఇంకా కరీంనగర్ కార్పొరేటర్ స్థాయిలోనే ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్, మెట్రో ఫేజ్2 వంటి కీలక ప్రాజెక్టుల గురించి కేంద్ర మంత్రులు నోరు మెదపడం లేదని విమర్శించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కాబోతోందని చామల జోస్యం చెప్పారు. కేసీఆర్ పై చర్యలు తీసుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేయడం హాస్యాస్పదమని, నిజానికి వైఫల్యాలకు బాధ్యత వహించి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర మంత్రులుగా ఉండి కూడా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన వీరి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలలో 'బిసిల ఓటు బిసిలకే'

బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయి వరకు బిసిలు ఎదగాలని, తెలంగాణ రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికలలో రాజకీయ పార్టీలకు అతీతంగా 'బిసిల ఓటు బిసిలకే' వేసి అత్యధిక స్థానాలలో బిసి అభ్యర్థులను గెలిపించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బిసి జెఎసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అధ్యక్షతన, బొల్లెపల్లి స్వామి సమన్వయంతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటిలు, మూడు కార్పొరేషన్‌లలో జరుగుతున్న ఎన్నికలలో 'ఓటు మనదే సీటు మనదే', 'బిసిల ఓటు బిసిలకే' అనే నినాదంతో బిసి బిడ్డలను గెలిపించి, తెలంగాణ రాష్ట్రంలో బిసిల రాజకీయ ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల లాగానే, మున్సిపల్ ఎన్నికలలో కూడా రాష్ట్రంలోని 136 కులాల బిసిలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు ఏకమై, ఓటు అనే ఆయుధంతో అగ్రకులాలను ఓడించి, తెలంగాణలో బిసి రాజ్యాధికారానికి పునాదులు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, జెఎసి నేతలు మాదేశి రాజేందర్ గంగపుత్ర, గజ్జల సత్యరాజ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, మహేష్ మేరు, నయనంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ జైలు అధికారుల నిర్లక్ష్యం
# అవామీలీగ్ మాజీమంత్రి సేన్ మృతి



**ఢాకా:** బంగ్లాదేశ్ పార్లమెంటు మాజీ సభ్యుడు, షేక్‌హసీనా మంత్రివర్గంలో పనిచేసిన మైనారిటీల తరపు ప్రజానాయకుడు రమేశ్ చంద్రసేన్‌కు సకాలంలో వైద్య సేవలు లభించకపోవడంతో మరణించారు. ఆయన వయసు 86 సంవత్సరాలు. బంగ్లాదేశ్‌లో ఆయన ఐదుసార్లు పార్లమెంటు సభ్యుడుగా గెలిచారు. మంత్రిగా పనిచేశారు. చివరిసారి 2024 ఎన్నికల్లో ఆయన ఎంపీగా గెలిచారు. ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించి ప్రజాదరణపొందిన నాయకుడుగా ఎదిగారు. 2024 ఆగస్టు 16న మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేస్తుండగా పోలీసులు ఆయనను చేతులకు సంకెళ్ళువేసి తీసుకువెళ్ళారు. అప్పటినుండీ హత్యకేసులు సహా అనేక కేసులు బనాయించి ఏడాదిన్నరకాలంగా ఎలాంటి విచారణ లేకుండా బంధించారు. పరిస్థితి విషమించిన చివరిదశలో దినాజ్‌పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఆయన మరణించారని వైద్యులు ప్రకటించారు. జైలు అధికారుల నిర్లక్ష్యంవల్లే ఆయన మరణించారని బంధువులు విమర్శించారు. కొద్దిరోజులుగా ఆయన ఆరోగ్యం బాగోలేదు. తనకు చికిత్సఅవసరమని, వైద్య సేవల నిమిత్తం బెయిలు ఇవ్వాలని అనేకసార్లు లిఖితపూర్వకంగా విజ్ఞప్తులు చేసినప్పటికీ జైలు అధికారులు, న్యాయవ్యవస్థ కూడా ఆయన గోడు పట్టించుకోలేదు. బంధువులు ఎంత ప్రయత్నం చేసినా గానీ సేన్‌ను విడుదల చేయనీయకుండా పలు కేసులు బనాయిస్తూ వచ్చారని, బెయిలు లభించకుండా చేశారని బంధువులు పేర్కొన్నారు. దేశ తాత్కాలిక అధినేత మహ్మద్ యూనుస్ ఈ ఘటనకు బాధ్యత వహించి సమాధానం చెప్పాలని అవామీలీగ్ డిమాండ్ చేసింది. గత ఏడాది బంగ్లాదేశ్ జైలులో 107 మంది విచారణ లేకుండానే మరణించారని, వీరిలో ఎక్కువ మంది అవామీలీగ్ నాయకులేనని, దేశంలో మానవ హక్కులు కాలరాశారని బంగ్లాదేశ్ అవామీలీగ్ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి షఫియుల్ అలమ్ చౌద్రీ నాదల్ విమర్శించారు. అలాంటి వృద్ధ నాయకుడిపై అక్రమ కేసులు బనాయించి చేతులకు బేడీలువేసి జైలుకు లాక్కెళ్ళారని, ఆయనకు సరైన వైద్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఎక్స్ వేదికగా నాదల్ పోస్టింగ్ పెట్టారు.

## ఆకట్టుకున్న జీవనది నాటకం



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో రిషాన్ సాహిత్య సాంస్కృతిక ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐటీడీఈఎస్ కోఆపరేటివ్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ ఆవరణలో జరిగిన జీవనది నాటకం ఆహుతులను ఆకట్టుకున్నది. బండ రాజగోపాల్‌రావు దర్శకత్వంలో టీవీ నటులు ఐరేణి రమేష్‌గౌడ్, వాసన్ ప్రధాన పాత్రలు పోషించి నటకాన్ని రక్తికట్టించారు. కార్యక్రమంలో ఓలేటి శ్రీనివాసాచార్యులు, దొంతి జంగయ్యగౌడ్, మాదుగుల కృష్ణమోహన్, లక్ష్మణ్‌స్వామి, శ్యామల, జ్ఞానేశ్వర్, చిలుక ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ తీవ్ర నేరం

ఉల్లంఘనులపై నిరంతరం నిఘా : జోయల్ డేవిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాహనాల నంబర్ ప్లేట్లను మార్చడం, ట్యాంపరింగ్‌కు పాల్పడటం తీవ్రమైన నేరమని, అటువంటి వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ హెచ్చరించారు. నంబర్ ప్లేట్ మార్చి ఇతర వాహనదారుడిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఒక వ్యక్తిని చాదర్‌ఘట్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మలక్‌పేటకు చెందిన సయ్యద్ అలీవుద్దీన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం అసలు నంబర్ TS11EZ2936ను కావాలనే TS11 EZ2836గా మార్చి వాడుతున్నాడనీ, ఈ క్రమంలో అసలైన వాహన యజమాని ఫహీమ్ అలీ, తన వాహనంపై వరుసగా ట్రాఫిక్ చలాన్లు వస్తున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం బయటపడిందన్నారు. నిందితుడు చేసిన ఉల్లంఘనల వల్ల, అసలు యజమాని వాహనంపై 23 చలాన్లు తప్పుగా నమోదయ్యాయని, దీంతో నిందితుడిపై చాదర్‌ఘట్ పోలీస్ స్టేషన్‌లో ఎంవి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి మోసాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, నగరంలోని సిసిటివి, ఏఎన్‌పిఆర్ కెమెరాల ద్వారా ఇటువంటి ట్యాంపరింగ్ కేసులను సులభంగా గుర్తిస్తున్నామని ఆయన వెల్లడించారు. మీ వాహన నంబర్ ప్లేట్లు ఎవరైనా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే వెబ్‌సైట్: https://echallan.ts police.gov.in, ఈ మెయిల్:echallan helpdesk.hyd@gmail.com, వాట్సాప్ నంబర్: 8712661690లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తప్పుడు నంబర్ ప్లేట్లు వాడటం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై నిఘా ఉంటుందని జోయల్ డేవిస్ స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్‌ది దిగజారుడు రాజకీయాలు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ లబ్ధి కోసమే బిఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. యాసంగిలో మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, ఇప్పటివరకు 8.42 లక్షల మెట్రిక్ టన్నులను తెప్పించామని, ఇందులో 7.60 లక్షల మెట్రిక్ టన్నులను రైతులకు అందించామని వివరించారు. గతంలో సిద్దిపేట, గజ్వేల్‌లో ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడి రైతులు మరణించిన ఘటనలను బిఆర్ఎస్ విస్మరిం చిందన్నారు. ప్రస్తుతం సాంకేతిక సమస్యతో ఒకటి, రెండు చోట్ల రైతుల రద్దీ పెరిగితే, దీనిని కూడా బిఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి వేస్తే ఉరి అని చెప్పిన బిఆర్ఎస్ నాయకులకు వరికి బోనస్ అంశంపైన మాట్లాడే నైతిక హక్కు ఉందా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ గత పదేళ్ల కాలంలో రైతులను ఏ విధంగా గోస పెట్టారో రాష్ట్ర రైతులకు తెలుసని, తాము వచ్చిన రెండేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చామనే విషంం కూడా రైతులకు తెలుసు అని ఆయన చెప్పారు. యాసంగి సీజన్‌లో రైతులు కొనుగోలు చేయకుండానే 7.60 లక్షల టన్నులు యూరియా అమ్ముడుపోయిందా? అని ప్రశ్నించారు. గత వానా కాలంలో కేంద్రం నుండి తగిన సమయంలో ఎరువులు సరఫరా కాకపోవడంతో కొన్ని రోజుల పాటు ఇబ్బందులకు గురైన అంశాన్ని బిఆర్ఎస్ తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నప్పటికీ, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఆ పార్టీకి రైతులు కర్రుకాల్చి వాత పెట్టారని అన్నారు. గతంలో మొక్కజొన్న, కంది, పత్తి వద్దని పరిమితులు విధించారని, పంట కాలనీలు, ఎరువులు ఉచితం అని బిఆర్ఎస్ అన్నదని తుమ్మల గుర్తు చేశారు.

**ఈ పాస్ మిషన్ల ద్వారానే ఎరువుల విక్రయాలు అనేది తెలియదా?**

ఎరువుల విక్రయాలు ఈ.పాస్ మిషన్‌ల ద్వారా జరుగుతాయనే విషయం పదేళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్‌కు తెలియదా? అని మంత్రి తుమ్మల ఎద్దేవా చేశారు. అన్ని జిల్లాల్లో రైతుల అవసరం మేరకే యూరియా బస్తాలను సరఫరా చేస్తున్నప్పటికీ, రైతులలో ఆందోళన సృష్టించేందుకు బిఆర్ఎస్ నాయకులు యూరియా, యాప్ అంటూ మాట్లాడుతుంటే రైతులు నవ్వుకుంటున్నారని ఆయన చెప్పారు. యాప్ ద్వారా 22 జిల్లాలకు చెందిన రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 2.64 కోట్ల బస్తాల యూరియాను కొనుగోలు చేశారన్నారు.

## 'గూండా' రాజకీయాలను తిప్పికొట్టండి

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో బిఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌లతో బెదిరింపులకు పాల్పడితే, ఇప్పుడు కాంగ్రెస్ గూండా రాజకీయాలు చేస్తోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ మండిపడ్డారు. కోస్గిలో బిజెపి అభ్యర్థిని కిడ్నాప్ చేసి బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం, మాస్ రిగ్గింగ్‌కు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బిజెపి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజలపై పన్నుల భారం మోపేందుకే ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలను ఏడాది పాటు ఆలస్యం చేసి అభివృద్ధిని కుంటుపరిచారని వీరేందర్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే మున్సిపాలిటీల్లోని రూ. 3,600 కోట్ల బకాయిలను తీర్చేందుకు ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచేందుకు సిద్ధమైందన్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత సామాన్యుడి నడ్డి విరిచేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. ముస్లింలకు 4 శాతం ప్రత్యేక రిజర్వేషన్‌లతో పాటు, బిసి కోటాలో చేర్చి మొత్తం 14 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని అన్నారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బిజెపికి ఓటు వేయాలని కోరారు. 'సేవ్ తెలంగాణ ఓట్ ఫర్ బిజెపి' నినాదంతో ముందుకు వెళ్లాలని ప్రజలను కోరారు.

## రమాదేవికి డాక్టరేట్ ప్రదానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవికి జెఎన్‌టియు యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ రమాదేవి జెఎన్‌టియులో ఎంటెక్ పూర్తి చేసి, అనంతరం నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరి, ప్రస్తుతం ఉపకార్య నిర్వాక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత చదువులపై ఆసక్తితో హైదరాబాద్‌కు బదిలీ చేయించుకొని, జెఎన్‌టియులో పిహెచ్‌డి పూర్తి చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ఆసక్తితో ప్రస్తుతం ఉద్యోగ నిర్వహణతో పాటు టిబిసియుఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగులకు తనవంతు సేవలందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు. పిహెచ్‌డి అందుకున్న సందర్భంగా టిబిసియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ ఆమెను ఘనంగా సన్మానించి, అనంతరం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బిసి ఉద్యోగుల సంఘం నాయకులు, అధికారులు, స్నేహితులు ఆమెను అభినందించారు.

# మార్చి 31 నాటికి 'నక్సల్' ప్రక్షాళన పూర్తి

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివాదాస్పద వ్యాఖ్య



**రాయ్‌పూర్:** నక్సల్ ప్రక్షాళన మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేస్తామంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో వామ పక్ష ఉగ్రవాదంపై నిర్వహించిన ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ, నక్సలిజంపై చేపట్టిన ఆపరేషన్ కగార్‌తోసహా వివిధ వ్యూహాలు సత్ఫలితాన్నిచ్చాయని అన్నారు. వ్యూహం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌ను దెబ్బతీయడం వంటి చర్యలు స్పష్టమైన ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. అనంతరం అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన సమావేశానికి సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. ఈ రోజు రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులతో నక్సల్ వ్యతిరేక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించాను. భద్రతపై దృష్టి పెట్టిన వ్యూహం, మౌలిక వసతుల అభివృద్ధి, నక్సల్స్ ఆర్థిక వనరులపై దాడులు, లొంగుబాటు విధానం కలిసి సానుకూల ఫలితాలు ఇచ్చాయి.నవ రాయ్‌పూర్ అటల్‌నగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన ఈ సమావేశానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, హోం మంత్రిత్వ శాఖలోని అంతర్గత భద్రత విభాగ ప్రత్యేక కార్యదర్శి హాజరయ్యారని అధికారులు తెలిపారు. అలాగే కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్‌ఎఫ్), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) డైరెక్టర్ జనరల్స్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే కేంద్రం గతంలో పేర్కొన్న గడువును మరోసారి ప్రస్తావించడం ద్వారా, బలగాలను మరింత తొందరపెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎదురుకాల్పుల ప్రక్రియను వేగవంతం చేయడమే ఈ సమావేశ లక్ష్యంగా అనుమానిస్తున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం, జనవరి 2024 నుంచి ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజు వంటి అగ్ర నేతలతో సహా 500 మందికిపైగా నక్సల్స్ హతమయ్యారు. అదే సమయంలో సుమారు 1,900 మంది నక్సల్స్‌ను అరెస్టు చేయగా, 2,500 మందికి పైగా లొంగిపోయారు.

# యుపిలో 'సర్' దుర్వినియోగం

### ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్ ఆరోపణ



**ముంబయి:** ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించరు. లక్నోలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన ప్రొఫెషనల్ ఏజెన్సీలు, గతంలో సమాజ్‌వాది పార్టీ గెలిచిన పోలింగ్ బూత్‌లను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని చర్యలు చేపడుతున్నాయని విమర్శించారు. ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతోందని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ, లక్నోతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కూర్చుని పనిచేస్తున్న ప్రొఫెషనల్ ఏజెన్సీలను ప్రభుత్వం నియమించిందని, ఈ ఏజెన్సీలకు పూర్తి ఓటర్ల జాబితా డేటా అందుబాటులో ఉందని, దాని ఆధారంగా గత ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ విజయాలు సాధించిన బూత్‌లను గుర్తిస్తున్నాయని ఆయన అన్నారు. ఆ బూత్‌ల నుంచి పెద్ద సంఖ్యలో ఫారమ్–7లను పద్ధతిగా నింపి పంపిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఫారమ్–7ను ఓటరు జాబితాలో ఒకరి పేరుపై అభ్యంతరం చెప్పడానికి లేదా ఇప్పటికే నమోదైన పేరును తొలగించడానికి ఉపయోగిస్తారని ఆయన గుర్తు చేశారు. ఈ ఫారమ్‌లు సక్రమంగా నింపి, ముద్రించి, వ్యవస్థబద్ధంగా పంపుతున్నారని, దీని వల్ల అనేక చోట్ల నిరసనలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని అఖిలేశ్ అన్నారు. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్న ప్రక్రియ కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కావాలనే చేస్తున్న చర్యగా ఆయన అభివర్ణించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇప్పటికే దేశంలో ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందని కూడా ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో బిహార్ ఎన్నికలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, 'సర్'ను ఆయుధంగా మార్చుకొని బిజెపి అక్కడ గెలవగలిగిందని అఖిలేశ్ అన్నారు. ఆ ప్రక్రియ అక్కడ కీలక పాత్ర పోషించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే విధానాన్ని ఇప్పుడు ఎన్నికలకు సిద్ధమవుతున్న పశ్చిమ బెంగాల్‌లో కూడా అమలు చేయాలని బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే బెంగాల్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదేపదే ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా పనిచేస్తోందని వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంలో, మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో స్వయంగా న్యాయవాదిగా వాదనలు వినిపించడాన్ని ప్రస్తావిస్తూ, బిజెపి చర్యల కారణంగానే ఆమె 'బ్లాక్ కోట్' ధరించి న్యాయస్థానానికి వెళ్లాల్సి వచ్చిందని అఖిలేశ్ అన్నారు. ఇది జరుగుతున్న వివక్షకు స్పష్టమైన నిదర్శనమని, ఎన్నికల సంఘం బిజెపికి సహాయోగి దళంలా మారిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫారమ్–7 వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మొత్తం రివిజన్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఫారమ్–7 ద్వారా తీసుకున్న అన్ని చర్యలను రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

## 'కొరియన్ టాస్క్ గేమ్'ను నిషేధించండి

### ఆత్మహత్య చేసుకున్న బాలికల తాత డిమాండ్

**గజియాబాద్:** ఇటీవల గజియాబాద్‌లో తొమ్మిదో అంతస్తు ఫ్లాట్ నుంచి దూకి ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు అక్కచెల్లెళ్ల ఘటనపై వారి తాత కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కొరియన్ టాస్క్ ఆధారిత గేమ్‌పై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. అలాంటి చర్య తీసుకుంటే ఇతర పిల్లలు ఇలాంటి అతి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం నుంచి కాపాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ముగ్గురు బాలికల తాత, ఈశాన్య ఢిల్లీలోని సీలాంపూర్‌కు చెందిన దిలీప్ మాట్లాడుతూ, ప్రభుత్వం ముందు చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ గేమ్‌ను నిషేధించాలి. ఇకపై ఇలాంటి మరణాలు లేదా ఆత్మహత్యలు జరగకుండా చూడాలని పిటిఐతో మాట్లాడుతూ అన్నారు. ప్రాథమిక దర్యాప్తులో బాలికలు ఎలాంటి కొరియన్ టాస్క్ ఆధారిత యాప్‌ను ఉపయోగించినట్లు స్పష్టమైన ఆధారాలు లభించకపోయినా, వారి గదిలో లభించిన తొమ్మిది పేజీల జేబు డైరీ వారి అంతర్గత భావజాలాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ డైరీలో కొరియన్ సంస్కృతిపై తీవ్ర ఆసక్తి, కుటుంబ కలహాలపై వేదన ప్రతిఫలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం, నిషిక (16), ప్రాచి (14), పాఖీ (12) అనే ఆ ముగ్గురు బాలికలు భారీ అప్పులతో సతమతమవుతున్న పెద్ద కుటుంబంలో జీవించడంతో ఒంటరితనం, మానసిక ఒత్తిడికి లోనైనట్లు డైరీలో కనిపించింది. ఈ ఘటన తర్వాత వారి తండ్రి చేతన్ కుమార్ మాట్లాడుతూ, దాదాపు మూడేళ్లుగా వారు ఒక కొరియన్ గేమ్ ఆడుతూ, ఆ సమయంలో పాఠశాలకు కూడా వెళ్లలేదని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో, ఆన్‌లైన్ గేమ్స్ పిల్లలపై చూపుతున్న ప్రభావానికి వ్యతిరేకంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో రాజకీయ సంస్థల సభ్యులు సహా పలువురు నిరసనలు చేపట్టారు. పశ్చిమ ఢిల్లీలోని సుభాష్‌నగర్‌లో జరిగిన నిరసనల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు ఇలాంటి గేమ్స్ ప్రాప్తిని నిషేధించాలని డిమాండ్ చేశారు. నేషనల్ అకాలి దళ్ అధ్యక్షుడు పరమ్‌జిత్ సింగ్ పమ్మా ఈ నిరసనలకు నాయకత్వం వహించారు. చిన్నపిల్లలను ఆన్‌లైన్ గేమింగ్ ప్రమాదాల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆన్‌లైన్ గేమ్స్ పిల్లల భవిష్యత్తును నాశనం చేసి, వారిని ఆత్మహత్య అంచుల వరకు నెట్టేస్తున్నాయి అని ఆయన అన్నారు. ఇలాంటి యాప్‌లపై కఠిన పర్యవేక్షణ ఉండాలని, అవసరమైతే పూర్తిగా నిషేధించాలని పమ్మా కోరారు. తల్లిదండ్రుల అనుమతి లేకుండా పిల్లలు ఈ గేమ్స్‌ను వినియోగించలేని విధంగా పరిమితి విధానం ఉండాలని కూడా ఆయన సూచించారు.

# అందరి సమ్మతితోనే యుసిసి

### ఆర్‌ఎస్‌ఎస్ సర్వసంఘచాలక్ భగవత్ సూచన




**ముంబయి:** ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్/ యుసిసి) రూపకల్పన సమ్మతితో జరగాలని, అది సమాజంలో విభజనలకు దారి తీయకూడదని ఆర్‌ఎస్‌ఎస్ సర్వసంఘచాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ముంబయిలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి వర్గాన్ని విశ్వాసంలోకి తీసుకుని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడే యుసిసి సమర్థంగా అమలవుతుందని అభిప్రాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లో యూనిఫాం సివిల్ కోడ్ రూపకల్పన సందర్భంగా మూడు లక్షలకు పైగా సూచనలు వచ్చాయని, అన్ని వర్గాలతో చర్చించిన అనంతరమే ఆ చట్టాన్ని ఆమోదించారని భగవత్ గుర్తు చేశారు. ఈ విధానం దేశవ్యాప్తంగా అనుసరించాల్సిన ఆదర్శమని అన్నారు. సమాజంలో మెజారిటీ, మైనారిటీ అన్న భావన లేదని, మనమంతా ఒకే సమాజమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దృష్టితోనే చట్టాలు, విధానాలు ఉండాలని అన్నారు. ముస్లిం, క్రైస్తవ సమాజాలతో విశ్వాసం, స్నేహం, సంభాషణ అవసరమని భగవత్ చెప్పారు. మతం ఆధ్యాత్మికతతో నడిచినప్పుడే శాంతికి దారి తీస్తుందని, ఆధ్యాత్మికత లేకపోతే అది ఆధిపత్యంగా, దూకుడుగా మారుతుందని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య సంబంధాలపై మాట్లాడుతూ, అవసరమైనప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ సలహాలు ఇస్తుందని భగవత్ తెలిపారు. అయితే రాజకీయ ఒత్తిడి ఓటర్ల నుంచే వస్తుందని, ఆర్‌ఎస్‌ఎస్ నుంచికాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో జరిగే తప్పిదాలకు కూడా ఆర్‌ఎస్‌ఎస్‌పైనే నిందలు వేస్తారని, అవి మన నుంచే వచ్చినవారు కాబట్టి అలా జరుగుతుందని వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టుల ప్రాతిపదిక గత వందేళ్లలో ఎందుకు విస్తరించలేదన్న ప్రశ్నకు, వారు అడిగితే ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శనం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని భగవత్ వ్యంగ్యంగా స్పందించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక యువ సంస్థ అని, సగటు వయసు 28 సంవత్సరాలుగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో దాన్ని 25 సంవత్సరాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటులు రవీనా టాండన్, విక్కీ కౌశల్, అనన్య పాండే, దర్శకులు కరణ్ జోహార్, మధుర్ భండార్కర్, రమేష్ తౌరాణి, సంగీతకారుడు పండిట్ హృదయనాథ్ మంగేశ్కర్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం మీద, యూనిఫాం సివిల్ కోడ్ సహా జాతీయ అంశాలపై సమ్మతి, సంభాషణ, సమన్వయమే మార్గమని మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

**వైదొలగడానికి సిద్ధం**

తన వయసు 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, సంఘ్ ఆదేశాల మేరకు తాను కొనసాగుతున్నానని, సంస్థ ఎప్పుడైతే పదవి నుంచి తప్పుకోవాలని సూచిస్తుందో అప్పుడే తాను బాధ్యతలు వదులుతానని భగవత్ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో సర్వసంఘచాలక్ పదవికి ఎన్నికల ప్రక్రియ ఉండదని, ప్రాంతీయ, విభాగ స్థాయి బాధ్యతదారులే ఈ నియామకం చేస్తారని వివరించారు. సాధారణంగా 75 ఏళ్ల తర్వాత పదవి లేకుండా పనిచేయాలనే ఆలోచన ఉంటుందని పేర్కొంటూ, తన వయస్సు విషయాన్ని సంఘ్‌కు తెలియజేసినప్పుడు, వారు కొనసాగించాలని కోరారని చెప్పారు. పని నుంచి విరమణ అనేది తనకు ఎప్పటికీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

## 'నీట్' నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ:** వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్‌యూజీ 2026 నోటిఫికేషన్ విడుదలైంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పరీక్షకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సులు, బీవీఎస్‌సీ, ఏహెచ్, బీహెచ్‌ఎంఎస్‌తో పాటు బీఎస్సీ నర్సింగ్ (ఎమ్మెన్నెస్) వంటి కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తారు. నీట్ రిజిస్ట్రేషన్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తమ సైట్ అవవ్.ఙ్.అఱ.అఱ లో ప్రారంభించింది. నెల రోజులపాటు దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే మార్చి ఎనిమిదోతేదీ రాత్రి తొమ్మిది గంటలవరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే ఫీజు చెల్లించేందుకు అదే రోజు రాత్రి 11.50 గంటల వరకు అవకాశం ఉంది. అప్లికేషన్లలో పొరపాట్లు సరిదిద్దుకునేందుకు మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు అవకాశం ఉంది. మే మూడోతేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. మూడు గంటల పాటు జరిగే ఈ పరీక్షను పెన్నుతో రాయాల్సి ఉంటుంది. 13 భాషల్లో కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవచ్చు. విదేశాల్లోనూ పరీక్ష జరుగుతుంది. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. దెబ్బతిన్న ఎయిర్ బేస్‌లో పాక్ మరమ్మతులు


# వ్యసనాలను మాన్పించే 'డీఅడిక్షన్' కార్యక్రమం




**గోవా:** గోవాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎఐఐఎ)లో అమలవుతున్న ఒక ప్రత్యేక డీఅడిక్షన్, మానసిక ఆరోగ్య కార్యక్రమం, మద్యంపొగాకు వ్యసనాలతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి కొత్త ఆశలు కల్పిస్తున్నది. ఆయుర్వేదం, ఆధునిక మానసిక వైద్యం, యోగా, ఆహార నియంత్రణ, పునరావాస చికిత్సలను సమన్వయపరిచి రూపొందించిన ఈ కార్యక్రమం, గత మూడు సంవత్సరాలుగా ఉత్తర గోవాలోని ధర్గాలిమ్ క్యాంపస్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా 'మనసరోగం మరియు డీఅడిక్షన్ అవుట్‌పేషెంట్ విభాగం (ఒపిడి)' ద్వారా పనిచేస్తోంది. మద్యం, పొగాకు ఆధారపడటంతో పాటు, వాటికి అనుబంధంగా ఏర్పడే మానసిక ఆరోగ్య సమస్యలకు సమగ్ర చికిత్స అందించడమే దీని ప్రధాన లక్ష్యం అని సంస్థ డైరెక్టర్ డాక్టర్ పికె ప్రజాపతి పిటిఐకి తెలిపారు. 2025 సంవత్సరంలో మాత్రమే ఈ ఒపిడిలో 109 మద్యం వ్యసన కేసులు, 44 నికోటిన్‌పొగాకు వ్యసన కేసులు నమోదయ్యాయని ఆయన వివరించారు. ఈ సంఖ్యలు, సమస్య తీవ్రతతో పాటు, ప్రజల్లో ఈ కేంద్రంపై పెరుగుతున్న నమ్మకాన్ని కూడా సూచిస్తున్నాయని వైద్యులు భావిస్తున్నారు. ఇక్కడ చికిత్స పొందే రోగులకు పంచకర్మ విధానాలు, కాలేయంపై దృష్టి సారించిన ప్రత్యేక చికిత్సలు, యోగా సాధన, వ్యసన విముక్తి కౌన్సెలింగ్, కుటుంబ కౌన్సెలింగ్, క్రమబద్ధమైన ఫాలోఅప్ వంటి విస్తృత సేవలు అందిస్తున్నారని అధికారులు తెలిపారు. కేవలం వ్యసనాన్ని మాన్పడం మాత్రమే కాకుండా, శారీరకమానసిక ఆరోగ్యాన్ని సమగ్రంగా పునరుద్ధరించడమే ఈ కార్యక్రమం ప్రత్యేకత. ఎఐఐఎ గోవా డీన్ డాక్టర్ సుజాత కదమ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం బలమే దాని సమగ్ర విధానమని స్పష్టం చేశారు. శాస్త్రీయ ఆయుర్వేద సిద్ధాంతాలను ఆధునిక క్లినికల్ అంచనా పద్ధతులతో కలిపి వినియోగించడం, థెరప్యూటిక్ యోగా, పథ్యాహారం (ఆరోగ్యకరమైన ఆహారం), మానసిక కౌన్సెలింగ్‌ను ఒకే చికిత్సా చట్రంలో అమలు చేయడం వల్ల వ్యసన సమస్యలతో పాటు వాటికి అనుబంధంగా వచ్చే మానసిక రుగ్మతలను సమర్థంగా ఎదుర్కొనగలుగుతున్నామని ఆమె చెప్పారు. ఈ కేంద్రంలోనే పనిచేస్తున్న ఒక సైకియాట్రిస్ట్, కాయచికిత్స నిపుణులతో సమన్వయం చేస్తూ పని చేయడం మరో ప్రత్యేక అంశమని డాక్టర్ కదమ్ వివరించారు. వ్యసనం మానే దశలో వచ్చే మానసిక ఉపసంహరణ లక్షణాలు, ఆకర్షణలు (క్రేవింగ్స్), మళ్లీ వ్యసనానికి దారి తీసే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, సమయానికి చికిత్స చేయడం ఈ సమన్వయంతో సాధ్యమవుతోందని ఆమె అన్నారు. ఈ ఒపిడి కేవలం వ్యసన విముక్తికే పరిమితం కాదని డాక్టర్ కదమ్ తెలిపారు. ఒత్తిడికి సంబంధించిన రుగ్మతలు, నిద్రలేమి, ఆందోళన, డిప్రెషన్, మూడ్ డిసార్డర్లు వంటి మానసిక సమస్యలతో బాధపడే రోగులకు కూడా ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. మానసిక బలహీనత మరియు వ్యసన ఆధారపడటం మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తించి, రెండింటినీ ఒకే దృష్టితో ఎదుర్కొనడం ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె చెప్పారు. భవిష్యత్తులో ఈ డీఅడిక్షన్ మోడల్‌ను మరింత విస్తృతంగా అమలు చేయాలనే దిశగా సంస్థ పనిచేస్తోందని డైరెక్టర్ డాక్టర్ ప్రజాపతి తెలిపారు. ప్రామాణిక చికిత్సా ప్రోటోకాల్స్, క్లినికల్ డాక్యుమెంటేషన్‌ను బలోపేతం చేసి, ఆధారాలపై ఆధారపడిన, రోగి కేంద్రిత చికిత్సా మార్గాలను రూపొందించాలన్నది తమ విజన్ అని ఆయన చెప్పారు. ఈ విధానాలను ప్రజారోగ్య వ్యవస్థలో భాగం చేయడం, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అనుసరించగలిగేలా రూపొందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## గ్రూప్–బి అధికారుల కేటాయింపునకు సిద్ధం

### 'ఇసి'కి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వెల్లడి




**న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జరుగుతోన్న ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) కోసం రాష్ట్రంలోని 8,505 గ్రూప్‌బి అధికారులు లేదా సంబంధిత పరికరాలను అందుబాటులో ఉంచడానికి సిద్ధంగా ఉన్నామని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఎన్నికల సంఘానికి తెలియజేసింది. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు తెలియజేశాయి. ఈ ఎస్‌ఐఆర్ కసరత్తు అమలు చేయడదానికి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేవలం 80మంది గ్రేడ్2 అధికారుల సేవలను మాత్రమే అందించిందని ఫిబ్రవరి 4న ఎన్నికల సంఘం తరపు న్యాయవాది సుప్రీం కోర్టులో వాదించిన నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్ సహా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరుపనుంది. ఫిబ్రవరి 4న సుప్రీంకోర్టులో వాదించిన తొలి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం మళ్లీ అత్యున్నత న్యాయస్థానానికి వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఎన్నికల సంఘానికి 8,505 మంది గ్రూప్‌బి అధికారులను లేదా సేవలను అక్కడ ఎస్‌ఐఆర్ ప్రక్రియ కోసం అందుబాటులో ఉంచడానికి సిద్ధంగా ఉందని తెలియజేసిందని వారు తెలియజేశారు. ఫిబ్రవరి 4న ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ సుప్రీంకోర్టుకు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డిఎంల వంటి 80 గ్రేడ్2 అధికారుల సేవలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్వివేదీ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దిగువ ర్యాంక్ ప్రభుత్వ ఉద్యోగులైన అంగన్‌వాడీ వర్కర్లను మాత్రమే ఎస్‌ఐఆర్ కసరత్తు కోసం ఏర్పాటు చేసిందని వాదించారు. కాగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘం ఆరోపణలను తిప్పికొట్టారు. ఎన్నికల సంఘం కోరిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించిందని ఆమె వివరణ ఇచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పశ్చిమబెంగాల్‌లో ప్రత్యేక ముమ్మర సవరణను ఖండించాలని ముఖ్యమంత్రి మమత సుప్రీంకోర్టును అభ్యర్థించారు.ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రజలను బుల్‌డోజ్ చేస్తున్నారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ఎటువంటి అసౌకర్యానికి గురికాకూడదని పేర్కొంటూ సుప్రీంకోర్టు అనేక ఆదేశాలు జారీచేసింది.

## బ్రిటిష్ రచయిత్రికి భారత పౌరసత్వం



**న్యూఢిల్లీ:** బ్రిటిష్ రచయిత్రి పెపెతా సేత్ భారత పౌరసత్వం పొందారు. ఫొటోగ్రాఫర్, సాంస్కృతిక పరిశోధకురాలు అయిన పెపెతా సేత్ 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత. 80 ఏళ్ల వయసులో ఆమె భారత పౌరసత్వాన్ని అందుకున్నారు. కేరళలోని త్రిశ్శూర్ కలెక్టరేటులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జున్ పాండ్యన్ ఆమెకు పౌరసత్వ పత్రాలు అందజేశారు. తన బ్రిటిష్ జాతీయతను అధికారికంగా త్యజించిన పెపెతా సేత్ మాట్లాడుతూ.. "నేను ఎంతగానో ప్రేమించిన ఈ భూమి నన్ను తన కుమార్తెగా స్వీకరించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇక నేను వెనక్కు వెళ్లాల్సిన పని లేదు" అన్నారు. కేరళ ఆచారాలు, ఉత్సవాలు, ప్రకతి సౌందర్యాలను డాక్యుమెంటు చేస్తూ దాదాపు నాలుగు దశాబ్దాలు ఆమె ఇక్కడే గడిపారు. 1857లో బ్రిటిష్ సైనికుడిగా ఉన్న తన తాత రాసిన డైరీ చదివి, 27 ఏళ్ల వయసులో పెపెతా భారత్‌కు వచ్చారు. 'గాంధీ' చిత్రంలో నెహ్రూ పాత్ర పోషించిన నటుడు రోషన్ సేత్‌ను పెళ్లి చేసుకున్నారు. 2012లో భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది.

## దెబ్బతిన్న ఎయిర్ బేస్‌లో పాక్ మరమ్మతులు

### ఉపగ్రహచిత్రాల్లో వెల్లడి




**న్యూఢిల్లీ:** భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో తమకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, తామే భారత విమానాలు కూల్చేశామని పాకిస్థాన్ ప్రగల్భాలు పలుకుతున్న సంగతి తెలిసిందే. వాస్తవాలను కప్పిపెట్టి ఆదేశం చేస్తున్న ప్రకటనల్లోని డొల్లతనం మరోసారి బయటపడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) యుద్ధ విమానాలు జరిపిన దాడిల్లో పాక్ లోని అనేక ఎయిర్ బేస్ లు దెబ్బతిన్నాయి. ఇదే విషయాన్ని భారత్ ప్రపంచానికి వెల్లడించింది. పాక్ డ్రోన్ దాడులకు జవాబుగా మన వాయుసేన మే 10 న భొలారీ బేస్‌ను టార్గెట్ చేసి దాడులు జరిపింది. ఈ దాడిలో ఉపయోగించిన ఆయుధాల వివరాలను వెల్లడించనప్పటికీ.. ఎయిర్ బేస్ ను పాక్షికంగా దెబ్బతీశామని ప్రకటించింది. పాక్ మాత్రం ఈ వాదనను కొట్టిపారేసింది. అయితే, తాజాగా వెలుగుచూసిన ఉపగ్రహ చిత్రాల్లో భొలారిలోని పాక్ వాయుసేన స్థావరం దెబ్బతిన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు.. అందులో దెబ్బతిన్న ఓ హ్యాంగర్‌కు మరమ్మతులు చేయడం తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్ బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు స్పష్టమైంది.

# 'నేడు' కొచిన్ కేన్సర్ పరిశోధనా కేంద్రం ప్రారంభం

### నూతన భవనాన్ని ప్రారంభించనున్న కేరళ సిఎం పినరయి విజయన్

### రూ.449 కోట్ల వ్యయంతో నిర్మాణం



**కొచ్చి:** కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో వైద్య, విద్యారంగం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లోంది. దీనిలో భాగంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇక్కడి కలమస్సేరిలో ప్రపంచస్థాయి సౌకర్యాలతో నిర్మితమైన కొచిన్ కేన్సర్ పరిశోధన కేంద్రం నూతన భవనాన్ని నేడు (సోమవారం) ప్రారంభించనున్నారు. అధికారులు ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఈ నూతన భవనాన్ని పినరయి విజయన్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ మంత్రి వీణా జార్జి, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవన్ హాజరుకానున్నారు. ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయం జారీచేసిన ఒక ప్రకటన ఈ విషయాన్ని వెల్లడించింది. రూ.449 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కొచిన్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్‌లో వైద్య సామగ్రి సహా సరికొత్త సదుపాయాలు కల్పించినట్లు తెలియజేసింది. కేన్సర్ చికిత్స, పరిశోధనలో కొచ్చిన్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్ ఒక కొత్త ముందడుగు అని మంత్రి వీణాజార్జి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్థాపించిన ఈ కేంద్రం అధునాతన, అధిక నాణ్యతా ప్రమాణాలతో కూడిన చికిత్సను అందించడానికి అంకితమైన సంస్థ. ఈ కొచిన్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్ పెద్ద సంఖ్యలో కేన్సర్ రోగులకు పెద్ద ఉపశమనంగా ఉంటుందని మంత్రి వీణాజార్జి తెలిపారు. కలమస్సేరి మెడికల్ కాలేజీ క్యాంపులో 12.63 ఎకరాల స్థలంలో కేన్సర్ సెంటర్ నిర్మించబడిందని, మొత్తం 6.3 చదరపు అడుగుల విస్తీర్ణంలో తొమ్మిది అంతస్తుల భవనం నిర్మించబడిందని ఆ ప్రకటన తెలియజేసింది.16 లిఫ్టుల సౌకర్యం సహా అత్యాధునిక శస్త్రచికిత్స సదుపాయాలు, 550 కార్లకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. అంతేకాకుండా సంక్లిష్ట శస్త్ర చికిత్సలులను రూపొందించడానికి 12 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, వాటిలో ఒక ఆపరేషన్ థియేటర్ భవిష్యత్‌లో రోబో శస్త్రచికిత్స విధానాల కోసం రిజర్వ్ చేయబడిందని అధికారులు వివరించారు. పరిశోధనా కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా 10,000 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కేటాయించడంపై కొచ్చిన్ కేన్సర్ రీసెర్చి సెంటర్ దృష్టి సారించిందని ప్రకటన తెలిపింది. ఈ కేంద్రంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగించడం సహా అత్యంత అధునాతన స్కానింగ్, ఎక్స్‌రే, రేడియేషన్ థెరఫీ సౌకర్యాలు ఉన్నాయి. కేరళలో ఎక్స్‌లెన్స్ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫిషియెన్సీస్ (ఇడిజిఇ) సర్టిఫికేషన్ పొందిన మొట్టమొదటి ఆసుపత్రి భవనం ఇది అని పేర్కొంది. ఈ సౌకర్యం దాని మొత్తం విద్యుత్ అవసరాలను సౌరశక్తి ద్వారా తీరుస్తుంది. ఇది 25శాతం కార్బన్‌రహితంగా ఉంది. 2050నాటికి కేరళను పూర్తిగా కార్బన్‌న్యూట్రల్‌గా మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఉందని వెల్లడించారు.

## చోక్సీకి బ్రిటన్ కోర్టు షాక్

**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసులో విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి బ్రిటన్ కోర్టు షాకిచ్చింది. ఆయన చెబుతున్న 'కిడ్నాప్' ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. చోక్సీ ఆరోపణలే తప్ప ఆయన కిడ్నాప్ కావడం ప్రత్యక్షంగా చూసిన వారు ఎవరూ లేరని చెప్పింది. చోక్సీ లాయర్ చూపించిన సందర్భోచిత సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుని విచారణ సాగిస్తామని పేర్కొంటూ.. రూ.7.3 కోట్లు సెక్యూరిటీ బాండ్ కోర్టుకు సమర్పించాలని చోక్సీని ఆదేశించింది. విదేశాలకు పారిపోయిన మెహుల్ చోక్సీ కొంత కాలం ఆంటిగ్వాలో తలదాచుకున్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసులో తనను భారత్‌కు తరలించేందుకు కొంతమంది కుట్ర పన్నారని చోక్సీ ఆరోపించారు. హంగేరీకి చెందిన బార్బారా జబారికతో కలిసి భారత ఏజెంట్లు తనను కిడ్నాప్ చేశారని యూకే కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. జబారిక తనతో స్నేహం నటించి ఆంటిగ్వా నుంచి బలవంతంగా డొమినికాకు తీసుకెళ్లిందని, తప్పించుకుని బయటపడిన తనను బెల్జియం పోలీసులు అరెస్టు చేశారని చోక్సీ చెప్పాడు.


# సాహిత్య పంథాను మార్చిన 'కమ్యూనిస్టు మానిఫెస్టో'

నేటి ప్రపంచంలో రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు, సంస్కృతి, సాహిత్యం అన్నీ వేగంగా మారుతున్నట్టు కనిపించినా, వాటి మూలాల్లో ఉన్న విరుద్ధతలు మాత్రం దాదాపు రెండువందల సంవత్సరాల క్రితం ఎలా ఉన్నాయో అలాగే కొనసాగుతున్నాయి. ఈ విరుద్ధతలను అత్యంత స్పష్టంగా, శాస్త్రీయంగా, విప్లవాత్మకంగా విశ్లేషించిన గ్రంథం 'కమ్యూనిస్టు మానిఫెస్టో'. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ సంయుక్తంగా రచించిన ఈ చిన్న పుస్తకం 1848 ఫిబ్రవరి 21న లండన్‌లో వెలువడింది. పరిమాణంలో చిన్నదైనా, ప్రభావంలో అపారమైన ఈ రచన ప్రపంచ రాజకీయ చరిత్రను మాత్రమే కాదు, ప్రపంచ సాహిత్య దృక్పథాన్నే మలుపుతిప్పింది. ప్రేమ, వ్యక్తిగత భావోద్వేగాలు, ప్రకృతి సౌందర్యం వంటి అంశాలకే పరిమితమైన రొమాంటిసిజం నుంచి, శ్రమ, దోపిడీ, వర్గపోరాటం, సామాజిక న్యాయం వంటి అంశాల వైపు సాహిత్యాన్ని మళ్లించిన గ్రంథంగా ఇది నిలిచింది. కమ్యూనిస్టు మానిఫెస్టో వెలువడిన కాలం యూరప్ మొత్తం రాజకీయ కల్లోలంలో మునిగిపోయిన సమయం. ఫ్యూడల్ వ్యవస్థ శిథిలావస్థకు చేరి, పెట్టుబడిదారీ వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న దశ అది. పరిశ్రమల విప్లవం కారణంగా యంత్రాలు ఉత్పత్తిని పెంచాయి, కానీ ఆ పెరుగుదల శ్రమజీవుల జీవితాల్లో ఆనందాన్ని కాకుండా కొత్త దాస్యాన్ని తీసుకొచ్చింది. గ్రామాల నుంచి పట్టణాల వైపు వలసలు పెరిగాయి. కర్మాగారాల్లో దీర్ఘ పని గంటలు, అతి తక్కువ వేతనాలు, అసురక్షిత పని పరిస్థితులు సాధారణమయ్యాయి. ఒకవైపు సంపద కొద్దిమంది బూర్జువా చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, మరోవైపు కోట్లాది మంది కార్మికులు తమ శ్రమ తప్ప మరేదీ లేని స్థితిలోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ నేపథ్యాన్ని మార్క్స్, ఎంగెల్స్ భావోద్వేగంతోగాక, శాస్త్రీయ విశ్లేషణ తో చూశారు. సమాజం దేవుడి సంకల్పంతో లేదా వ్య క్తుల మంచితనంతో మారదని, అది ఉత్పత్తి విధానాల్లో వచ్చే మార్పుల వల్ల, వాటి నుంచి పుట్టే వర్గ విరుద్ధతల వల్ల మాత్రమే మారుతుందని వారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఉన్న' సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే' అనే వాక్యంతో మానిఫెస్టో ప్రారంభమవుతుంది. ఈ ఒక్క వాక్యం రాజకీయ ఆలోచనల చరిత్రలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలో కూడా ఒక మైలురాయిగా నిలిచింది. ఎందుకంటే అది చరిత్రను రాజుల, యుద్ధాల, వీరు ల కథగా కాకుండా, శ్రమించే ప్రజల పోరాటాల కథగా తిరిగి నిర్వచించింది. ఈ నిర్వచనంతోనే సాహిత్య ప్రపంచంలో పెద్ద మార్పు మొదలైంది. అప్పటివరకు నవలలు, కవిత్వం ప్రధానంగా వ్యక్తిగత ప్రేమ, వేదన, ప్రకృతి వర్ణనల చుట్టూ తిరిగాయి. అయితే మానిఫెస్టో తర్వాత సాహిత్యం సమాజాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టింది. రచయితలు కార్మికుల జీవితాలను, కర్మాగారాల చీకటి మూలలను, దోపిడీ రూపాలను చిత్రీకరించసాగారు. రష్యాలో గోర్కీ, ఫ్రాన్స్‌లో జోలా, ఇంగ్లాండ్‌లో డికెన్స్ వంటి రచయితలు శ్రమజీవుల జీవితాలను తమ రచనలకు ప్రేరణగా స్వీకరించారు. వాటిపైనే రచనలు చేశారు. ఈ మార్పుకు సిద్ధాంతపరమైన బలం అందించింది కమ్యూనిస్టు మానిఫెస్టోనే అనడం అతిశయోక్తి కాదు. మార్క్స్, ఎంగెల్స్ ప్రతిపాదించిన శాస్త్రీయ సామ్యవాదం యుటోపియన్ సామ్యవాదం నుంచి పూర్తిగా భిన్నమైనది. యుటోపియన్ సామ్యవాదులు సమానత్వంతో కూడిన సమాజం గురించి కలలు కన్నారు, కానీ ఆ సమాజం ఎలా సాధ్యమవుతుందో చెప్పలేకపోయారు. మానిఫెస్టో మాత్రం సమాజ మార్పుకు ఉన్న అంతర్గత శక్తులను, నియమాలను గుర్తించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోనే తన వినాశనానికి కారణాలను మోస్తుందని అది వివరించింది. ఉత్పత్తి పెరుగుతున్న కొద్దీ, కార్మిక వర్గం సంఖ్య పెరుగుతుంది.. వారి శ్రమపై ఆధారపడే పెట్టుబడిదారీ వ్యవస్థ, చివరకు అదే శ్రమజీవుల చేతుల్లో కూలిపోతుందని ఇది విశ్లేషించింది. ఇది కేవలం ఆర్థిక సిద్ధాంత విశ్లేషణ మాత్రమే కాదు. రాజకీయ కార్యాచరణకు పిలుపు కూడా. 'ప్రపంచ కార్మికులారా, ఏకంకండి' అనే నినాదం భావోద్వేగం కాదు, వ్యూహాత్మక ప్రకటన. కార్మిక వర్గం విడివిడిగా ఉన్నంత కాలం బలహీనంగా ఉంటుందని, సంఘటితమైనప్పుడు మాత్రమే రాజకీయ శక్తిగా మారుతుందని మానిఫెస్టో స్పష్టం చేసింది. ఈ పిలుపు యూరప్ అంతటా కార్మిక ఉద్యమాలకు ప్రేరణనిచ్చింది. ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంఘాలు, సామ్యవాద పార్టీలు పుట్టుకొచ్చాయి. ఇరవయ్యవ శతాబ్దంలో ఈ ఆలోచనలు ప్రపంచ రాజకీయాలను కుదిపేశాయి. రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం మానిఫెస్టో ఆలోచనలకు ప్రత్యక్ష ఫలితం. లెనిన్ ఈ గ్రంథాన్ని తన రాజకీయ జీవితానికి మార్గదర్శకంగా తీసుకున్నాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నత దశ అయిన సామ్రాజ్యవాదాన్ని విశ్లేషిస్తూ, వలస పాలన ఎలా ప్రపంచ స్థాయి దోపిడీకి రూపం ఇస్తుందో వివరించాడు. ఈ విశ్లేషణతో కమ్యూనిస్టు మానిఫెస్టో యూరప్ సరిహద్దులను దాటి, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అణచివేతకు గురైన ప్రజలకు ప్రేరణగా మారింది. భారతదేశంలో కూడా ఈ ఆలోచనల ప్రభావం గణనీయంగానే ఉంది. వలస పాలనలోని దోపిడీని అర్థం చేసుకోవడానికి, శ్రమజీవుల సమస్యలను రాజకీయంగా మలచడానికి మానిఫెస్టో ఒక దృక్పథాన్ని అందించింది. భారతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రైతాంగ ఉద్యమాలు, కార్మిక పోరాటాలు అన్నీ ఈ సిద్ధాంతాల ప్రభావంతో ఎదిగాయి. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా సామాజిక న్యాయం, సమానత్వం వంటి భావనలు బలపడటానికి ఇది పరోక్షంగా తోడ్పడింది. కమ్యూనిస్టు మానిఫెస్టో సాహిత్యంపై చూపిన ప్రభావం రాజకీయాలకన్నా తక్కువేమీ కాదు. ఇది రచయితలకు ఒక కొత్త బాధ్యతను గుర్తు చేసింది. రచన కేవలం వినోదం కోసం కాకుండా, సమాజాన్ని మార్చే ఆ యుధంగా మారవచ్చని ఇది చూపించింది. కవులు, రచయితలు తమ రచనల్లో శ్రమజీవుల స్వరం వినిపించడం మొదలుపెట్టారు. రొమాంటిజం స్థానంలో రియలిజం, సామాజిక అవగాహన ప్రధానమయ్యాయి. సాహిత్యం ఒక వర్గపు విలాసంగా కాకుండా, ప్రజల జీవన పోరాటాలకు ప్రతిబింబంగా మా రింది. నేటి ప్రపంచంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయినట్టు కనిపించవచ్చు. కానీ లోతుగా చూ స్తే మానిఫెస్టో వివరించిన విరుద్ధతలు మరింత తీవ్రమయ్యాయి. గ్లోబలైజేషన్ పేరుతో పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా తిరుగుతుండగా, శ్రమజీవుల జీవితాలు మరింత అస్థిరంగా మారాయి. గిగ్ ఎకానమీ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు, ఆటోమేషన్ వల్ల నిరుద్యోగం పెరుగుతోంది. కొద్దిమంది బిలియనీర్ల చేతుల్లో అపారమైన సంపద కేంద్రీకృతమవుతుండగా, కోట్లాది మంది కనీస జీవన భద్రత లేకుండా జీవిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు మానిఫెస్టో విశ్లేషణలు మరింత ప్రాసంగికతను సంతరించుకున్నాయి.

– సత్యశ్రీ

'కమ్యూనిస్టు మానిఫెస్టో' ప్రకారం.. సమాజం ముఖచిత్రం శాశ్వతం కాదు.. అది నిరంతరం మారుతుంది. ఆ మార్పు కూడా యాదృచ్ఛికం ఏమీ కాదు. అది వర్గ పోరాటాల ఫలితం. ఈ అవగాహన నేటి తరానికి కూడా అవసరం. విప్లవం అంటే కేవలం ఆయుధ పోరాటం అనుకోవడానికి వీల్లేదు. అది ఆలోచనల మార్పు, సామాజిక సంబంధాల మార్పు కూడా. ఈ అర్థంలో కమ్యూనిస్టు మానిఫెస్టో ఇంకా జీవించి ఉన్న గ్రంథమే. సుమారు 178 సంవత్సరాలు గడిచినా, ఈ పుస్తకం చరిత్రలో మిగిలిపోయిన శిలాఫలకం కాదు. అది ఇప్పటికీ ప్రశ్నలు వేస్తుంది. చర్చలను రేపుతుంది. ఉద్యమాలకు దారి చూపుతుంది. రాజకీయాల్లోనే కాదు, సాహిత్యంలో కూడా ఇది మనకు ఒక దృక్పథాన్ని ఇస్తుంది. రచయిత సమాజానికి బాధ్యత వహించాలనే భావనను బలపరుస్తుంది. అందుకే కమ్యూనిస్టు మానిఫెస్టోను ఒక రాజకీయ ప్రకటన మాత్రమే చూడడం సరి కాదు. అది ప్రపంచాన్ని మార్చిన, ఇంకా మారుస్తున్న ఒక మహత్తర గ్రంథం. ఈరోజు కూడా శ్రమజీవుల జీవితాల్లో అన్యాయం, అసమానతలు కొనసాగుతున్నంత కాలం, ఈ మానిఫెస్టోకు ఉన్న ప్రాధాన్యత తగ్గదు. కాలం మారినా, వ్యవస్థలు మారినా, ప్రశ్నలు అలాగే ఉంటాయి. వాటికి సమాధానాలు వెతకడానికి, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కమ్యూనిస్టు మానిఫెస్టో ఇప్పటికీ ఒక దీపంలా వెలుగుతూనే ఉంది.

పుస్తకాలు కోకొల్లలు.. మార్కెట్‌లోకి నిత్యం వస్తునే ఉంటాయి. కానీ, కొన్ని మాత్రమే చరిత్రలో స్థిరంగా నిలబడిపోతాయి. అతి కొన్ని మాత్రమే, శతాబ్దాల తరబడి ప్రజా జీవితాలను ప్రభావితం చేస్తునే ఉంటాయి. దోపిడిని ప్రశ్నిస్తుంటాయి. ఇక, సమస్యల మూలాలను గుర్తించి, విశ్లేషించి, పరిష్కార మార్గాలను సూచించి, భవిష్యత్ తరాలకుదిశానిర్దేశనం చేసే పుస్తకాలను వేళ్లతో లెక్కించుకోవచ్చు. అలాంటి అత్యంత అరుదైన గ్రంథాల్లో ఒకటి 'కమ్యూనిస్టు మానిఫెస్టో'. దీనిని సాహిత్యంలో భాగంగా కొంత మంది అంగీకరించకపోవచ్చు. రాజకీయ కోణంలో మాత్రమే కొంత మంది ప్రస్తావించవచ్చు. కానీ, ఒక ఆలోచనను లేదా సిద్ధాంతాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వాడే భాష... చెప్పే విధానం ప్రభావవంతంగా ఉండాలి. మనసు లోతుల్ని తాకాలి. ఆలోచనలను ప్రేరేపించాలి. వాస్తవాలను ఆవిష్కరించాలి. ఇలాంటి అన్ని లక్షణాలు 'కమ్యూనిస్టు మానిఫెస్టో' లో ఉన్నాయి. సమకాలీన సమాజాన్ని కళ్లకుకట్టి, పరిష్కారాలను చూపిన సంపూర్ణ గ్రంథం. దీనిని 'సాహిత్యం' జాబితాలోకి చేర్చడానికి అంగీకరించని వారు సైతం, ఈ పుస్తకం సాహితీ ప్రపంచంలో సృష్టించిన ప్రభంజనాన్ని, పెను మార్పులను వ్యతిరేకించలేరు. రాజకీయ, ఆర్థిక రంగాలనేకాదు.. సాహిత్యాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది.








## చదవాల్సిన పుస్తకం

### 'క్రైమ్ అండ్ పనిష్మెంట్'

ఫ్యోదర్ దొస్తయేవస్కీ పేరు వినగానే సాధారణంగా మనకు గుర్తుకు వచ్చేది (1866)లో విడుదలైన 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' (నేరము–శిక్ష) నవల. ఇది ప్రపంచ సాహిత్యంలో ఎందుకు చిరస్థాయిగా నిలిచిందో పుస్తకం చదివిన తర్వాత స్పష్టంగా అర్థమవుతుంది. ఇది ఒక సాధారణ హత్యకథ కాదు. నేరం చేసిన మనిషి మనస్సులో జరిగే అంతర్గత పోరాటాన్ని సూక్ష్మంగా విశ్లేషించిన మానసిక–తాత్విక నవల. కథానాయకుడు రోడియన్ రాస్కోల్నికోవ్ పేదరికంలో మగ్గుతున్న, మేధస్సు కలిగిన యువకుడు. ఒక మహిళను హత్య చేయడం ద్వారా 'సమాజానికి పనికిరాని మనిషిని తొలగించాను' అనే తన తర్కాన్ని పరీక్షించాలనుకుంటాడు. కానీ హత్య తర్వాత అతను ఎదుర్కొనే అసలు శిక్ష చట్టపరమైనది కాదు... అంతరాత్మ సృష్టించే అపరాధభావం. అదే అతన్ని మెల్లగా మానసిక పతనానికి నడిపిస్తుంది. కథలోని వేగంలో కంటే పాత్రల లోతుల్లోనే ఈ నవల ప్రత్యేకత కనిపిస్తుందిఉ రాస్కోల్నికోవ్ పాత్ర ఒక్కోసారి అసహ్యకరంగా ఉంటుంది. మరోసారి మనకు దగ్గర వ్యక్తిగా కనిపిస్తాడు. అతనిలోని అహంకారం, 'నేను ప్రత్యేకుడిని' అనే దేవుడిలాంటి భావన ఒక వైపు.. తాను చేసిన తప్పును ఒప్పుకునే అంతర్గత స్వరం మరోవైపు.. ఈ ద్వంద్వత్వమే అతని పాత్రను సజీవంగా చేస్తుంది. పోలీసు అధికారి పోర్ఫిరీ పెట్రోవిచ్ పాత్ర ప్రత్యేకంగా నిలుస్తుంది. అతను శారీరక ఆధారాలకన్నా మానసిక ఆట ద్వారా నేరస్తుడిని పట్టుకోవాలని ప్రయత్నిస్తాడు. అలాగే రాస్కోల్నికోవ్ సోదరి దునియాది ధైర్యం, నైతిక బలం కలిసిన పాత్ర. అతని స్నేహితుడు రాజుమిఖిన్ మానవీయతకు ప్రతీకగా నిలుస్తాడు. సోనియా పాత్ర ద్వారా దొస్తయేవస్కీ కరుణ, విశ్వాసం, త్యాగం వంటి విలువలను ప్రతిపాదిస్తాడు. చాలామంది ఈ నవలను దుఃఖం మూర్తీభవించిన పాత్రకు సంబంధించిన అనుభవాలుగా భావిస్తారు. కానీ ఇది నిరాశకన్నా నిజాయితీగా జీవితం చూపించే రచన. చివర్లో రాస్కోల్నికోవ్ తన నేరాన్ని ఒప్పుకుని శిక్షను స్వీకరించడం మాత్రమే కాదు, అంతర్గతంగా మారడానికి సిద్ధపడటం ముఖ్యమైన మలుపు. సైబీరియాలో మొదలయ్యే అతని జీవితం పునర్జన్మకు సంకేతంగా నిలుస్తుంది. బైబిల్‌లో లాజరస్ కథను గుర్తుచేసేలా, మరణం తర్వాత కొత్త జీవితం అనే భావన ఇక్కడ ప్రతిధ్వనిస్తుంది. మొత్తానికి, 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' ఒక నేర కథ కాదు... నైతికత, బాధ్యత, పశ్చాత్తాపం, విముక్తి వంటి ప్రశ్నలపై లోతైన పరిశీలన. నెమ్మదిగా సాగినా, పాఠకుడిని మానసికంగా కుదిపేసే శక్తి ఈ నవలకు ఉంది. అందుకే ఇది ఇప్పటికీ జీవితంలో తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో నిలిచింది.




# తెలుగుపై కీలక శాసనం



ఆంధ్రప్రదేశ్‌లోని పిటికాయగుళ్ల ప్రాంతంలో తాజాగా లభించిన అరుదైన ఎనిమిదో శతాబ్దపు ప్రారంభ కాలానికి చెందిన తెలుగు శాసనం, తెలుగు భాషా వికాస చరిత్రలో ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఈ శాసనం ద్వారా ప్రాచీన కాలంలో తెలుగు ఎలా మెల్లగా ప్రాకృత ప్రభావం నుంచి బయటపడి స్వతంత్ర పరిపాలనా, సాహిత్య భాషగా ఎదిగిందో అర్థం చేసుకునేందుకు ముఖ్యమైన ఆధారాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా శాసన శాస్త్రం, భాషా చరిత్ర అధ్యయనాల్లో ఇది ఎంతో విలువైన ఆధారంగా నిలుస్తోంది. ఈ శాసనం ప్రాథమిక తెలుగు లిపి, భాషలో ఉంది. ఇందులో 'స్వస్తిశ్రీ నందేలు వారి', 'చెంసినవంతు ప్రాణి', 'మిల్లి ఆచారి', 'పడసిన నవ కట్ట' అనే వాక్యాలు ఉన్నాయి. శాసన పండితుల అభిప్రాయం ప్రకారం, ఈ వాక్యాలు ఒక కొత్త కట్ట లేదా ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సమాచారాన్ని నమోదు చేస్తున్నాయి. 'నవ కట్ట' అనే పదం ఆ కాలంలో ప్రజల జీవన విధానంలో నీటి నిర్వహణ ఎంత ముఖ్యమైనదో సూచిస్తోంది. వ్యవసాయం ఆధారంగా ఉన్న సమాజంలో నీటిపారుదల సదుపాయాల నిర్మాణం రాజ్య పరిపాలనతో పాటు స్థానిక నిపుణుల పాత్రను కూడా ప్రతిబింబిస్తుంది. ఈ నిర్మాణాన్ని ప్రాణిమిల్లి ఆచారి అనే శిల్పి లేదా కార్మికుడు చేపట్టినట్లు శాసనం పేర్కొంటుంది. సాధారణంగా ప్రాచీన శాసనాల్లో రాజులు, దానాలు, దేవాలయ నిర్మాణాలే ప్రధానంగా కనిపిస్తాయి. అయితే ఈ శాసనంలో ఒక శిల్పి పేరు రావడం విశేషం. ఇది ఆ కాలంలో కార్మికులు, శిల్పులకు సమాజంలో ఉన్న గౌరవాన్ని, వారి కృషికి లభించిన గుర్తింపును సూచిస్తుంది. ఈ శాసనం రేనాడు ప్రాంతానికి చెందినదిగా భావించబడుతోంది. ఆ ప్రాంతం అప్పట్లో రాజ్య పరిపాలన కింద ఉన్నప్పటికీ, ఈ శాసనంలో పాలక రాజు పేరు ఎక్కడా లేదు. అయినప్పటికీ, ప్రజాపనులు మరియు పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన సంకేతాలు ఇందులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలుగు భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది మరియు నేడు 13 కోట్లకు పైగా ప్రజలు మాట్లాడే భాషగా విస్తరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు భారతదేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాల్లో కూడా తెలుగు భాష మాట్లాడేవారు ఉన్నారు. భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ప్రోటోద్రావిడ భాష సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం ఉపభాషలుగా విభజించబడింది. ఆ ప్రక్రియలోనే తెలుగు ఒక ప్రత్యేక భాషగా క్రమంగా రూపుదిద్దుకుంది. క్రీస్తుపూర్వం 10వ శతాబ్దం నాటికే తెలుగు స్వతంత్ర భాషగా అవతరించినట్లు భావిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలతో సాంస్కృతికంగా గాఢమైన సంబంధాలు కలిగి ఉన్నప్పటికీ, భాషా నిర్మాణ పరంగా ఇది కేంద్ర ద్రావిడ భాషలకు మరింత దగ్గరగా ఉందని పండితులు చెబుతారు. ఇప్పటివరకు లభించిన అత్యంత ప్రాచీన తెలుగు శాసనాలు క్రీస్తు శకం 575 ప్రాంతానికి చెందినవిగా గుర్తింపు సంపాదించాయి. ఇవి రేనాటి చోళుల కాలానికి సంబంధించినవి. వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని కలమల్ల, ఎర్రగుడిపాడు ప్రాంతాల్లో కనుగొన్నారు. ఇవే తెలుగు భాష శాసన చరిత్రలో తొలి స్పష్టమైన మైలురాళ్లు. అయితే, తెలుగు భాష చరిత్ర మరింత ప్రాచీనమైనది. దాని లిఖిత చరిత్ర క్రీస్తుపూర్వం 200 ప్రాంతం నుంచి ప్రారంభమవుతుందని భావిస్తారు. ప్రాకృత, సంస్కృత శాసనాల్లో కనిపించే స్థల నామాలు, వ్యక్తి నామాల ద్వారా తెలుగు భాషా ప్రాచీనతను పరిశోధకులు నిర్ధారించారు. ఆధునిక భారతదేశంలో తెలుగు భాషకు ఉన్న స్థానం కూడా ఎంతో విశిష్టమైనది. అందుకే తెలుగును భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చారు. 2008లో భారత ప్రభుత్వం దీనిని శాస్త్రీయ భాషగా గుర్తించింది. పిటికాయగుళ్ల శాసనం వంటి ఆవిష్కరణలు, తెలుగు భాష యొక్క గొప్ప వారసత్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

# బాధలోనే మానవత్వం పండించిన దొస్తయేవస్కీ


(దొస్తయేవస్కీ11నవంబర్ 1821– 9 ఫిబ్రవరి 1881)

దొస్తయేవస్కీ .. బాధను అనుభవస్తూనే, మానవత్వం వెలిగించిన మహాకవి. అతని జీవితం బాధ, దారిద్ర్యం, అనారోగ్యం వంటి వ్యక్తిగత దుఃఖాల సమాహారం. ఒకవైపు తీవ్రమైన పేదరికం, మరోవైపు అప్పుల బాధ, ఇంకొకవైపు పత్రికా ప్రపంచంలో అపజయాలు మనిషిని నిలువునా కుంగదీసే పరిస్థితులు. దొస్తయేవస్కీమనసును చిదిమేసిన ఈ సంఘటనల నుంచి బయటపడి, మానవత్వా న్ని తన రచనల్లో చాటుకున్నాడు. నిబద్ధత అతని ప్ర త్యేక లక్షణం. ఈ కోణమే అతనిని ఒక అరుదైన వ్యక్తిగా నిలబెట్టింది. దొస్తయేవస్కీ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన సంఘటనల్లో మొదటిది చిన్న కుమార్తె మరణం. ఆ తరువాత తన ప్రియమైన కుమారుడు అల్యోషా చనిపోవడం అతని హృదయాన్ని చీల్చివేసింది. జీవితాంతం ఎపిలెప్సీ వ్యా ధితో పోరాడుతూ జీవించాడు. అయితే, అతని యు ద్ధం మాత్రం అంతరంగపు తపనతో కొనసాగింది. తన రచనలకు సమకాలీన రచయితల మద్దతు లేకపోవ డం, ప్రభుత్వ నిర్లక్ష్యం, కుటుంబ సంబంధాల్లో ఉద్రిక్తత తదితర కారణాలు అతని జీవనంలో పెను తుపా ను సృష్టించాయి. అయినా కూడా, ఆత్మవిశ్వాసం, సా నుభూతి, సమానత్వం పట్ల అతనికి ఉన్న విశ్వాసం ఎ ప్పుడూ తగ్గలేదు. దొస్తయేవస్కీఒక కథ, నవలా రచయితగానే కాదు.. మానవ మానసిక గంభీరతను అర్థం చేసుకున్న తత్వవేత్త కూడా. అతని రచనలు మానవాత్మ సంక్లిష్టతలు, నైతికత, బాధ, విముక్తి వంటి వాస్తవాలను అన్వేషిస్తాయి. అలాంటి నవలల్లో 'పూర్ ఫోక్' (పేద ప్రజలు) ఒకటి. ఇది మనిషి చీకటి అంతర్మథనాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది స్టీవర్ పీటర్స్‌బర్గ్‌లో నివసించే ఇద్దరు పేద వ్యక్తుల మధ్య లేఖల రూపంలో ఉంటుంది. మాకర్ దేవుష్కిన్, ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి, వర్వారా దొబ్రోసెలోవా, జీవించడానికి పోరాటం చేస్తున్న యువతి. వారి లేఖల ద్వారా మనం వారి పరస్పర అనురాగం, బాధలు, ఈ కఠిన ప్రపంచంలో ఉన్న కాసింత ఆశలను పాఠకుడు చూస్తాడు. పేదల ఒంటరితనం, చిన్న చిన్న సంతోషాలు, అంతంత మాత్రపు జీవితాలు నడవడానికి అవసరమైన భావోద్వేగ బలాన్ని దొస్తయేవస్కీఅద్భుతంగా చిత్రించాడు. ఈ జీవితం యథార్థంగా బాధతో నిండినప్పటికీ, వారు పరస్పరం చూపించే విన్నపడే మానవత్వంలో ఒక నిశ్శబ్దమైన మహిమ ఉంది. 'పూర్ ఫోక్' అనేది కేవలం పేదరికం గూరించిన కథ కాదు, అది మానవత్వానికి సంబంధించినది. అఅత్యంత కఠిన పరిస్థుల్లోనైనా ప్రేమ, అనుకంప మనసును తాకవచ్చనే విషయాన్ని రచయిత అద్భుతంగా వివరిస్తాడు. ఇది దొస్తయేవస్కీమొదటి నవల. సగటు మనిషి హృదయాన్ని బాగా అర్థం చేసుకున్న ఒక గొప్ప రచయితగా ఈ నవల దోస్తోవ్‌స్కీని పరిచయం చేస్తుంది. ఈ నవల లేఖల రూపంలో ఉండటం, ప్రధాన పాత్రల జీవితాల స్వరూపాన్ని, వారి ఆత్మీయతనూ మరింత చేరువగా అనుభూతి చేస్తాయి. పేదరికం కారణంగా వచ్చే శారీరక, ఆర్థిక ఒత్తిడి, సామాజిక అసమానతలు నవలలోనే ప్రబలంగా నిలవడంతో పాటు, పేద ప్రజల జీవితాలపై లోతైన దృష్టిని అందిస్తుంది. ఇది మానవతా స్ఫూర్తితో నిండి, హృదయాన్ని తాకే రచన. ఇది పేదరికం, ప్రేమ, జీవితంలో మానవీయత గురించి ఒక అగాధమైన సందేశాన్ని అందిస్తుంది. దొస్తయేవస్కీమరణ సమయంలో అతని అంత్యక్రియలకు అరవై వేల మందికి పైగా జనసమ్మేళనం రావడం, అతను జీవితంలో పొందలేని గౌరవం ఆయన మరణానంతరం రష్యా సమాజం ఇచ్చిన సూచన. అతని రచనలలో లభించే మానవ ప్రేమ, లోతైన ఆత్మ పరిశీలన ప్రపంచవ్యాప్తంగా తరతరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. బాధలో అర్థాన్ని కనుగొనడం, నిరాశలో సత్యాన్ని గుర్తించడం వంటి అంశాలన్నీ దొస్తయేవస్కీ సాహిత్య వైభవానికి మూలాధారాలు. ఇంతటి కఠినజీవితాన్ని గడిపినప్పటికీ, దొస్తయేవస్కీమానవ అదృష్టంపై విశ్వాసాన్ని కో ల్పోలేదు. అతని దృష్టిలో మనిషి బాధ అనేది కేవలం శాపం కాదు.. అది ఆత్మబోధకు దారితీసే మార్గం. అతని కథలు ఈ సత్యాన్నే కలకాలం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. మనిషి ఎంత చీకటిలో పడిపోయినా, తన అంతర్మనసులో వెలుతురు వెతుకుతూనే ఉంటే జీవితం అర్థవంతమవుతుందనే జీవిత సత్యాన్ని దొస్తయేవస్కీజీవితం మనకు నిత్యం గుర్తుచేస్తునే ఉంటుంది.

## ఈ వారం కవితలు

### అక్షరవాన కురుస్తుంటే

వానచినుకులు
చిటపటా పడుతుంటే,
భూమి లయపట్టి
సుశబ్దాలు వినిపిస్తుంది,
కాలం క్షణాల్లో కరిగిపోతూ,
నిశ్శబ్దం శ్వాస తీసుకుంటుంది.

అక్షరజల్లులు టపటపా రాలుతుంటే,
మౌనపు గర్భంలో అర్థాలు మొలకెత్తి,
ఆలోచనలకు రూపం ఇచ్చి,
మనసుకు దారులు చూపిస్తుంది.

నల్లని మబ్బులు గర్జిస్తుంటే,
అంతరంగ మౌనం గొంతు విప్పి,
అనుభవాల భారం దించుకుని,
కాలంతో మాట కలుపుతుంది.

మిన్నున మెరుపులు మిళమిళా మెరుస్తుంటే, చీకటి నుదుట
సత్యం మెరుస్తుంది,
అజ్ఞానపు అంచులు చెదిరి,
అర్థజ్యోతి సర్వత్రా వ్యాపిస్తుంది.

చల్లని గాలి తాకిన వేళ,
జడమైన ఆలోచనలు కదిలి,
నిశ్చలత కరిగి ప్రవాహమై,
చైతన్యం దారి పడుతుంది.

మట్టివాసనలు వ్యాపిస్తుంటే,
వేరుల జ్ఞాపకాలు తడుముతాయి,
నేలతో ఉన్న బంధం గుర్తొచ్చి,
మనసు నేలవైపు వంగుతుంది.

వర్షపునీరు గలగలా పారుతుంటే,
పాత గాయాలు మానిపోతాయి,
వేదనల బరువు తేలిపోగా,
హృదయం తేలికపడుతుంది.
అక్షరఝరులు టకటకా
ప్రవహిస్తుంటే,
స్పర్శలుగా మనసును తాకి,
గాయాలపై సాంత్వన చల్లుతూ,
భావాలకు ఊపిరి పోస్తాయి.

సకాలవర్షం సంబరమైతే,
సమాజం సేదతీరుతుంది,
అక్షరవాన కురిస్తే,
సాహిత్యం పునర్జన్మ పొందుతుంది.

వానలు కురవాలి వానదేవుడా,
పంటలు పండాలి కర్షకులారా,
అక్షరాలు వెలగాలి సరస్వతీమాతా,
మదులు మురిసిపోవాలి
పాఠకులారా!

గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్

### వ్యసనాల దారుల్లో..!

స్వేచ్ఛ కళ్లెం తెంచుకుని
అడ్డదారుల్లో పరిగెడుతోంది
స్వచ్ఛమైన జీవితం పైన
వ్యసనపు మచ్చలు ఏర్పడుతూ
జీవనాన్ని చీకటి కమ్మేస్తోంది

డ్రగ్స్ మోజులో యువతరం
మునకలేస్తూనే మునుగుతోంది
భవిష్యత్తుపై దుప్పటి కప్పేస్తూ
లోకం దృష్టిలో హీనమైంది
పొరలు కమ్మిన కళ్ళతో తిరుగుతూ
మానవతను చిదిమేస్తోంది

మద్యపానం మత్తులో
తలమునకలై తలకిందులవుతూ
పచ్చని సంసారపు బాటలో
ముళ్ళు కంపల్ని పేర్చుకుంటోంది
కటకటలాల నడుమన నిలబడి
ఐనవారి కంట్లో కన్నీరై ఒలికింది
వ్యసనాల దారుల్లో మానవత
కళ్ళు మూసుకుని నడుస్తోంది
వేగంతో విన్యాసాలు చేస్తూ
ప్రాణాపాయ స్థితికి చేరుతోంది
అరచేతి అద్దంలో చిత్రాలు చూస్తూ
ఒంటి కాలి సర్కస్ లతో
ప్రమాదాన్ని ముద్దాడుతోంది

అతి వ్యసనపు దారిలో నడుస్తూ
జీవితాన్ని ఆరంభంలోనే
అంతిమ దిశగా మళ్ళించకు
కన్నపేగు కన్నీటి పర్యంతమౌతుంది
మనిషి జన్మ ఆదిలోనే నిరర్థకమై
నీరుగారిపోయి వ్యర్థమైపోతుంది

నరెద్దుల రాజారెడ్డి
9666016636

### 'కంకి కొడవలి గుర్తుకు' ఓటేసి గెలిపిద్దాం.!

రండి రండి కదలి రండి
ఊరు వాడ ఉరికి రండి
స్వాగతమని పలుకుదాం.!
కంకి కొడవలి గుర్తుకు మన
కంకి కొడవలి గుర్తుకు

నీ ఓటు నా ఓటు కంకి కొడవలికే వేద్దాం
మన ఓట్లన్ని వేద్దాం బంగారు చెల్లమ్మా
మన జెండను గెలిపిద్దాం ఓటరన్నా
జనం కొరకు పోరుజేసె ఎర్ర జెండ రా!
పాలకుల మెడలొంచి నిగ్గదీసే జెండా రా!
పేద ప్రజల అందరా! కంకి కొడవలి గుర్తురా

ధనము లేని జనం తోటి కంకి కొడవలి తోటి
ఓట్లకు బయలెల్లిరి మన అన్నలు కామ్రేడ్లు
స్వాగతంబు పలుకరండి
కంకి కొడవలి గుర్తుకు
ఓట్లేసి దీవించరండి మన కామ్రేడ్లకు

భూములెన్నో పంచినట్టి
కంకి కొడవలి గుర్తు మనది
లక్షలాది పేదోల్లకు ఇండ్ల జాగలిప్పిన జెండా రా
ఊరు వాడా తిరుగుతూ మన వాడకు వచ్చెను
మన ఓట్లన్ని ఏద్దాము గెలిపించుకందాము

ప్రభుత్వాల పనితీరును ఎండగట్టి అడిగెటొల్లు
బస్తిలో సమస్యలు ఆడిగి తెలుసు కునెటొల్లు
కాలనీల కష్టాలకు ముందుండి పోరెటొల్లు
హర్నిశలు మన కోసం పోరాటము చేసెటొల్లు
కంకి కొడవలి గుర్తొల్లు మన వాడకు వొస్తున్నరు
ఎదురుకొని వొద్దాము
గడప గడప తిప్పుదాము
ఓటేసి గెలిపించి పురపోరుకు పంపుదాము
గెలిచినంక మన ఊరు అభివృద్ధిని
సాధించుకుందాము

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

స్థానికం LOCAL NEWS
మహబూబ్‌నగర్
సోమవారం
09-02-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం Telugu National Daily


## కాలనీ సంక్షేమ సంఘాలతో అభివృద్ధి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి సాధిస్తాయని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని సాహెబ్ నగర్, పటేల్ గూడా కాలనీ సంక్షేమ భవనం నిర్మాణం 22 లక్షలతో నిర్మించిన భవనంను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శేఖర్ ఆనంద్, అశోక్, జంగయ్య, దశరథ, అశ్విన్ కుమార్, ఉప్పల బాబు, అంజయ్య, నరసింహ, అశోక్, పార్టీ నాయకులు సురేష్ కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీగా పనులు పూర్తి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సుభద్ర కాలనీ అభివృద్ధిలో మరో ముందడుగు వేసిందని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని సుభద్ర కాలనీలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులు పూర్తి కావడంతో కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో దశల వారిగా పనులు చేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల సమన్వయం చేస్తు ప్రతి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మ ణ స్వామి, సుబ్రహ్మణ్యం, ఎం. కొండయ్య, ఫణి కుమార్, నర్సింహారావు, జిఎల్‌ఆర్ ప్రసాద్, బిజెపి నాయకులు అశోక్, నర్సింహా, ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి సహకారం

ప్రజాపక్షం/హయత నగర్ : మన్సూరాబాద్ డివిజన్‌లో ప్రతి కాలనీకి న్యాయం, ప్రతి అడుగు అభివృద్ధి వైపు ఇదే మా పరిపాలన దృక్పథం అని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లో పలు అభివృద్ధి పనులన ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు మోహన్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, జేజేరెడ్డి, శ్రీశైలం యాదవ్, ఆదినారాయణ చౌదరి,అశోక్ యాదవ్, స్థానిక ప్రజలు,బి జె పి నాయకులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ఉచిత వైద్య శిభిరం విజయవంతమైంది. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బుచ్చిగూడ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పొల్టి రంగ ప్రముఖులు స్వర్గీయ ఎంపి శేషయ్య వర్ధంతి సందర్భంగా కమ్మ సమైక్య వేదిక అధ్యక్షుడు మన్నవ సాంబశివ రావు సహకారంతో, స్థానిక వివా ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివా ఆసుపత్రి వైద్యుడు శ్రీనివాస్‌చ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రేష్ఠ, డాక్టర్ శ్వేతలతోపాటు సిబ్బంది పాల్గొని 150మంది సిబ్బందికి, గ్రామస్తులు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్ గౌడ్, ఉప సర్పంచ్ చీపిరి మహేష్ యాదవ్, కావలి శ్రీనివాస్, గణేష్ యాదవ్, బి.నరసింహ, భాస్కర్ రెడ్డి, కృష్ణావేణి, కమలమ్మ లలిత, నరేందర్‌రెడ్డి, కృష్ణ యాదవ్, సమైక్య వేదిక ఉపాధ్యక్షుడు మదమంచి వెంకటనారాయణ, నువ్వుల శ్రీనివాస రావు, మన్నవ హనుమంతరావు, కాటూరి సీతారామారావు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ రికవరీ..బాధితుడికి అందజేత

ప్రజాపక్షం/కేశంపేట: చోరీ అయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందించినట్లు కేశంపేట సిఐ నరహరి తెలిపారు. ఆదివారం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో వేములనర్వ గ్రామ చౌదర్‌గూడ గ్రామానికి చెందిన వడ్డె శ్రీను అనే యువకుడు మొబైల్ ఫోన్ సుమారు రెండు నెలల క్రితం పోయిందని సిఐ నరహరి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు తక్షణమే చర్యలు తీసుకొని సిఐ నరహరి పర్యవేక్షణలో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి సిఇఐఆర్ పోర్టల్ సహాయంతో సాంకేతికంగా మొబైల్ ఫోన్‌ను విజయవంతంగా ట్రేస్ చేసినట్లు వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగతనం కేసును చేధించిన పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రముఖ ఒగ్గు కళాకారిణి మల్లారి అంత్యక్రియలు

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారిణి జమ్మ మల్లారి అంత్యక్రియలు గ్రామంలో అశేష సన వాహిణి మధ్య జరిగాయి. రాష్ట్రంలోని పలు గ్రామాల నుండి మల్లారి కడసారి చూపునకు హాజరైనారు. ఆటపాటలతో డప్పు చప్పుళ్ళతో అంత్యక్రియలు సాగాయి. ఒగ్గు కళాకారులు కథలు చెప్తు పాటలు పాడుతూ ముందుకు సాగారు. శివసత్తులు, నృత్యాలు చేశారు. సాధారణ కుటుంభంలో పుట్టిన మల్లారి కాలికి గజ్జెకట్టి డోలు వాయిస్తూ చిందిసే తలకు పాగా ను చుట్టి ఒగుగ కథను చేప్పేది, రాష్ట్రంలో ఆమె ఒగ్గు కథకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ప్రభుత్వం మల్లారి ఒగ్గు కథను గుర్తించి రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారానికి ఎంపిక చేసింది. ప్రముఖులతో పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండిజమ్మ మల్లారి అంత్యక్రియలకు హాజరైనారు. మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు, బిఅర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, సిపిఐయం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కాంగ్రెస్ నాయకులు కోత్తకుర్మ మంగమ్మ, శివకుమార్ లతో పలువురు ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ వద్దు

### కుర్మిద్ద తండా గిరిజన రైతుల ఆవేదన

ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం బలవంతపు భూసేకరణ అపాలని కుర్మిద్ద తండా గిరిజనులు ఆధికారులను వేడుకున్నారు. ఆదివారం గిరిజనుల పొలాల నుండి ఫ్యూచర్ సిటీకి వేస్తున్న రోడ్డు పనులను గిరి జన రైతులు అడ్డుకున్నారు. ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ మా పొలాల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. మా భూముల్లో రోడ్డు వేయవద్దని కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని అవేధన వ్యక్తం చేశారు. ప్రాణం పోయిన మా భూములు ఇచ్చే ప్రసక్తేలేదని వారు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో రైతులు విస్లావత్ పాండు, సోమల, రాములు, సత్తులాల్, లోక్య, లాలు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో రూ.7 కోట్ల విలువైన..

# పార్క్ భూమిని కాపాడిన హైడ్రా

ప్రజాపక్షం/హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీలో ఉన్న విలువైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు ఆదివారం కాపాడారు. మొత్తం 1253.8 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ.7 కోట్లుగా ఉంటుందనే అంచనగా ఉంది. చక్రపురి కాలనీ సంక్షేమ సంఘం, పార్కు స్థలం ఆక్రమణలకు గురవుతోందని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు చేపట్టారు. కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. సర్వే నెంబర్ 135లో, అమీన్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న ఈ భూమిని గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం. 12343/2022 (తేదీ: 31 మార్చి 2022) ప్రకారం ప్రజా వినియోగం కోసం స్థానిక సంస్థలకు అప్పగించినట్లు గుర్తించారు. హుడా లేఅవుట్ అనుమతి ఎల్‌పి నెంబర్ 3814/ఎంపి2/హుడా/85 ప్రకారం ఈ స్థలాన్ని పార్క్, రోడ్ల అభివృద్ధికి కేటాయించారు. పార్కు సరిహద్దు రాళ్లు తొలగించినట్టు గుర్తించిన హైడ్రా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.




అలాగే ఇది పార్కు స్థలమని సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. పార్కును కాపాడిన హైడ్రా అధికారులకు చక్రపురి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో

# బిజెపి సాధిస్తుంది

### బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. బిజెపి పేరు వింటేనే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంటోందన్నారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి 60కి పైగా మున్సిపాలిటీల్లో విజయం సాధిస్తుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లలో 3 నుంచి 4 కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని విశ్వసం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో బిజెపి అభ్యర్థులను అధికార కాంగ్రెస్ పార్టీ బెదిరించే ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. గుండాయిజం తమ పార్టీ సంస్కృతి కాదని, ఈ విషయాన్ని కాంగ్రెస్ గుర్తు పెట్టుకోవాలని అభయ్ పాటిల్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాల్లో కూడా బిజెపి ప్రభావం కొనసాగుతోందన్నారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల కార్పొరేషన్‌లలో అధికార పార్టీ నేతలకు భయం పట్టుకుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థులకు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని, ఎవ్వరూ ధైర్యం కోల్పోవద్దన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి : మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టియుఎఫ్ఐ డిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మున్సిపాలిటీ వార్డులలో గడప గడప ప్రచారంలో భాగంగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,చేవెళ్ల నియోజకవర్గం శాసనసభ్యులు కాలే యాదయ్య,మాజీ ఎంపి గడ్డం రంజిత్ రెడ్డి,చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమ్ భరత్ లతో కలిసి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులు,స్థానిక కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ముఖ్య కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు సద్వినియోగం

### జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్



ప్రజాపక్షం/రంగారెడ్డి : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నిధులు సోమవారం విడుదల అవుతాయని జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15 వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతలో రూ.11.10 కోట్లు జిల్లాలోని గ్రామ పంచాయతీలకు జనవరి నెలలో విడుదల కాగా నేడు రెండో విడత నిధులు విడుదల అవుతాయని తెలిపారు. 3,4వ విడత నిధులు మరో 15 రోజుల్లో విడుదల అవుతాయని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తమగ్రామాల్లో 2023 నుండి పెండింగ్‌లో వున్న పేమెంట్స్‌ను 15వ ఆర్థిక సంఘం కింద చేసిన పనులకు నిధులు లేక పేమెంట్ పెండింగ్‌లో ఉన్నవాటికి చెల్లించాలన్నారు. చెల్లింపులు చేసే ముందు గ్రామ సభ, గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించి వాటిని మరొక సారి తీర్మానం చేయాలని, పెండింగ్ బిల్లులు లేకపోతే కొత్త పనులకు తీర్మానం చేసి, ఆ పనులు కార్యాచరణ ప్రణాళికలో లేకపోతే అనుబంధ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి, ఇ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేసి, పనులు త్వరగా చేసి ,నిధులు చెల్లింపు త్వరగా చేయాలని డిపిఒ స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు నిధులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిధులు ఖర్చు చేయడంలో దుర్వినియోగం చేస్తే సంబంధితుల మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.. 2023–26 మధ్య జరిగిన పనులు పూర్తి అయి వుండి పెండింగ్ బిల్లులకు వెంటనే నిధులు చెల్లించాలి. పెండింగ్ లేకపోతే కొత్త పనులు కూడా అత్యంత వేగంగా పూర్తి చేసి నిధులు చెల్లించాలి. దీనిలో ఎటువంటి నిర్లక్ష్యం, నిరాసక్తత గాని లేకుండా మన గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు.

**అవకతవకలకు ఆస్కారం లేకుండా చెల్లింపులు...** మండల పంచాయతీ అధికారులు తమ మండలలోని గ్రామాల్లో ఇట్టి చెల్లింపులను పర్యవేక్షిస్తూ ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా, పంచాయతీ కార్యదర్శులను, సర్పంచులను సమన్వయం చేసుకుంటూ వారికి అవసరమైన సమాచారాన్ని, క్లారిఫికేషన్ ఇస్తూ 15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల మేరకు తెలిపిన సూచనలు అమలు చేయాలని డిపిఓ సురేష్ మోహన్ ఆదేశించారు. మండలంలో ఎటువంటి అవకతవకలు జరిగినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకుంటామని డివిజనల్ పంచాయతీ అధికారులను హెచ్చరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మండలాల్లో పర్యవేక్షిస్తూ సమన్వయం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్‌లు గ్రామసభలు, గ్రామ పంచాయతీ సమావేశాలు ఏర్పాటు చేసి కొత్త పనుల గురించి తీర్మానాలుచేయాలని, సందేహాలు ఉంటే స్థానిక ఎంపిఒ, ఎంపిడిఒ, డిఎల్‌పిఒలను అడగాలని, అవసరమైతే జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలని సురేష్ మోహన్ పేర్కొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్

ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు అప్రజాస్వామిక లేబర్ చట్టాలని రద్దు చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెక పిలునిచ్చాయి. ఆ సమ్మెకి సంబందించిన పోస్టర్‌ను ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన ఆదివారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫజ్ 2 సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరై రవీంద్ర చారీ మాట్లాడుతూ కార్యక్రమంలో సిపిఐ రంగరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, బిఒసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ మండల నాయకులు యేశాలి నర్సింహా, పొన్నాల యాదగిరి, దవుల రాములు, మంగళపల్లి రవి, సాయిలు, కాసిం, కురుమయ్య, ఈశ్వరయ్య, యాదగిరి, నన్నే సాబ్, జట్టి కాశి, బాలస్వామి, అశోక్, శోభన్ వెంకట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాములుగౌడ్

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: గీత కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు పి.రాములు గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ఆద్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రాములు గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కంచారు. ఈ సందర్భంగా పి రాములు గౌడ్ మాట్లాడుతూ నగరంలో ట్యాంక్‌బండ్‌పై స్వతంత్ర సమరయోధులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మ భిక్షం విగ్రహం ఏర్పాటు చేయాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టలన్నారు. ఈ నెల 15న బొమ్మగాని ధర్మభిక్షం జయంతి ఉత్సవాల్లో గీత కార్మికులు అత్యధిక పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత కార్మకులు డి.యాదయ్యగౌడ్, యాదగిరి గౌడ్, జంగయ్య గౌడ్, మహేష్ గౌడ్, మహేందర్ గౌడ్, కె మల్లేష్ గౌడ్, బి ప్రభాకర్ గౌడ్, బాలు గౌడ్ పాల్గొన్నారు.



## రోడ్ల అభివృద్ధితో పల్లెసీమలు ప్రగతి



ప్రజాపక్షం/కేశంపేట: రోడ్ల అభివృద్ధితోనే పల్లెసీమలు ప్రగతి సాధించడం జరుగుతుందని బోదునంపల్లి సర్పంచ్ ఎదిరె నాగేశ్వర్ వివరించారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామం నుండి రామకృష్ణాపురం వరకు బిటి రోడ్డు అధ్వానంగా తయారైందనే విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. దాంతోనే వెంటనే తక్షణమే స్పంధించి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రోడ్ల కొరకు నిధులు కేటాయించడం మా అదృష్టంగా భావిస్తున్నామని సర్పంచ్ నాగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో లింగరాపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, బోదునంపల్లి ఉప సర్పంచ్ హరిష్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎదిరె బీరప్ప, ఎదిరె వెంకటయ్య, పిప్పళ్ళ నరేందర్, రైతులు జగన్‌రెడ్డి, కసిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటయ్య, నరసింహా, మల్లయ్య, భవనం రామచంద్రారెడ్డి, చాకలి నరసింహా, ఎదిరె అంజయ్య, చల్మారెడ్డి. యాదగిరి, దోమ యాదయ్య, బక్కయ్య ఇమిడి నెహ్రూ, తిరుపతయ్య, బండ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థి మక్బూల్‌ను ఆదరించండి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ప్రజాపక్షం/రంగారెడ్డి: నిరంతరం పేద ప్రజల తరపున పోరాడే కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ని ఆదరించి, అండగా నిలిచి, కంకి కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ అభ్యర్థి మక్బూల్ గెలిపించాలని పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రజలను కోరారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 10వ వార్డు రామన్నగూడలో గడప గడపకు ప్రచారం చేసి ప్రజలను కలిసి అభ్యర్థించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెప్పి, ప్రజలను మోసం చేసే బూర్జువ పార్టీలకు మరోసారి ఓటేసి మోస పోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిరంతరం ప్రజల కోసమే ఆలోచన చేసే సిపిఐకి ఓటు వేసి గెలిపించి చేవెళ్ల మున్సిపల్ అభివృద్ధిని పదవ వార్డు అభివృద్ధిని చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. సిపిఐ 17వ వార్డు సభ్యుడుగా సార్ల



వెంకటేష్ చేవెళ్ల లోని భగత్ సింగ్ నగర్ రంగారెడ్డి నగర్ సిపిఐ కాల నీలో పోటీ చేస్తున్న సందర్భంగా వారికి మద్దతుగా కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచార సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభులింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, బికెయం యు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సుధాకర్ గౌడ్ ,మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, కృష్ణగౌడ్, పాపయ్య, శివ, జలీల్ ఒగ్గు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: మున్సిపాలిటి అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 23,24వ వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అగ్గనూరు బస్వం, అగ్గనూరు విశాల విశ్వంలకు మద్దతుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ఇంటింటి ప్రచారం చేశారు. వార్డుల్లో ఇంటింటికి వెళ్ళి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి సాధిస్తాయని తెలి



పారు. పేదల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రెండేళ్ళ కాలంలో సుమారు వందకోట్ల నిధులతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయడంతోపాటు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రజలందరు అవకాశం ఇచ్చి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిసిప్తే మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివ శంకర్‌గౌడ్, నేతలు పురుషోత్తంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రఘుమారెడ్డి, కట్ట వెంకటేష్ గౌడ్, రాయికల్ ఆశన్న గౌడ్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమ్మె గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనే లక్ష్యంతో ఆదివారం కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సార్వత్రిక సమ్మెను ప్రతి కార్మికుడు బాధ్యతగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గ ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం కూకట్‌పల్లి మండల కార్యదర్శి కె.మనోచారి, సిపిఐ సీనియర్ నాయకులు కె.కృష్ణ చారి, విజపిసి సీనియర్ నాయకులు గంగన్న, జిహెచ్‌ఎంసి మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి మద్దతుగా నరేష్ ప్రచారం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు యాడారం బిజెపి అభ్యర్థి కృష్ణ మద్దతుగా ఇన్‌చార్జ్ బిజెపి జిల్లా సీనియర్ నాయకులు జూపల్లి నరేష్ ఇంటింటి తిరుగుతూ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ మద్దతు ఉన్న యాడారం బలహీన వర్గాల అభ్యర్థి అయిన కృష్ణను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తడిసిన సూర్యశేఖర్‌రెడ్డి,బాబుయాదవ్,శ్రీనివాస్,రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియాగాంధీ నగర్ ఫేస్1లో నూతనంగా నిర్మించిన సొసైటీ కార్యాలయాన్ని ఉప్పల్ ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బిక్షపతి,బాలనర్సింహ,వాసు,నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్డు పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివ ఇజన్‌లోని ఓల్డ్ నేరేడ్‌మెట్, కేశవనగర్ ప్రాంతాల్లో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి, సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు నందు యాదవ్,మురళి గౌడ్, మాధవ్, రాంచందర్, శ్రీలక్ష్మి , చిరంజీవి, చిట్టి, నరేష్, క్రాంతి, ప్రభాకర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ నిర్మాణ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్‌లోని ఇందిరా నెహ్రూనగర్ మూడువ కమాన్ ప్రాంతంలో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన బాక్స్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆదివారం ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యతతో పలు అభివృద్ధి పనులు కొనసాగాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు బహుమతులు




**ప్రజాపక్షం/చర్లపల్లి :** రెండు తెలుగు రాష్ట్రాలలో 9,10 తరగతి విద్యార్థులకు డిసెంబర్‌లో నిర్వహించిన సైన్స్ టాలెంట్ సర్చ్ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఎఫ్‌సి చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్‌కపూర్ అందజేశారు. 9వ తరగతిలో ప్రథమ స్థానం సూర్యాపేటకు చెందిన యాస వీక్షణ, ద్వితీయ స్థానం ఖమ్మంకు చెందిన ఇషాసింగ్,తృతీయ స్థానం ఖమ్మంకు చెందిన హర్షవర్ధన్,10వ తరగతి ప్రథమ సూర్యాపేటకు చెందిన ఉలువల వైష్ణవి, ద్వితీయ స్థానం రాజమండ్రికి చెందిన గట్టి జయంత్, తృతీయ స్థానం ఖమ్మంకు చెందిన లక్ష్మి శార్వాణిలను అందజేశారు.ప్రథమ బహుమతి 25 వేలు,ద్వితీయ బహుమతి 15 వేలు,తృతీయ బహుమతి 10 వేలు అందజేశారు.

## విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ తెలిపారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్‌లో వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, కుక్కల రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మేకల రమేష్, దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** పటాన్‌చెరు నియోజకవర్గంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భా గంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సాగింది. ఈ ప్రచారంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా.వివేక్ వెంకటస్వామి, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, ఇంద్రేశం కో ఆర్డినేటర్ పారిజాత నరసింహ్మరెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి, ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో–ఆర్డినేటర్ డా. సత్యం శ్రీరంగ పాల్గొన్నారు. పాశమైలారం, ఇస్నాపూర్, రుద్రారం, లక్డారం, చిట్కుల్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్స్‌లో 1 నుంచి 26వ వార్డుల వరకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు కావలి పద్మ, రెడ్డి ప్రణీత, కంజర్ల శ్రీవాణి, నీలం కవిత, జ్యోతి సంగన్న, సుంకరి రవీందర్, ముత్యాలు కల్లూరి, పటోళ్ల మాధవి నరేందర్‌రెడ్డి, మంజలి అలివేణి, కొత్తగాది హనుమంత్, బురిగారి శోభ, గడ్డం శ్రీశైలం, గౌండ్ల భారతి, గడ్డం బాలామణి, కమ్మరి నారాయణదాసు, కమ్మిరెడ్డి శరత్ చందర్‌రెడ్డి, కేతావత్ వెంకటేష్, మన్ను రాఘవేంద్ర, లచ్చగౌని సరిత సుధాకర్‌గౌడ్, జ్యోతి లక్ష్మారెడ్డి, బురిగారి అంజిరెడ్డి, గంగానోల్ల మల్లేశ్వరి, పెద్దబోదుల యాదయ్య, పెలిమేలి యదలక్ష్మి , సందీప్ వర్ధన్‌గౌడ్, భూయంకర్ నందీశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీవంటి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల చెంతకు ప్రజా పాలన తీసుకెళ్తోందని అన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనతో పోలిస్తే రాష్ట్రంలో వెయ్యిరెట్లు అభివృద్ధి జరుగుతోందని, గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అవసరమైన నిధులు ప్రజా ప్రభుత్వంలో విస్తృతంగా మంజూరవుతున్నాయని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.



## రోడ్డు డైవర్షన్‌తో వాహనదారులకు ఇబ్బందులు

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి పరిధిలో ఎల్లమ్మబండ నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు పనుల నిమిత్తం అధికారులు రోడ్డు డైవర్షన్ అమలు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్లమ్మబండ నుంచి హౌసింగ్ బోర్డు వెళ్లే ట్రాఫిక్ హై టెన్షన్, జయానగర్, జలవిహార్‌వైపు నుంచి జెఎన్‌టియుకు మళ్లించారు. అయితే డైవర్షన్ అమలు చేయడానికి ముందు కనీసం రోడ్డు మరమ్మత్తులు చేయకుండా, అతి దారుణ స్థితిలో ఉన్న రహదారిపై వాహనాలను మళ్లించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారని ఆరోపిస్తున్నారు. సదురు రోడ్డులో నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. డైవర్షన్ చేయాల్సి వచ్చిన ముందస్తుగా రోడ్డు మరమ్మత్తులు చేపట్టాల్సిందని, జిహెచ్‌ఎంసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హై టెన్షన్ రోడ్ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు కేసులు ఉన్నాయనే కారణంతో రహదారి అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా జిహెచ్‌ఎంసి అధికారులు వెంటనే యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎల్లమ్మబండ చెరువుకు ఆనుకుని ఉన్న ఈ రహదారితో పాటు చెరువును కూడా అభివృద్ధి చేసి జాగర్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని జిహెచ్‌ఎంసి, హైడ్రా అధికారులను స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలి

### సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటపల్లి శంకర్




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కార్మిక హక్కులను కాలరాచే విధంగా అమలులోకి వస్తున్న లేబర్ కోడ్‌ల రద్దు డిమాండ్‌తో ఈ నెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ పిలుపిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలు , జాతీయ ఆస్తులు కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదార్లకు అప్పచెప్పాలన్న కుతంత్ర ఆలోచనలతో కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లు తేవటం విచారకరమన్నారు. కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జవహర్‌నగర్ దళిత సంక్షేమ భవన్‌లో ఆదివారం జరిగిన కాప్రా మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాలను బలహీన పరచి వ్యాపారం సులభతరం అన్న పేరుతో శ్రమ దోపిడీకి తెరతీసిందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లత, వి.స్వరూప నాయక్, ఏఐటియుసి మండల అధ్యక్షులు ఎల్లయ, గిరి ప్రసాద్ నగర్ సిపిఐ కార్యదర్శి కొండా సత్యం, సాగర్ రైతు సంఘం నాయకులు పి.నరసింహ, మహిస మైక్య నాయకురాలు డి.మల్లిక, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** యాప్రాల్ సమీపంలోని రామ హౌసింగ్ కాలనీ, సాయి కృష్ణ ఫేజ్ కాలనీ ప్రాంతాల్లో లోప భూయిష్టంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచేందుకు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి కోరారు. కాలనీ ప్రతినిధులతో ఆమె జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. మరో పక్క యాప్రాల్ సమీపంలోని కందిగూడ ప్రాంతంలో రూ.26 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ఆదివారం నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు.

## ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/చర్లపల్లి :** విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైనిక్‌పురికి చెందిన శ్యామ్ ప్రసాద్ కుమార్తె హృషిత(20) ఇంటర్మీడియేట్‌లో ఫెయిల్ అయ్యింది. సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతూ ఇంట్లోనే చదువుతుంది. వచ్చే పరీక్షలలో అన్ని సబ్జెక్టుల లో పాస్ కావాలని తండ్రి సూచించారు. సరే అని చెప్పి బెడ్‌రూమ్‌కు వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. తలుపులు పగులగొట్టి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మానసిక వత్తిడికి లోనై తన కుమార్తె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈటల రాజేందర్‌కు ఆహ్వానం



**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 280వ డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలో నిర్వహించనున్న మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక దేవి 40వ వార్షిక కళ్యాణ మహోత్సవానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ బిజెపి కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ ఎంపి ఈటల రాజేందర్‌ని కలిసి మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అనంతరం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్, బిజెపి సీనియర్ నాయకులు ఎస్.మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా బిజెపి ప్రదాన కార్యదర్శి గిరివర్థన్ రెడ్డిలను కలిసి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గండి రాజుయాదవ్, కమిటీ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తుంది



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని కొల్తూర్, కేశ్వాపూర్, కేశవరం గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. స్థానిక కాలనీల్లో ఇంటింటికి తిరుగుతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గడిచిన రెండేళ్లలో మేడ్చల్ ఎంఎల్‌ఎ ఏలాంటి సమస్యలు పరిష్కరించకుండా తన సొంత వ్యాపారాల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, మాజి మేయర్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోనె మహేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి హన్మంతరెడ్డి, మాజి సర్పంచ్ నల్ల శిల్పాయాదగిరి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా అక్రిడిషన్‌కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. 2026–28సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల జారీ కోసం ఆన లైన్ దరఖాస్తు చేసుకోవాని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడేషన్ కార్డుల కోసం మీడియా యాజమన్యలు తమ జర్నలిస్టుల పేర్లు జాబితా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వైబ్ సైట్ http://ipr.telangana,gov,inద్వారా దరఖాస్తులు చేసుకోవాలని నేటి నుండి అర్హులైన జర్నలిస్టులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం /వికారాబాద్ :** మన్సిపల్ ఎన్నికల్లో భాగంగా స్పికర్ ప్రసాద్‌కుమార్ అదేశాల మేరకు 25వ వార్డు సుభాష్‌నగర్ కాలనీలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ న మాట్లాడుతూ కాంగ్రెస్ బలపార్చిన అభ్యర్థులు వికారాబాద్ మున్సిపల్ ల్లో గెలివడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు సిద్దునూరి యాదగిరి , విజయ్‌కుమార్ ,వెంకట్ ,సుదాకర్ , నర్సింలు , రహిం ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ముందుకెళ్లాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** యువత ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని బిఆర్‌ఎస్ ఎల్‌పివిప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, ప్రగతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ కుంపు అకాడమిని ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ యువత శారీరక ధృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ అకాడమి ద్వారా పిల్లలకు సంప్రదాయ యుద్ధకళల్లో శిక్షణ అందించడం అభినందనీయమని చెప్పారు. నేటి సమాజంలో స్వీయ రక్షణ ఎంతో అవసరమని, ముఖ్యంగా బాలికలు, మహిళలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ధైర్యంగా ముందుకు వెళ్తారని తెలిపారు. ఇలాంటి అకాడమీలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రంగరాయ ప్రసాద్, దన్‌రాజ్, ఆగం రాజు ముదిరాజ్, రాఘవేంద్ర రావు, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రవీన్ గౌడ్, సలీమ్, సాంబశివ రెడ్డి, శ్రీకర్ గుప్త పాల్గొన్నారు.

#### బాచుపల్లిలో షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే

నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లిలో రామరాజు కాటన్ షోరూమ్‌ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఇలాంటి వ్యాపార సంస్థలతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యాపార రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు ఆగం రాజు ముదిరాజ్, రంగరాయ ప్రసాద్, దన్ రాజ్, బొర్రా దేవి చందు ముదిరాజ్, సుజాత, సాంబశివ రెడ్డి, శ్రీకర్ గుప్త, నరసింహా రాజు పాల్గొన్నారు.

#### ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కట్టమైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో భక్తు లు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డిలు వేర్వేరుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంప్రదాయా లు, సంస్కృతితో ఆత్మ గౌరవాన్ని పెంచుతాయని అన్నారు. కుల, మతాలకు అతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.





## రెండేళ్ళ తరువాత వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే:కెటిఆర్



**ప్రజాపక్షం/తాండూరు :** రాష్ట్రంలో భస్మాసూర పాలన కొనసాగుతుందని కాంగ్రెస్‌ది ఆత్మీయ హస్తం కాదు భస్మాసూర హస్తం అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కోటిఆర్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో మాజీ ఎంఎల్‌ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరాచౌక్‌లో నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే రాష్ట్రంలో ప్రజాపాలన పోయి భస్మాసుర పాలన కొనసాగుతుందన్నారు. రెండేళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖతం అవ్వడం ఖాయమని, రెండే ళ్ళ తరువాతం బిఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని కెసిఆర్ సిఎం అవుతారని, రోహిత్‌రెడ్డి ఎంఎల్‌ఎ వుతారని అన్నారు. గత ప్రభుత్వం హాయంలో తాండూరుకు నర్సింగ్ కళాశాల తీసుకవస్తే ఈ ప్రభుత్వం వచ్చాక నర్సింగ్ కళాశాలను కోడంగల్‌కు తీసుకవెళ్ళారని సిఎం రేవంత్‌రెడ్డికి నిజాయితీ ఉంటే తిరిగి తాండూరుకు తీసుకరావాల ని సవాల్ విసరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీశైల్‌రెడ్డి,చైర్మన్ అభ్యర్థి పట్లోళ నర్సిములు, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, దీపా తదితురులు ఉన్నారు.

## కేంద్ర నిధులతో వార్డుల అభివృద్ధి

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మున్సిపల్‌లోని పలు వార్డులో మాజీ బిజెపి జిల్లా అధ్యక్షుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అభివృద్ధికోసం బిజెపిని గెలిపించాలన్నారు. కేంద్రం నీధులతో మున్సిప ల్ వార్డుల అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్లు, లైట్లు, మంచినీరు వంటి మౌలిక వసతుల కల్పన కోసం కేంద్రం నుండి నిధులు రావడం జరుగుతుందన్నారు. రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ఓటర్లను ప్రలోభ పేడుతు ఓట్లు వేయించుకోవాలని చూస్తుందన్నారు. వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే బిజెపి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గెలిచి రెండు సంవత్సరాలు అయింది కాని వికారాబాద్‌కు ఎన్ని నిధులు తీసుకు వచ్చరో శ్వేతపత్రం విడుదల చేయాలని సూచించారు. మాటలు తప్ప పనులు ఎక్కడ చేయడం లేదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



# స్వదేశానికి జగజ్జేతలు

## ముంబై విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం



అండర్–19 వన్డే ప్రపంచకప్ విజేత భారత జట్టు సగర్వంగా స్వదేశంలో అడుగుపెట్టింది. ఆరోసారి రికార్డు టైటిల్‌తో యావత్ భారతావని గర్వపడేలా చేసిన ఆయుశ్ మాత్రే బృందం ఆదివారం ముంబై విమానాశ్రయంలో దిగింది. జగజ్జేతలు గా తిరిగొచ్చిన టీమిండియా క్రికెటర్లకు కుటుంబ సభ్యులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, అభిమానులు ఘన స్వాగతం పలికారు. సొంతగడ్డపై తమను ఘనంగా ఆహ్వానించడంపై యువ క్రికెటర్లు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.
అండర్–19 ఛాంపియన్లుగా స్వదేశం విచ్చేసిన భారత క్రికెటర్లను చూసి కుటుంబసభ్యులు పొంగిపోయారు. టీమిండియా విజయంలో కీలకమైన కెప్టెన్ ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, అభిగ్యాన్ కుందు, హెనిల్ పటేల్ ముంబై విమానాశ్రయం చేరుకున్నారు. వారిని చూసేందుకు మీడియా, అభిమానులు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిజేతలను మాట్లాడించేందుకు పోటీపడ్డారు. పేసర్ హెనిల్ పటేల్ మాట్లాడుతూ దేశం కోసం వరల్డ్ కప్ గెలవాలని అందరం లక్ష్యంగా పెట్టుకున్నాం. అనుకున్నట్టే సాధించాం. నా తదుపరి లక్ష్యం సీనియర్ జట్టుకు ఆడడమే అని చెప్పాడు. వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు స్పందిస్తూ.. ప్రపంచకప్ గెలిచినందుకు తమకు ఎంతో గర్వంగా ఉందన్నాడు. ఇక కెప్టెన్ ఆయుష్ మాత్రే తండ్రి యోగేశ్ కమలాకర్ మాత్రే పట్టలేనంత సంతోషంగా ఉందన్నాడు. అండర్–19 ప్రంపచకప్ గెలుపొందడం ద్వారా ఆయుశ్ దేశమంతా గర్వపడేలా చేశాడు అని ఆయన పేర్కొన్నాడు.

# ఇంగ్లండ్‌ను భయపెట్టిన నేపాల్

### ఉత్కంఠ పోరులో గట్టెక్కిన మాజీ ఛాంపియన్!

టి–20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కొద్దిలో ఓటమి నుంచి తప్పించుకుంది ఇంగ్లండ్. ఉత్కంఠ పోరులో నేపాల్ బ్యాటర్ల విజృంభణతో ఓటమి అంచున నిలిచిన మాజీ ఛాంపియన్ ఆఖరి ఓవర్ థ్రిల్లర్లో గట్టెక్కింది. దీపేంద్ర సింగ్ ఐరీ(44) కెప్టెన రోహిత్ పొడెల్(39) ల మెరుపులతో విజయానికి చేరువైన ప్రత్యర్థికి చివరి ఓవర్లో 10 రన్స్ అవసరమవ్వగా.. సామ్ కరన్ 5 రన్స్ మాత్రమే ఇచ్చి ఇంగ్లండ్‌ను గెలిపించాడు. సిక్సర్ల తో చెలరేగి నేపాల్‌ను విజయతీరాలకు చేర్చిన లోకేష్ బామ్(39 నాటౌట్) కరన్ సంధించిన యార్కర్లను బౌండరీలుగా మలచలేకపోయాడు. దాంతో 4 పరుగుల తేడాతో బతికిపోయిన ఇంగ్లండ్ పాయింట్ల ఖాతా తెరిచింది. పొట్టిప్రపంచకప్‌లో నేపాల్ సంచలనం సృష్టించే అవకాశాన్ని చేజార్చుకుంది. వాంఖడేలో స్వదేశీ అభిమానుల మద్ధతుతో చెలరేగిన ఆసియా జట్టు బలమైన ఇంగ్లండ్‌ను 184కే కట్టడి చేసింది. ఓపెనర్లు తేలిపోవడంతో కుర్రాడు జాకబ్ బెథెల్(55), హ్యారీ బ్రూక్(53), విల్ జాక్స్ (39నాటౌట్) రాణించారు. అనంతరం భారీ ఛేదనలో నేపాల్ కు ఓపెనర్ కుశాల్ భుటెల్(29) శుభారంభమివ్వగా.. మిడిల్ ఓవర్లలో ఇంగ్లండ్ స్పిన్నర్లను దీపేంద్రసింగ్ ఐరీ (44), సారథి రోహిత్ పొడెల్(39) ధీటుగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి జోరుతో గెలుపు దిశగా సాగిన నేపాల్‌ను సామ్ కరన్ దెబ్బకొట్టాడు. కేవలం రెండే పరుగులిచ్చి డేంజరస్ దీపేంద్రను ఔట్ చేశాడు. ఆ తర్వాత పొడెల్ సైతం వెనుదిరిగాడు. మ్యాచ్ ఇంగ్లండ్ వైపు తిరిగిన వేళ లోకేష్ బామ్(39 నాటౌట్) బ్రూక్ సేనకు ముచ్చెమటలు పట్టించాడు.
**రెండు సిక్సర్లతో ఉత్కంఠ..** ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన లోకేశ్ నేపాల్ శిబిరంలో ఆశలు రేపాడు. అనంతరం.. ల్యూక్ వుడ్ ఓవర్లో తొలి బంతికే కీపర్ వెనకాల బౌండరీ రాబట్టిన అతడు.. మూడో బంతిని మిడాఫ్లో ఫోర్‌గా మలిచాడు. కానీ, ఆఖరి బంతికి వుడ్ యార్కర్‌కు గుల్బన్ జా బౌల్డయ్యాడు.

# 'సూర్య జోక్ చేస్తుండనుకున్నా'




ఒకరి గాయం.. మరొకరికి వరం అనే మాట ఆటల్లో నూరుపాళ్లు నిజమే. ప్రస్తుతం టి–20 ప్రపంచ కప్‌లో ఆడుతున్న మహమ్మద్ సిరాజ్ విషయంలో అదే జరిగిందని చెప్పొచ్చు. మొన్నటి వరకూ విహారయాత్ర ప్రణాళికలు వేసుకున్న మియా భాయ్ అనుకోకుండా స్క్వాడ్లోకి వచ్చాడు. హర్షిత్ రానా స్థానంలో చోటు దక్కించుకున్న అతడు.. బుమ్రా గాయపడడంతో తుది జట్టులో ఉండి.. పవర్ ప్లేలో రెండు వికెట్లతో యుఎస్ఎను ఓడించడంలో కీలకమయ్యాడు. తనకు వరల్డ్‌కప్ ఆడే అవకాశం రావడంపై సిరాజ్ రియాక్షన్ ఏంటంటే..
రెండేళ్లుగా టి–20 జట్టులోకి రాని సిరాజ్ ఏకంగా ప్రపంచకప్‌లో ఎంట్రీ ఇచ్చాడు. పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రానా మోకాలి గాయంతో టోర్నీకి దూరమవ్వడంతో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సీనియరైన సిరాజ్‌కు ఫోన్ చేసి వచ్చేయాలని చెప్పాడు. ఇదే విషయాన్ని వాంఖడేలో ఆరంభ పోరు తర్వాత మీడియాతో పంచుకున్నాడు సిరాజ్.. ముంబైకి విమానంలో వస్తుంటే.. నేను వరల్డ్‌కప్ ఆడడమా.. ఇది కలా? నిజమా? అనిపించింది. ఎందుకుంటే.. ఏడాదిగా వరల్డ్ కప్ కోసం అందరూ కష్టపడుతున్నారు. నాకు అవకాశం రాదులే అనుకున్నా. అయితే.. సూర్యభాయ్ ఫోన్ చేశాడు. మియా.. నీ వస్తువులు బ్యాగులో సర్దుకో.. వచ్చి స్క్వాడ్‌లో చేరు అని నాతో అన్నాడు. మొదట నేను అతడి మాటల్ని సీరియస్‌గా తీసుకోలే. జోక్ చేస్తున్నాడేమో అనుకున్నా. స్వదేశంలో టి–20 ప్రపంచ కప్ ఆడాలనేది నా కల. దేవుడు నాకది రాసి పెట్టాడు. అందుకనే నేను ఇక్కడ ఉన్నాను అని మీడియా సమావేశంలో సిరాజ్ వెల్లడించాడు.
**మొదటి ఓవర్లోనే వికెట్...** తొలి మ్యాచ్‌లో యుఎస్ఎపై తనపై నమ్మకంతో పిలిచిన కెప్టెన్ సూర్యకుమార్ నమ్మకాన్ని నిలబెడుతూ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీశాడీ పేసర్ సిరాజ్. ఓపెనర్ అండ్రీస్ గౌస్(6)ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. అర్ష్‌దీప్ ఓవర్‌లో మొనాంక్ పటేల్(0) శివం దూబే చేతికి చిక్కాడు. కాసేపటికే సాయితేజ ముక్కనపల్లి(2)ని సిరాజ్ ఔట్ చేసి మూడో వికెట్ అందించాడు. అంతే.. 13పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది అమెరికా. సంజయ్, మిలింద్ కుమార్‌లు పోరాడినా ఆఖరి ఓవర్లో శుభమ్ రంజనే(37) వికెట్ తీసిన సిరాజ్ చక్కని బౌలింగ్(3–29)తో ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# ఆరోగ్యం

# గుండెను కాపాడుకోవాలంటే..

నాకేమీ జరగలేదు.. నేను బాగానే ఉన్నాను అని మనలో చాలామంది చెప్పుకుంటాం. కానీ భారతీయ సమాజంలో మానసిక వేదనను అంగీకరించకుండా, దాన్ని నిర్లక్ష్యం చేసే అలవాటు విపరీతంగా ఉంది. శరీరం మన మనసులోని అశాంతికి సంకేతాలు పంపుతున్నా, వాటిని పట్టించుకోకుండా మౌనంగా తట్టుకుంటూ ఉండటం చాలా ప్రమాదకరం. మనసు మరిచిపోవాలని ఎంత ప్రయత్నించినా శరీరం మాత్రం మరిచిపోదు. అకస్మాత్తుగా వచ్చే భయం, గుండె వేగంగా కొట్టుకోవడం, చెమటలు పట్టడం, వణుకు, శరీరం ఒక్కసారిగా చల్లగా లేదా వేడిగా అనిపించడం వంటి లక్షణాలన్నీ మన అంతర్మనస్సులో దాగి ఉన్న అనుభవాలు, గాయాలు, అపరాధ భావనలు, భయాలు బయటికి వస్తున్న రూపాలు. ఇవి నటన కాదు. ఇవి మనలో పాతుకుపోయి పెరుగుతున్న మన గతం. ఆ వ్యక్తికి ఇది

## మనసు కన్నా ముందే శరీరం నిజం చెబుతుంది

డ్రామా కాదు. అది అతన్ని క్షణక్షణం బాధించే లోపలి శత్రువు. అది మెదడు, నాడీ వ్యవస్థలను గందరగోళంలోకి నెట్టి, శారీరక–మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపజేసే శక్తి. దీనిని నిర్లక్ష్యం చేయడం అంటే ఒక మంటను లోపలే పెంచుకోవడమే.



ఈ వేదనకు మూలం వైద్య సహాయంతో బయటపడాలి. ఇలాంటి మానసిక సంఘర్షణలో ఉన్నవారికి కుటుంబం, స్నేహితులు, సమాజం సహానుభూతితో నిలవాలి. వాళ్లను తప్పు బట్టడం కాదు, అర్థం చేసుకోవడం అవసరం. వారికి చేయూత ఇచ్చే సంస్థలు, హెల్ప్‌లైన్లు, కౌన్సిలింగ్ కేంద్రాలు దేశమంతటా విస్తరించాలి. కుటుంబాలు, పాఠశాలలు, కార్యాలయాలు, సమాజం మొత్తంగా ఈ వత్తిడిని తగ్గించే ఆలోచనలు, ఆచరణలు యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం ఉంది. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, దానికంటే ఎన్నో రెట్లు మానసిక ఆరోగ్యం ముఖ్యం. ఇది పాలకులు, మీడియా, మేధావులు, విద్యాసంస్థలు, కుటుంబాలు, ప్రతి బాధ్యతగల పౌరుడు కలిసి ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అంశం. ఎందుకంటే వ్యక్తి మనసు సరిగా లేనిచోట సమాజం సవ్యంగా ఉండదు. అలాంటి సమాజం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లలేదు. మనం సుఖంగా బతకాలి అంటే, మనతో ఉన్నవారిని కూడా సుఖంగా బతకనివ్వాలి. మానవత్వం అంటే ఇదే, బాధపడుతున్న మనసును చూసి ముఖం తిప్పడం కాదు, చేతిని అందించడం.

మన గుండెను కాపాడుకోవాలంటే కేవలం వేయించిన పదార్థాలు లేదా చక్కెర తక్కువగా తినడమే సరిపోదు. మనం ఏ ఆహారాలను ఎలా కలిపి తింటున్నామన్నది కూడా అంతే ముఖ్యమైన విషయం. విడిగా తీసుకుంటే పెద్ద ప్రమాదం కాకపోయినా, కొన్ని ఆహారాలు కలిసినప్పుడు అవి గుండెపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. ఈ ప్రభావం మనకు వెంటనే కనిపించకపోయినా, కాలక్రమంలో రక్తనాళాలు, రక్తపోటు, కొలెస్ట్రాల్ వ్యవస్థలను దెబ్బతీస్తుంది. ముంబయిలోని గ్లెనెగల్స్ హాస్పిటల్‌కు చెందిన చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ స్వరూప్ స్వరాజ్ పాల్‌ను ఉటంకిస్తూ పిటిఐ చెబుతున్నట్లుగా, సోడియం, చక్కెర, సంతృప్త కొవ్వులు ఒకే భోజనంలో కలిసినప్పుడు శరీరం వాటిని ఒకేసారి సమతుల్యం చేయలేక ఇన్‌ఫ్లమేషన్ వంటి సమస్యలు మొదలవుతాయి. ఇవన్నీ గుండె జబ్బులకు దారితీసే మౌలిక కారణాలే.

- గుండెపై ఎక్కువ భారం వేసే ప్రమాదకరమైన ఆహార జంటలు
- కొన్ని కాంబినేషన్లు ప్రత్యేకంగా గుండెకు హానికరంగా మారతాయి. ఉదాహరణకు ఉప్పు ఎక్కువగా ఉన్న స్నాక్స్‌ను చక్కెర పానీయాలతో కలిపి తీసుకుంటే, రక్తంలో చక్కెర, ట్రైగ్లిజరైడ్స్ ఒక్కసారిగా పెరుగుతాయి. ఇది ఇన్‌సులిన్ రెసిస్టెన్స్‌ను పెంచి, గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది.
- వేయించిన ఆహారాలను క్రీమీ సాస్‌లతో తినడం వల్ల ట్రాన్స్ ఫ్యాట్స్, సంతృప్త కొవ్వులు భారీగా శరీరంలోకి వెళ్తాయి. ఇవి రక్తనాళాల గోడలపై కొవ్వు పేరుకుపోయేలా చేసి రక్తప్రసరణను తగ్గిస్తాయి.
- ప్రాసెస్ చేసిన మాంసాలు మైదా బ్రెడ్ లేదా రిఫైన్ చేసిన పిండితో కలిసినప్పుడు సోడియం, ఫాస్ట్ అబ్జార్బ్ అయ్యే కార్బోహైడ్రేట్స్ కలిసి శరీరంలో తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్‌ను సృష్టిస్తాయి. దీర్ఘకాలంలో ఇది గుండెను బలహీనంగా మారుస్తుంది.
- చీజ్‌ను క్యూర్డ్ లేదా ప్రాసెస్ చేసిన మాంసాలతో కలిపి తినడం ఎల్‌డిఎల్ అనే చెడు కొలెస్ట్రాల్‌ను వేగంగా పెంచుతుంది. దీని వల్ల ధమనుల్లో ఫలకం ఏర్పడి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది.

### ఎవరు మరింత జాగ్రత్తగా ఉండాలి?

- తరచూ అలసట, ఛాతిలో అసౌకర్యం లేదా స్టామినా తగ్గినట్టు అనిపించే వారు గుండె సమస్యల ప్రారంభ దశలో ఉండవచ్చు. అలాగే కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు, అధిక బరువు, ఒత్తిడి లేదా కూర్చునే జీవనశైలి ఉన్నవారు ఆహారపు అలవాట్లలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

### గుండెను కాపాడే తెలివైన మార్గాలు

- ఆహారపు కాంబినేషన్లను సరిచేసుకోవడం ద్వారా గుండెకు చాలా ఉపశమనం లభిస్తుంది. మైదా బదులు తృణధాన్యాలు, చక్కెర పానీయాల బదులు నీరు లేదా హెర్బల్ టీలు, ఎక్కువ కొవ్వు ఉన్న ఆహారాల బదులు



పప్పులు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు ఎంచుకోవడం ద్వారా రక్తనాళాలపై ఒత్తిడి తగ్గుతుంది.
- డాక్టర్ పాల్ చెప్పేది స్పష్టంగా ఒకటే – మన ఇష్టమైన ఆహారాలను పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. కానీ అవి రోజువారీ అలవాటుగా మారకూడదు. అప్పుడప్పుడు మాత్రమే తినే అలవాటు ఉంచితే గుండెను కాపాడుకుంటూనే జీవితం రుచికరంగా ఉండగలదు.
- గుండె ఆరోగ్యం అనేది కేవలం ఎంత తింటున్నామన్నదానిపై మాత్రమే కాదు, ఏమి ఏమితో కలిపి తింటున్నామన్నదానిపైనా ఆధారపడి ఉంటుంది. మన రోజువారీ భోజనంలో చిన్న మార్పులు, తెలివైన ఎంపికలు చేస్తే, గుండెను నిశ్శబ్దంగా దెబ్బతీసే ప్రమాదాలను మనమే అడ్డుకోగలుగుతాం. ఏమాత్రం అనారోగ్య లక్షణాలను కనిపించినా, వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించడం మాత్రం మరచకపోకూడదు.

# స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి ఊపిరి

### పాల్వంచ సమగ్రాభివృద్ధి సిపిఐతోనే సాధ్యం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజాస్వామ్యానికి స్థానిక సంస్థలు ఊపిరిలాంటివని, పాల్వంచ సమగ్రాభివృద్ధి సిపిఐతోనే సాధ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 38వ, డివిజన్‌లో చెరుకూరి శేఖర్‌బాబు, 44 డివిజన్, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, 31వ, డివిజన్ నునావత్ శ్యామల, 32 వ, డివిజన్, ధరావత్ మోతీలాల్, 33 వజ్జా రాజేశ్వరి, 9వ, డివిజన్ నుంచి వాడె లక్ష్మి పోటీచేస్తున్నారు. టీచర్స్ కాలని, ఒడ్డుగూడెం, శ్రీనగర్ కాలనీ, గాంధీనగర్, శేఖరం బంజెర, పిచ్చయ్య బంజెర, కేసిఆర్ నగర్, పేటచెరువు, పిల్లవాగు, కొత్తూరు తదితర కాలనీలలో సిపిఐ, తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థులు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాల్వంచను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిపి ప్రజల రుణం తీర్చుకొంటానన్నారు. పాల్వంచలోని పలు కాలనీల ఏర్పాటు సిపిఐతోనే మొదలైనదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కొత్తగూడెం, సుజాతనగర్, పాల్వంచ పట్టణాలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ఎన్నికలు తీసుకొచ్చామన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి ప్రభుత్వాల నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కానున్నాయని, దీంతో నగర రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, వంటివి వస్తాయన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి కొత్తగూడెం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రుల సహాయ సహకారాలతో వందల కోట్ల నిధులు తెచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డివిజన్‌లలో కావలసిన స్మశాన వాటికలు, అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం, హెల్త్ సబ్‌సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాల్వంచను మరింత అభివృద్ధి చేసేందుకు కొత్తగూడెం కార్పొరేషన్‌పై సిపిఐ జెండా ఎగురవేయాలన్నారు. ఇందుకు ప్రజలు సిపిఐకి మద్దతు పలకాలని, కంకీ కొడవలి గుర్తుపై ఓట్లేసి సిపిఐ, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కూనంనేని పిలుపునిచ్చారు. పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుదే అని తెలుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రత్నాకర్ అన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఎన్నికలు లేకపోవటంతో పాల్వంచ అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వందల కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టిన కూనంనేనికి అన్ని వర్గాల ప్రజలు, కులమత భేదాలకు తావులేకుండా మద్దతు పలకాలన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కంకీ కొడవలి గుర్తుపై ఓట్లేసి సిపిఐ, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్. గిరి, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, బిక్కూలాల్, తెలుగుదేశం పార్టీ నాయకులు, నారాయణ, నల్లమల్ల వేణు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కూటమి ఐక్యతపై అసత్య ప్రచారాలు



### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ శ్రమజీవుల గడ్డపై ఎగిరేది కూటమి జెండానే అని సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్ ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం 28వ వార్డులో కాంగ్రెస్ ,సిపిఎం పార్టీలు బలపరిచిన సిపిఐ 28 వార్డు కౌన్సిలర్ సోతుకు ప్రవీణ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కూటమి పార్టీలు ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో నాయకులు బట్టు కరుణాకర్, కోరిమి రాజ్ కుమార్, జోగు బుచయ్య, మోటపలుకుల రమేష్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమిపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలు మిత్రపక్షాలుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నాయకత్వంలో ముందుకు సాగుతున్నామన్నారు. 28, 24, 7, 5, 27వ వార్డులలో సిపిఐ, సిపిఎం అభ్యర్థులకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తి మద్దతు ఇస్తున్నాయన్నారు. ఓటు చీల్చవద్దని కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఐటియు కార్మిక సంఘాల ఓట్లు ఏకతాటిపై పడాలని, మన మధ్య చీలిక తేవాలని చూసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి వారికుట్రలను తిప్పికొట్టి 11 జరిగే మున్సిపల్ ఎన్నికల్లో చెయ్యి, కంకి కొడవలి, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి, 30 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను చారిత్రాత్మక మెజారిటీతో గెలిపించాలని ఈసందర్భంగా వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సోతుకు ప్రవీణ్, కరిముల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ చేరిన ఎర్రజెండా ప్రచారం




### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్‌కు జరుగుతున్న ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపును ఏ శక్తి ఆపలేదని, డబ్బు రాజకీయాలకు ఈ ఎన్నికల్లో చెక్ పెడదామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని 15,49,53,59,60 డివిజన్‌లలో జరిగిన ఇంటింటి ప్రచారం, రోడ్ షోల్లో ఆయన పాల్గొన్నారు. ప్రధాన సెంటర్లలో జరిగిన సమావేశాల్లో పాషా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రత్యక్షమయ్యే నాయకులతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. వారి మోసపూరిత మాటలు, తప్పుడు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజల మధ్య ఉండి సేవలు అందిస్తున్న సిపిఐని ప్రజలు ఆదరించి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో మరింత అభివృద్ధిని సాధించేందుకు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు బండి నర్సింహా, ఇమ్రాన్ మహ్మద్, బేత అనంత లక్ష్మి, కనుకుంట్ల శాంతి, బోయిన విజయ్‌కుమార్, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల్లో ఉండే కమ్యూనిస్టులను ఆదరించండి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగే వారికి కాకుండా నిత్యం ప్రజల్లో ఉండే సిపిఐ అభ్యర్థి జూలూరు మమత జ్యోతిబసు కంకి కొండవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో 10వ వార్డులో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జూలూరు మమత జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆదివారం 10వ వార్డులో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ప్రజల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డు సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాలపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరిస్తారన్నారు. ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత గల సిపిఐ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి అహంకారులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి అంటే కాంట్రాక్టులు కాదని సామాన్యుల ముంగిట సంక్షేమ ఫలాలు చేరడం అని, నిత్యం ప్రజలతో మమేకమై ఉండే సిపిఐకి ప్రజా సమస్యలపై అవగాహన ఉంటుందని, అలాంటి అభ్యర్థులే కౌన్సిలర్‌గా ఉండడం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. 10వ వార్డు ప్రజలు మమతా జ్యోతి బసు కంకి కోడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రచార కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు జ్యోతిబసు, నగేష్, శివకుమార్, గిరిప్రసాద్, మల్లయ్య, శంశోద్దిన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం సిపిఐతోనే



### ఎర్ర జెండా అభ్యర్థులను ఆదరించండి : చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సమస్యల పరిష్కారానికి మునిసిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో 9, 16, 17 18 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇంటింటా ఎన్నిక ప్రచారం నిర్వహించి సిపిఐ అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పోరాటం చేసే నాయకులను ఎన్నుకుంటే సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. గతంలో హుస్నాబాద్‌లో పేదలకు కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసి ఇళ్ల స్థలాలు ఇప్పించామని గుర్తు చేశారు. నిరంతరం పేదల పక్షాన, సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే సిపిఐ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రాంత అభివృద్ధికి సిపిఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలమే నేడు గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసుకుని వ్యవసాయానికి సాగు నీరు అందించే అవకాశం దక్కిందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తి చేయించి, పేదలకు ఇప్పించేందుకు తమ పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ, కునుకుట్ల శంకర్, జిల్లా నాయకులు జనగాం రాజ్‌కుమార్, సంజీవరెడ్డి, గుడెం లక్ష్మి, గూడ పద్మ, బత్తుల బాబు, సంజీవరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎంపి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేతలతో కలిపి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే నిధులు మంజూరు చేయించి పనులు త్వరితగతిన చేయించే వీలుంటుందన్నారు. ఆరు గ్యారెంటీలన హామి ఇచ్చి రాష్ట్రంలో 12 పథకాలను అమలు చేసుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేన్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, మైనార్టీ విభాగ జిల్లా ఛైర్మన్ ఎంఎ.సలీం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, మాలి కాంతారెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట మున్సిపాలిటిలోని 11, 15 వార్డుల నుండి ఆ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీచేస్తున్న ఎడ్ల గంగభవాని వీరమల్లు, పిల్లల భవాని రమేష్ నాయుడుల గెలుపును ఆకాంక్షిస్తూ వారు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయి బృందావనంలో సమస్యలు పరిష్కరిస్తా

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని 6వ వార్డులో గల సాయిబృందావనం కాలనీలో నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను రెండునెలల్లో పరిష్కరిస్తానని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం హామీ ఇచ్చారు. ఆదివారం కాలనీలో జరిగిన ఓటర్ల ఆత్మీయ సమ్మేళనం, ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్య ప్రభలంగా ఉందని, సిసి రోడ్లు లేక వీధులు కంకర తేలి ఉన్నాయని, విద్యుత్‌లో వోల్టేజి సమస్య ఉందన్న విషయాలు తన దృష్టికి వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిట్యాల మున్సిపాలిటి అభివృద్ధి కోసం రూ. 15 కోట్లు విడుదల చేశారని, అందులో నుండి కాలనీకి రూ. 80 లక్షలు వెచ్చించి రెండు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ బలపర్చిన నాయకులను గెలిపించాలని వీరేశం కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, వార్డు ఎన్నికల ఇంఛార్జ్ బండా సాగర్‌రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, పెద్ది నరేందర్, వెంకటేశ్వర్లు, గంజి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుతో అభివృద్ధి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికలలో సిపిఐ బలపరిచిన కార్పొరేట్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి కోరారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 2,42,47 డివిజన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే డివిజన్‌లు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడింగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,సిపిఐ నాయకులు వి,లెనిన్ పాణెం వెంకట్ రావు,దోటి పందరి,అక్కలయ్య, యూసుఫ్ మాధర్,సుజాత కౌసల్య ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** బాల్య మున్సిపాలిటీలో కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. హాలియా మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ హాలియా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రూ. 15 కోట్ల రూపాయలతో హాలియాలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. హాలియాలోని ఎనిమిదో వార్డు అభ్యర్థి జబీన్ మజ్హర్ గెలుపుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి,కాకునూరు నారాయణ గౌడ్,నెరమెట్ల వెంకట రెడ్డి,పాండు నాయక్,ముత్యాల జానయ్య పాల్గొన్నారు.



# మరో 10 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేద ప్రజలకు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం 34,33,32,31,24,23,44,22,43,45 డివిజన్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయా కాలనీలలో మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండను అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవడం కోసమే నలగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారుమున్సిపాలిటీ నుంచినలగొండ కార్పొరేషన్‌గా మారడంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత రెండేళ్లలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు రూ.700 కోటతో బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు.అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ ,కేటీఆర్, హరీష్ రావులు చేసిన అవినీతిపై సొంత సొంత కూతురు ప్రశ్నిస్తున్న వారి వద్ద సమాధానం లేదని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో దోసుకున్నారే తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. ఈనెల 11న జరిగే నలగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో పాటు అన్ని డివిజన్లో పార్టీ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈప్రచార కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హాఫీజ్ ఖాన్,నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,తిప్పర్తి మాజీ జెడ్‌పిటిసి పాశం రామ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,34 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి,13 డివిజన్ అభ్యర్థి గుమ్ముల జానకి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్‌ఎస్‌కు ఓటేస్తే మురిగిపోతది



కాంగ్రెస్‌తోనే మున్సిపల్ ప్రగతి: మంత్రి సీతక్క

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి : ఎంపి చామల

ఎమ్మెల్యే కుంభం ఆధ్వర్యంలో భువనగిరిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**ప్రజాపక్షం/ యాదాద్రి :** 'వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి.. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేస్తే మీ భవిష్యత్తు మురిగిపోతుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే మున్సిపాలిటీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. భువనగిరి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని సీతక్క ఆరోపించారు. 'ఆ దోచుకున్న సొమ్ము పంపకాల కోసమే ఇప్పుడు ఆ కుటుంబంలో అన్నచెల్లెళ్ల బంధాలు తెగిపోతున్నాయి. ఆస్తుల కోసం వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా గొడవలు జరుగుతున్నాయి' అని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపాలిటీల రూపురేఖలు మార్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని సీతక్క స్పష్టం చేశారు. భువనగిరి అభివృద్ధి కోసం తన శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేరుకుపోయిన మురికిని, అభివృద్ధి లేమిని కాంగ్రెస్ ఓటుతో కడిగేయాలని పిలుపునిచ్చారు.

### మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి: ఎంపి చామల

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి తన సత్తా చాటాలని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే గెలుపు గుర్రాలైన కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. భువనగిరి శాసనసభ సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆవైస్ చిస్తి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు బర్రె జహంగీర్, పోత్తంశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకురాలు కీర్తి రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

కాంగ్రెస్, సిపిఐ(ఎం) బలపర్చిన సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని హుజూర్‌నగర్, కోదాడ మున్సిపాలిటి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, సిపిఐ(ఎం), టిడిపి బలపర్చిన సిపిఐ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. హుజూర్‌నగర్ పట్టణంలో 10వ వార్డు సిపిఐ అభ్యర్థిగా చెనగాని సైదులు, 17వ వార్డులో గుండు తిరపతమ్మ వెంకటేశ్వర్లు విజయాన్ని ఆకాంక్షిస్తూ అలాగే కోదాడలో కాంగ్రెస్, టిడిపి బలపర్చిన సిపిఐ అభ్యర్థి రాయపూడి కాటంరాజు విజయాన్ని కాంక్షిస్తూ హుజూర్‌నగర్‌లో 9వ తేదీన సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొనడానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యం హాజరవుతారని ఈ ప్రచార ర్యాలీలో సూర్యాపేట జిల్లా నుండి అధిక సంఖ్యలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హుజూర్‌నగర్, కోదాడ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి చెందాలంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి నాయకత్వంలో వార్డులో ఉన్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు దంతాల రాంబాబు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, యువజన నాయకులు ఎడెల్లి శ్రీకాంత్, మహిళ నాయకురాలు దేశగాని హేమలత, కప్పల రాము, అయితగాని కామేష్ పాల్గొన్నారు.

## సమాజానికి దిక్సూచి రచయితలే

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

భూతం విమల స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాజంలో గురుతరమైన బాధ్యత రచయితలదేనని,కవులురచయితలు తమ రచనల ద్వారా సామాజిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ వాగ్గేయకారులు,ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. నల్లగొండలోని యుటిఎఫ్ భవన్‌లో తెలంగాణ సాహితీ భూతం విమల స్మారక సాహిత్య సంస్థల సంయుక్త నిర్వహణలో భూతం విమల స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నల్ల బంగారం కథా సంపుటి రచయిత్రి,ప్రముఖ రచయిత్రి స్వర్ణ కిలారికి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు.అవార్డు కింద నగదు రూ.5,116ల నగదుతో పాటు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ రచయిత అయిన భూతం ముత్యాలు తన శ్రీమతి విమల స్మారక పురస్కారాన్ని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఒక రచయితకు పురస్కారాన్ని ప్రధానం చేసే సాహితీ లోకంలో విమలకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించడం ప్రశంసనీయమని అన్నారు. జాతీయ పురస్కారాన్ని స్వీకరించిన స్వర్ణ కిలారి మాట్లాడుతూ ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.ఈకార్యక్రమానికి డాక్టర్ కృష్ణ కౌండిన్య అధ్యక్షత వహించగా అవార్డు కమిటీ చైర్మన్ ప్రముఖ నవలా రచయిత భూతం ముత్యాలు,ఆచార్య బన్న ఐలయ్య,డాక్టర్ జివి రత్నాకర్,ప్రముఖ జీవకవి మునాసు వెంకట్,మేరెడ్డి యాదగిరిరెడ్డి,డాక్టర్ పగడాల నాగేందర్,డాక్టర్ సిద్దంకి యాదగిరి,డాక్టర్ నిమ్మ బాబురావు,తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుకుడాల గోవర్ధన్ పాల్గొన్నారు.



# కారు ఎన్ఎస్‌పి కెనాల్‌లో పడి భార్యాభర్తలు మృతి



**ప్రజాపక్షం/నిడమనూరు:** నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం, ముకుందాపురం వద్ద ఉన్న ఎన్ఎస్‌పి కెనాల్‌లో శనివారం రాత్రి కారు అదుపుతప్పి పడిపోయిన సంఘటనలో భార్యాభర్తలు మృతి చెందడంతో త్రిపురారం, నిడమనూర్ రెండు మండలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు రెవెన్యూ,పోలీస్, ఫైర్, ఎస్‌డి ఆర్ఎఫ్ బృందాలు తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి. ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌తో కలిసి ముకుందాపురం వద్ద సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు.సంఘటన జరగడానికి గల కారణాలను,కారు ప్రమాద సంఘటనలో చనిపోయిన వారి వివరాలను,ఇతర వివరాలను స్థానికులు,అధికారుల ద్వారా అడిగితెలుసుకున్నారు.అనంతరం ఈ విషయంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలోనల్లగొండ జిల్లా, త్రిపురారం మండలం,కంప సాగర్‌కు చెందిన భార్యా భర్తలు తలం పుల్లయ్య, పద్మలు ప్రయాణిస్తున్న కారు ముకుందాపురం వద్ద ఉన్న ఎన్ఎస్‌పి కెనాల్ లో ఆదుపుతప్పి పడిపోవడం జరిగిందని,విషయం తెలిసిన వెంటనే రెవిన్యూ, పోలీస్,ఫైర్,గజ ఈతగాళ్ళు,ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు ప్రమాద స్థలాన్ని చేరుకొని గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని బృందాలు ఆదివారం ఉదయం నుండి గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ శనివారం రాత్రి 7:30 ప్రాంతంలో ముకుందాపురం వద్ద ఎన్ఎస్‌పి కెనాల్ లో కారు అదుపుతప్పి పడిపోయిన సంఘటనలో రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాయని,కారును వెంటనే గుర్తించినప్పటికీ చీకటి కారణంగా శనివారం వెలికితీయలేకపోయామని,ఆదివారం ఉదయమే కారు ను బయటకు తీయడం జరిగిందని,అలాగే చనిపోయిన మహిళ మృతదేహాన్ని కూడా వెలికి తీశామని,అన్ని శాఖల సమన్వయం, సహకారంతో గల్లంతైన పుల్లయ్య మృతదేహాన్ని కూడా వెలికి తీస్తామని తెలిపారు.రెవిన్యూ ఆదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి,మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, స్థానిక రెవెన్యూ, పోలీస్‌లు ఉన్నారు.



## అభివృద్ధికి పట్టం కట్టండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత



**ప్రజాపక్షం/చండూరు :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రెడ్డి సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత కోరారు.ఆదివారం ఆయన చండూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడరు గత సంవత్సరాలుగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే మున్సిపల్ ఎన్నికల్లో గెలిపిస్తాయని అన్నారు. సన్న బియ్యం,200 యూనిట్ల ఉచిత కరెంటు,రైతు రుణమాపి, రైతు బందు, ఉచిత బస్ ప్రయాణం, ఇందిరమ్మ చీరలు,సన్న బియ్యం ,కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను ప్రవేశ పెట్టి రేవంత్ సర్కార్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.అక్రమ సంపాదన,దొంగ హామీలతో బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నాయని వారు గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు జరగబోతుందని అన్నారు. అనంతరం ఆయన కలిమికొండ పారిజాత జనార్దన్ విజయాన్ని కాంక్షిస్తూ 9వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొరిమి ఓంకారం,గట్టుప్పల సర్పంచ్ నామాని జగన్నాథం,కలిమికొండ జనార్దన్,మంచుకొండ సంజయ్,భూతరాజు వేణు పాల్గొన్నారు.

## 'హరీష్ రావు అహంకారం వీడాలి.. కెటిఆర్ కుట్రలు ఆపాలి'

అహంకారం వీడకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు: ఎంపి చామల హెచ్చరిక

**ప్రజాపక్షం/యాదాద్రి :** బిఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్లపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని, ప్రజలు ఇప్పటికే మిమ్మల్ని ఐదుసార్లు తిరస్కరించినా బుద్ధి రాలేదా? అని ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'హరీష్ రావు.. ఉద్యమ సమయంలో మీ పరిస్థితి ఏమిటి? ఇప్పుడు మీరు అనుభవిస్తున్న రాజభోగాలు ఎక్కడివి?' అని చామల నిలదీశారు. తెలంగాణ రాక ముందు సాదాసీదాగా ఉన్న మీరు, పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, కేవలం తమ ఇంట్లో వారికి మాత్రమే ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి 24 గంటలు కష్టపడుతూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతుంటే, ఓర్వలేక ఏడుస్తున్నారని మండిపడ్డారు.హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్లో జరిగిన అగ్నిప్రమాదంపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను చామల తీవ్రంగా ఖండించారు. 'అసలు సాక్ష్యాలు తగులబడాలని కోరుకునేది ఎవరు? ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరుక్కున్న మీరా? లేక విచారణ జరిపిస్తున్న ప్రభుత్వమా?' అని ప్రశ్నించారు. ఓడిపోగానే ఎస్ఐబీ ఆఫీసులో సాక్ష్యాలను ధ్వంసం చేసి మూసీలో పారేసిన చరిత్ర మీది కాదా? అని గుర్తు చేశారు.

## సార్వత్రిక సమ్మెను సక్సెస్ చేద్దాం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** ఈనెల 12వ తేదీన జరిగే ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలోని ఎఐటియుసి కార్యాలయంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం ద్వారా నరేంద్రమోడికి బుద్ధి చెప్పాలని, మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని ఆయన అన్నారు. స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న 42 రకాల కార్మికుల హక్కులను తీసివేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం భావ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఎస్‌కె లతీఫ్, నాయకులు షేక్ జానీ, కొండలు, గోపి, విద్యాచారి, లింగయ్య, ఉప్పతల శ్రీనివాస్, రేవూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## సూటిగా... సుతిమెత్తగా...

కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారంలో సూటిగా, సుతిమెత్తగా ప్రసంగిస్తూ ప్రజలను ఆలోచింప చేసేలా చేస్తున్నారు. గత బిఆర్ఎస్ పాలనలో తాను సూర్యాపేట శాసనసభ్యునిగా ఎన్నికై రాష్ట్ర మంత్రిగా వేలకోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. అందమైన రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, మెడికల్ కళాశాల ఏర్పాటు, జిల్లా కేంద్రంగా సూర్యాపేట చేసిన విషయంతోపాటు సద్దుల చెరువు సుందరీకరణ గురించి చెప్పుకొస్తున్నారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప పట్టణంలో ఎక్కడ కూడా రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఏమి జరగలేదని ప్రజలకు వివరిస్తున్నారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని వారు అమలు చేయని హామీల బాకీ కార్డును ప్రజల ముందు పెడుతున్నారు. ఇదిలా ఉంటే స్థానిక కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, రౌడీయిజం, గిట్టనివారి భవనాలను కూల్చివేయడం లాంటి పనులు చేస్తూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు నమ్మి ఓటువేస్తే సూర్యాపేట పూర్తిగా ఆగమవుతుందని ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరుతున్నారు. జగదీష్ రెడ్డి ప్రసంగాన్ని వింటున్న ప్రజలు ఆసక్తిగా వింటున్నారు.



## త్వరగా పోలింగ్ స్లిప్పుల పంపిణీ

బిఎల్ఓలకు అదనపు కలెక్టర్ ఆదేశం

పదవ తరగతి పరీక్షలకు భయపడకుండా చదువుకోవాలి

అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని వీరన్నపేట, భూత్పూర్ మున్సిపాలిటీ, దేవరకద్ర మున్సిపాలిటీలో బిఎల్ ఓల ద్వారా పోలింగ్ స్లిప్పులను పంపిణీ ప్రక్రియను పరిశీలించడం జరిగింది. దేవరకద్ర ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేయు సామాగ్రిని పరిశీలించడం జరిగింది. కోయిలకొండ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ సందర్శించడం జరిగింది. అక్కడ పదవ తరగతి విద్యార్థినిలకు పరీక్షలు దగ్గర పడుతున్నందున వారిలో ధైర్యాన్ని నింపుతూ పరీక్షల సమయాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని సబ్జెక్టులలో ఎక్కువ మార్కులు సాధించే విధంగా ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో తెలుసుకొని భయపడకుండా పరీక్షలు రాసి మన జిల్లాలో ఉత్తీర్ణత శాతాన్ని ఈ సంవత్సరం పెంచాలని చెప్పడం జరిగింది. తర్వాత అందరు విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం జరిగింది.

## 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో ఎఐటియూసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికసంఘాలు, కార్మికచట్టాలులేని దేశంగా మార్చాలని, కార్మికులను నిరాయుధులనుచేసి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు బంగారుపల్లెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. కార్మిక వర్గం సాధించుకున్న 29కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ఆరు సంవత్సరాల క్రితం తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడిన ఫలితంగా ఇంతకాలం వాటిని అమలుచేయకుండా ఆపగలిగాం. కానీ నేడు మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫైచేసి కార్పొరేటసంస్థలకు సులభతరంగా ద్వారాలు తెరిచిందన్నారు. కావున 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియూసి భవనకార్మిక నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపాగశ్రీనివాసులు, గాలన్న, ఎఐటియూసి మాజీ జిల్లా అధ్యక్షులు తప్పెట కిరణ్ కుమార్, ఎఐటియూసి నాయకులు పెరుమాల గోపాల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరేటి నరేష్, మేస్త్రీ లు పాల్గొన్నారు.

## రెండేళ్లలోనే వనపర్తి సమగ్రాభివృద్ధి


తూడి శారదరెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** ప్రస్తుతం జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రతి ఒక్కరు ఓటు వేసి, మరో 10 మందితో ఓటు వేయించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సతీమణి శారద రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి పట్టణంలోని 31వ వార్డులో ఆమె కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి విజయలక్ష్మీ రాధాకృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే వనపర్తి పట్టణం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని ఆమె చెప్పారు. రానున్న కాలంలోనూ వనపర్తి అన్ని రంగాలలో ముందు ఉండాలంటే మనం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను తప్పకుండా గెలిపించాలని ఆమె సూచించారు. 31వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన విజయలక్ష్మీ కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డులోని అన్ని సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని శారదా రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసే బాధ్యత నాదే

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డు అభ్యర్థి శంకర, 15వ వార్డు అభ్యర్థి అనీస్ బేగం ఇలియాస్ 31వ వార్డు అభ్యర్థి ప్రియాంక సుదర్శన్ లకు మద్దతుగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వేయించి అత్యధికమైన భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా గెలిచి నప్పటి నుండి గద్వాల పట్టణాన్ని అభివృద్ధి వైపుగా నడిపించానన్నారు. ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం సిఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలకు 6 గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. హస్తం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు తిమ్మప్ప, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు జి. వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మాజీద్, నాయకులు సుదర్శన్, ఆలూరు రామయ్య శెట్టి, గట్టు ఈశ్వరమ్మ, సి.విజయ్, హనుమంతయ్య, మధు, లక్ష్మన్న, ప్రదీప్ రెడ్డి, రాజు, రంజిత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దంపతులు ఆదివారం పట్టణంలోని వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలోని 2వ వార్డులో అభ్యర్థి నాగరాజు, 14వ వార్డులో అభ్యర్థి మానస హస్తంతును భారీ మెజారిటీ తో గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు ప్రారంభించామని అన్నారు. గత ప్రభుత్వం గల్లీలో రోడ్లు, డ్రైనేజీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వం వచ్చాక వీటి నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. వందల కోట్లతో మక్తల్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రేషన్ షాపుల్లో ప్రతీ పేదవాడికి సన్న బియ్యం, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఫ్రీ బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఫ్రీ కరెంటు ఇలా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో 16 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మక్తల్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని ప్రజలను కోరారు. మంత్రి దంపతులు నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వార్డులలో కనబడిన ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి పలిచి మంత్రి వాకిటి శ్రీహరి లలిత దంపతులు ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల్లో, కార్యకర్తల్లో జోష్ నింపారు.

# స్థిరత్వం కావాలంటే కాంగ్రెస్ రావాలి

అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేసి చూపిస్తా

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్:** సమగ్ర అభివృద్ధితో పాటు స్థిరమైన పాలన, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఓటర్లను కోరారు. మహబూబ్ నగర్ నగరంలోని వివిధ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మారేపల్లి సురేందర్ రెడ్డి (డివిజన్ 11), షబీనా బేగం (డివిజన్ 28), అయేషా సిద్దిఖీ (డివిజన్ 29), లక్ష్మీ దేవి (డివిజన్ 30), జి.పద్మజ (డివిజన్ 31)లకు మద్దతుగా ఆయా డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి మన మహబూబ్ నగర్ మట్టి బిడ్డ అని, ఆయనకు ప్రజల కష్టనష్టాలు, బాధలు, కన్నీటి గోస అన్నీ తెలుసుకున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను మహబూబ్ నగర్‌కు తీసుకువచ్చి, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

### వ్యక్తుల కంటే మహబూబ్‌నగర్ అభివృద్ధే ముఖ్యం

వ్యక్తుల కంటే మహబూబ్‌నగర్ అభివృద్ధి తనకు ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఆయన 32వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అబ్యర్థి కనికె శ్రావణ్ కుమార్, 9వ డివిజన్ అభ్యర్థి మల్లేశ్వరి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగులో ఆయన మాట్లాడుతూ, గత 75 సంవత్సరాల మహబూబ్‌నగర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, శాంతన్న యాదవ్, మైత్రి యాదయ్య, రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 23వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బీసం వరలక్ష్మి కి మద్దతుగా ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆశీర్వదించి బీసం వరలక్ష్మి ని కార్పొరేటర్‌గా గెలిపిస్తే డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, నాయకులు రమేష్ రెడ్డి, వాజిద్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి:** మున్సిపాలిటీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడానికి వచ్చే ఓటర్లతో తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన వారి వివరాలను ఓటరు జాబితాలో స్పష్టంగా మార్క్ చేయాలన్నారు. ఓటు వేసిన ప్రతి ఓటరుగా నిబంధనల ప్రకారం తప్పనిసరిగా సిరా చుక్కను పెట్టాలను సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరగాలని, ఇందుకోసం ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముగిసిన అనంతరం, నమోదైన ఓట్ల వివరాలను సంబంధిత, అభ్యర్థులను లేదా వారి ఏజెంట్లకు తెలిజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యాదయ్య ఆయా మున్సిపాలిటీల కమీషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పెబ్బేరు అభివృద్ధికి బిజెపికి ఓటేయాలి



ఎంపి డి.కె.అరుణ

**ప్రజాపక్షం/పెబ్బేరు:** మున్సిపల్ ఎన్నికలల్లో జరుగుతున్న ప్రస్తుత తరుణంలో మహబూబ్‌నగర్ ఎంపి డి.కె.అరుణ పెబ్బేరు మండల కేంద్రంలో బిజెపి అభ్యర్థుల తరపున ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్రమే నిధులు సమకూరుస్తుందని వికసిత్ భారత్ పేరిట గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి వెల్లివిరుస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగులో ఆమె మాట్లాడారు. పెబ్బేరుకు ప్రధాన ఆదాయవనరైన సంతను కబ్జా చేసినోళ్లకు మీరు ఓట్లు వేయొద్దని సంత స్థలం సంతకే దక్కాలని పోరాడిన బిజెపికి ఓటు వేయాలని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. ప్రపంచస్థాయిలో భారతదేశం అభివృద్ధి విషయంలో అగ్రస్థానంలో ఉండాలంటే కేంద్రంలో ఉన్న బిజెపి కే ఓటు వేయాలని అభ్యర్థించారు. బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి వచ్చే నిధుల ద్వారా పెబ్బేరు పట్టణ అభివృద్ధికి వారు కృషి చేస్తారని చెప్పారు.



## బిఆర్ఎస్, బిజెపిలకు ఓటు వేయడం వృథా

సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/వనపర్తి:** వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్, బిజెపిలకు ఓటు వేస్తే వృథా, అధికార కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేసి అభివృద్ధికి సహకరించాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో ఐదో వార్డు అభ్యర్థి బాపన్‌పల్లి వెంకటేశ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు. వనపర్తి ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన మెగా రెడ్డి గెలిచారని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే కౌన్సిలర్లు నిధులు తెచ్చి వార్డులను అభివృద్ధి చేస్తారన్నారు. వనపర్తి మున్సిపల్‌లో కాంగ్రెస్ గెలిపిస్తే కౌన్సిలర్లను సిఎం దగ్గరికి తీసుకెళ్లి పట్టణ అభివృద్ధికి రూ.400 కోట్లు ఇస్తామని ఎమ్మెల్యే ప్రకటించారని గుర్తు చేశారు. చాలా వార్డుల్లో సీసీ రోడ్లు మురికి కాలువలు లేవని, కొన్ని చోట్ల మంచినీటి ఇబ్బంది కూడా ఉందన్నారు. టిఆర్ఎస్ బిజెపిలు రాష్ట్రంలో అధికారంలో లేవని వారికి వేస్తే మన విలువైన ఓటు వృధా అవుతుందన్నారు. 33 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఐ నేతలు శ్రీనివాసులు, చిన్న కురుమన్న, శేఖర్, ఎర్రకురుమన్న, వంశీ, రాంబాబు, రాజు, తదితరులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

## ప్రచార కార్యక్రమాలపై నిషేధం

పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా

మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పట్టణాలలో నేడు సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా మహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సోమవారం సాయంత్రం 5:00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈనెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలులో ఉంటుందని తెలిపారు.

## యువతి, యువకులే నిర్ణేతలు?

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్:** ఓట్ల పండుగకు ఇంకా రెండు రోజులే ఉంది. ప్రధాన పార్టీల ప్రచార హోరు పతాక స్థాయికి చేరింది. రాజకీయ పక్షాలన్నీ తమకే ఓటు ఎందుకు వేయాలో ఓటర్లకు విడమర్చి చెబుతున్నారు. వారిని తమ వైపుకు తిప్పుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. అయితే ఓటు ఎవరికి వేయాలి అనే విషయంలో కుటుంబంలోని పెద్దలు ఒక పార్టీ వైపు మొగ్గు చూపుతుంటే అదే కుటుంబంలోని యువత మరో పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్న అభిప్రాయములు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం తమకు లభిస్తున్న దాంతో సంతోషంగా ఉన్నామని, ఇప్పుడు కొత్తగా మరో పార్టీకి ఎందుకు ఓటు వేయాలి అనే భావన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ఆలోచన మాత్రం అందుకు భిన్నంగా ఉంటుం ది. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యమే ఇందుకు కారణం. నిరుద్యోగం వంటి అంశాలు యువతపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి.



## సైకిల్‌పై మంత్రి జూపల్లి వినూత్న ప్రచారం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సైకిల్‌పై వినూత్న ప్రచారంతో ప్రజల దృష్టిని ఆకర్షించారు. సైకిల్‌పై కొల్లాపూర్ పట్టణ వీధులవెంట తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలిలో వాహనాలపై అధికంగా ఆధారపడటం వల్ల శారీరక శ్రమతగ్గి అనేక రకాల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. సైకిల్ ప్రయాణం అలవాట్లవల్ల శరీర ధృఢత్వంతో పాటు మనసుకు ఆనందాన్ని అందిస్తాయన్నారు. సైకిల్ వినియోగం ఆరోగ్యానికి మేలుచేయడమేకాకుండా, పెట్రోల్, డిజిల్‌భారం తగ్గుతుందని, కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, యువత, రైతులు ప్రతి ఒక్కరు వీలున్నంత వరకు సైకిల్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.



## మున్సిపల్ ఎన్నికల్లో ప్రగతిశీల శక్తులకు సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ మద్దతు

**ప్రజాపక్షం/మక్తల్:** సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రగతిశీల భక్తులకు మద్దతు తెలియజేయాలని నిర్ణయించింది. ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రతికల ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మక్తల్ మున్సిపాలిటీలో 10వ వార్డ్‌లో పోటీ చేస్తున్న డిస్వరూప రాణి, 3వ వార్డులో పోటీ చేస్తున్న మద్దిలేటిలకు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. వారు సామాజిక, ఆర్థిక, అసమానతలు వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులు అన్నారు. ఈ ప్రాంతంలో కులసమస్య, భూనిర్వశితుల సమస్యలపై, మక్తల్ రెవెన్యూ, డివిజన్ కావాలని పోరాడిన వ్యక్తులన్నారు. ముఖ్యంగా ప్రజలకు జవాబుదారితనంగా ఉండేటటువంటి వ్యక్తులన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.కిరణ్, సబ్ విజన్ కార్యదర్శి భగవంతు, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎజి భూట్టో, ఎఐయుకెఎస్ జిల్లా నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**ప్రజాపక్షం/వెల్దండ:** మండలపరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఉప్పుమదన్‌మోహన్‌రావుకు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.48వేల చెక్కును సర్పంచ్ సత్తూరిప్రసాద్‌గౌడ్, మాజీ ఎంపిటిసి చల్లా వెంకట్‌రెడ్డి ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరమని, ఎంతోమందిపేదలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చొప్పరి రామకృష్ణ, వార్డుసభ్యులు లస్కర్ అఖిల వెంకటేష్, వెల్దండ వాసవిక్లబ్ అధ్యక్షులు అల్లంపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు కాసోజు బ్రహ్మచారి, యాదయ్య, పడాలవెంకటేష్, వెంకట్‌రావు, అంజయ్య, పకాడి పరమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.



## కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి

**ప్రజాపక్షం/పానుగల్:** గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలతో ఎన్నిక కాబడిన వార్డు సభ్యులకు కూడా గ్రామ అభివృద్ధిలో భాగం కావాలనే ఉద్దేశ్యంతో వార్డు సభ్యులకు కూడా శాఖలు కేటాయించడం ప్రతి శాఖకు సర్పంచుతో పాటు వార్డు సభ్యులకు కూడా శాఖలు కేటాయించడం ప్రతి నిత్యం ప్రజల ద్వారా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు నిత్యం గ్రామ అభివృద్ధితో తోడ్పాటు పడాలన్న ఆలోచనను ఆ గ్రామ సర్పంచు అమలు చేశారు. పానుగల్ మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచు తలకంటి ప్రభాకర్ రెడ్డి వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం వార్డు సభ్యులకు శాఖలు కేటాయించడం జరిగింది. గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం శాఖలు కేటాయించిన వార్డు సభ్యులు తమ శాఖల వారీగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం శాఖలు కేటాయించిన వార్డు సభ్యులు తమ శాఖల వారీగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహేష్ గౌడ్, వార్డు సభ్యులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



## సొంత నిధులతో సింగిల్ ఫేజ్ మోటర్

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** మండల పరిధిలోని ధుప్పటిగట్టు గ్రామంలో ఆదివారం రోజు సర్పంచ్ గోనేల వెంకటయ్య తన సొంత నిధులతో సింగిల్ ఫేజ్ మోటర్ ఏర్పాటు చేశారు. ప్రజాపాలనలో భాగంగా ముందస్తుగా ఎండాకాలం సమీపిస్తుండడంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా సింగిల్ ఫేజ్ మోటర్ నల్లా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంచినీటి సమస్య లేకుండా కృషీ చేస్తున్న సర్పంచ్ గొనేల వెంకటయ్యను గ్రామ ప్రజలు ప్రశంశిస్తు, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దివంగత ఉదయ్ కిరణ్, రీమాసేన్, తనూరాయ్ హీరో హీరోయిన్లుగా వి ఎన్ ఆదిత్య దర్శకత్వంలో 2001లో విడుదలై సంచలన విజయం సాధించిన మనసంతా నువ్వే సినిమాను మళ్ళీ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. వేలంటైన్స్ డే ఫిబ్రవరి 14 స్పెషల్ గా ఈసినిమాను రి రీలీజ్ చేస్తున్నారు.

# రీల్

## 'ఫంకీ' ట్రైలర్ ఆవిష్కరణ



కథానాయకుడు విశ్వక్ సేన్, దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటి కయాదు లోహార్ కథానాయికగా నటిస్తోంది. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగు పెట్టనున్న 'ఫంకీ' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, 'ధీరే ధీరే', 'రట్టాటటాన్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్ విడుదలైంది. హైదరాబాద్ లోని శ్రీరాములు థియేటర్ లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. 'ఫంకీ' ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. కె.వి. అనుదీప్ మార్క్ కామెడీతో నవ్వులు పూయించింది. ప్రతి ఫ్రేమ్ లో వినోదం ఉట్టిపడేలా రూపొందించిన ఈ ట్రైలర్, థియేటర్లలో నవ్వుల తుఫాన్ సృష్టించబోతున్నామని నిర్మాతలు అంటున్నారు. విశ్వక్ సేన్, కయాదు లోహార్ కలిసి తెరపై చురుకుగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరి.. చిత్రానికి కొత్త ఉత్సాహాన్ని, వినోదం అందాన్ని జోడించింది. ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. 'మీ అందరిని కలిసి దాదాపు సంవత్సరం అవుతుంది. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం.' అన్నారు.ఈ కార్యక్రమంలో కథానాయిక కయాదు లోహార్, దర్శకుడు అనుదీప్ కె.వి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ పాల్గొన్నారు.



## లయ సెకండ్ ఇన్నింగ్స్‌లో ముందుకెళ్తున్నారు

శివాజీ నిర్మాత గా మారి తన సొంత బ్యానర్ శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై రెండవ చిత్రంగా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ లయ శివాజీకి జంటగా నటించారు. ఈ చిత్రంలో రోహన్, ప్రిన్స్, అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా, రంజన్ రాజ్ సంగీతం అందించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 12న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' టీం అందరికీ కంగ్రాట్స్. ట్రైలర్ చూస్తుంటేనే సినిమా చూడాలని క్యూరియాసిటీ పెరిగింది. టాలెంటెడ్ యాక్టర్, తెలుగు అమ్మాయి లయ సెకండ్ ఇన్నింగ్స్ లో ముందుకెళ్తున్నారు. ఈ సినిమాలో లయ క్యారెక్టర్ సూపర్ గా ఉంది అని అన్నారు.ప్రొడ్యూసర్, యాక్టర్ శివాజీ మాట్లాడుతూ అప్పట్లో ఈవీవీలో గొప్ప క్వాలిటీస్ ఉండేవి. ఇప్పుడు అనిల్ లో చాలా పాజిటివ్ వైబ్స్ ఉంటాయి. లయ మాట్లాడుతూ ఇప్పటివరకు రత్నమాలగా గుర్తుపెట్టుకు న్నారు. ఇప్పుడు ఉత్తరగా గుర్తు పెట్టుకుంటారని నమ్ముతున్నా. అనిల్ సర్ ఇక్కడికి వచ్చి ట్రైలర్ లాంచ్ చేయడం హ్యాపీగా ఉంది. డైరెక్టర్ సుధీర్ ఉత్తర క్యారెక్టర్ బాగా తీర్చిదిద్దారు. శివాజీ ప్రొడ్యూసర్ గా, యాక్టర్ గా షూటింగ్ లొకేషన్స్ లో ఎంతో ఉత్సాహంగా ఉంటూ అన్నీ దగ్గరుండి నడిపించారు. ఈ సినిమాకు పెద్ద అసెట్ ఆయనే అని అన్నారు.అలీ మాట్లాడుతూ కూకట్‌పల్లి అందరినీ స్వాగతిస్తుంది. ఎవరి దగ్గర టాలెంట్ ఉంటుందో వాళ్ళే ఎదుగుతారు. ఎంతో కష్టపడి సినిమా తీసి స్టేజి వచ్చిన శివాజీ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమాలో నటించడం, ఆయన చేతుల మీదుగా చెక్ తీసుకోవడం ఆనందంగా ఉంది. డైరెక్టర్ సుధీర్ తొలి సినిమానే అయినా చాలా బాగా తీశారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుధీర్, ఈటీవీ విన్ సాయి కృష్ణ , రైటర్ మిథిల్, ఎడిటర్ బాలు ధన రాజ్ పాల్గొన్నారు.

## కష్టానికి ప్రతిఫలం దక్కింది

సక్సెస్ మీట్‌లో హీరో



అమర్‌దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఎంటర్‌టైనర్ 'సుమతీ శతకం' సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్ లో జరిగింది. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాణంలో, ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సక్సెస్ మీట్ లో హీరో అమర్‌దీప్ మాట్లాడుతూ కష్టపడితేనే ఫలితం వస్తుందని మా నాన్న నాకు నేర్పించారు, నేను అదే పాటిస్తున్నాను. ఈ చిత్రబృందం అందరితోనూ కలిసి పనిచేసినందుకు చాలా సంతోషంగా ఉంది. అలాగే నాతో కలిసి నటించిన శైలి చాలా కష్టపడి తనకి రానివి కూడా నేర్చుకుని ఈ సినిమా కోసం పనిచేశారు. అందుకు ఆమెను ప్రశంసించాలి. డాన్స్ స్టెప్స్ అందించిన గోవింద్ మాస్టర్ కు థాంక్స్. మరొకసారి నా సినిమాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి, ఒక్క ఛాన్స్ అడిగినందుకు అవకాశం ఇచ్చిన ప్రేక్షకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మరింత మంచి సినిమాలతో మీ ముందుకు వస్తాను' అంటూ ముగించారు. హీరోయిన్ శైలి చౌదరి మాట్లాడుతూ ఈ రోజు నాకు చాలా ఆనందంగా ఉంది. నాకు మొదటి రోజు షూటింగ్ చేసిన విషయం కూడా ఈరోజుకి గుర్తుంది, మేము పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. ముఖ్యంగా నేను ఈ చిత్ర దర్శకునికి, నిర్మాతకు, అమర్‌దీప్, ఇతర నటీనటులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ప్రేక్షకులకు, మమ్మల్ని సపోర్ట్ చేసిన మీడియా వారికి ధన్యవాదాలు. సుమతీ సాంగ్ ద్వారా ఈ సినిమాకు మంచి బజ్ వచ్చింది. నాకు షూటింగ్ సమయంలో సహాయం చేసిన చిత్రబృందం అందరికీ మరొకసారి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను' అన్నారు. నిర్మాత సాయి సుధాకర్ కొమ్మాలపాటి మాట్లాడుతూ సుమతీ శతకం ద్వారా కొత్త వారితో ఒక చిన్న సినిమాగా మొదలై ఇంత మంచి విజయం సాధించి మీ ముందుకు వచ్చింది. సినిమా చూసిన అందరూ కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం అని అంటున్నారు. ఈ సినిమాలో నటించిన అందరికీ ఒక సంతృప్తి ఉంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి మలక్‌పేట్ శైలజమ్మ, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, రచయిత బండారు నాయుడు, నటుడు మహేష్ విట్టా, దర్శకుడు ఎంఎం నాయుడు పాల్గొన్నారు.

## రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'వాట్స్ అప్ నరేష్'




బలగం తర్వాత కావ్య కళ్యాణ్‌రామ్..'కొత్తపోరదు' తర్వాత అన్వేష్ మైఖేల్ జంటగా రాబోతోన్న చిత్రం 'వాట్స్ అప్ నరేష్'. సివివి సినిమా బ్యానర్ మీద భాగ్యలక్ష్మి చింత నిర్మించిన ఈ చిత్రానికి సివి విశాల్ దర్శకత్వం వహించారు. యూత్ ఫుల్, లవ్ ఎంటర్టైనర్‌గా రానున్న ఈ మూవీకి సంబంధించిన గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. 'వాట్స్ అప్ నరేష్' గ్లింప్స్‌ని గమనిస్తే నరేష్ పాత్రలో అన్వేష్ మైఖేల్ చిల్ గాయ్‌లా కనిపిస్తున్నాడు. ఎనిమిది కోట్లు కట్నం ఇస్తే ఎన్ని కాలాలు అయినా వెయిట్ చేస్తా అనే డైలాగ్‌తో అతని పాత్రని పరిచయం చేశాడు. ఇక సాఫ్ట్ వేర్ లైఫ్, ప్రేమ, ఫ్యామిలీ ఇలా అన్ని రకాల అంశాల్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టుగా కనిపిస్తోంది. ఇక చివర్లో సింపుల్‌గా హాయ్ అంటూ హీరో, హీరోయిన్ల పాత్రల పరిచయం కూడా కొత్తగా, ఫ్రెష్‌గా అనిపిస్తోంది. ఇక గ్లింప్స్ బ్యాక్ గ్రౌండ్‌లో వినిపించిన 'లోకం తీరింతే.. నువ్వే మారాలంతే.. లొల్లె ఒద్దంటే.. తెలివిని కప్పెట్టంతే' అనే లిరిక్స్ సినిమా కథని, హీరో పాత్రను తెలియజేసేలా ఉన్నాయి.ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్నారు. విప్లవ్ నైషదం ఎడిటర్‌గా పని చేస్తున్నారు. వేదరామన్ శంకరన్ కెమెరామెన్‌గా వర్క్ చేస్తున్నారు. ప్రేమికుల రోజున ఈ మూవీకి సంబంధించిన రెండో గ్లింప్స్‌ని రిలీజ్ చేయబోతోన్నారు. అన్వేష్ మైఖేల్, కావ్య కళ్యాణ్‌రామ్, కె సాయి సంతోష్, ఉష్రశీ మురళి, సంతోష్ నందివాడ, ప్రియాంక రవిరు, మధు, పద్మ, బొమ్మకంటి రవీందర్, సునందన, మాల పార్వతి, కిరణ్ కుమార్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ విప్లవ్ నైషదం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృష్ణకాంత్ మామిడాల, ఆర్ట్ డైరెక్టర్: సంగెం నిఖిల్ హాసన్.

## 'దీక్ష'లో వీరజవానులకు నివాళిగా పాట



ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ దర్శక నిర్మాతగా బిఎస్ రెడ్డి సమర్పణలో ఢీ, జోడి ఫేమ్ అక్సఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్ గా, కిరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆర్ కే దీక్ష'. ఈ చిత్రంలో తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఆర్ కే దీక్ష' సినిమాను మార్చి రెండో వారంలో గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ మాట్లాడుతూ మా 'ఆర్ కే దీక్ష' సినిమాను మార్చి రెండో వారంలో రిలీజ్ చేయాలని నిర్ణయించాం. అప్పటికి విద్యార్థుల పరీక్షలు కూడా పూర్తవుతాయి. పట్టుదలగా ప్రయత్నిస్తే విజయం సాధ్యమనే మంచి సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుంది. లవ్, యాక్షన్, ఎమోషన్ వంటి అన్ని అంశాలుంటాయి. బీఎస్ రెడ్డి చిత్ర సమర్పకులుగా మాకు సహకారం అందించారు. రోహిత్ శర్మ అనే విలన్ ను పరిచయం చేస్తున్నాం. 118 దేశాల్లో నాన్ చాక్ లో మెడల్స్ గెల్చుకున్న రవి మాస్టర్ మా మూవీకి స్టంట్స్ కంపోజ్ చేశారు. హీరో కిరణ్ కు ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుంది అని అన్నారు.హీరో కిరణ్ మాట్లాడుతూ 'ఆర్ కే దీక్ష' సినిమా మార్చి రెండో వారంలో రిలీజ్ కు వస్తుండటం సంతోషంగా ఉంది.ఈ ప్రెస్ మీట్ లో హీరోయిన్ అక్స ఖాన్, నటి తులసి, చిత్ర సమర్పకులు డీఎస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం రాజు కిరణ్, ఎడిటర్ మేనగ శ్రీను, ఫైట్స్ రవి, డాన్స్ ఆనంద్. అందించారు.

## స్పోర్ట్స్ నేపథ్యంలో 'చథా పచ్చ'



రోషన్ మాథ్యూ, విశాఖ్ నాయర్, ఇషాన్ ప్రధాన పాత్రల్లో షిహాన్ షౌకత్, రితేష్ ఎస్. రామకృష్ణన్ నిర్మాతలుగా అద్వైత్ నాయర్ తెరకెక్కించిన చిత్రం 'చథా పచ్చ : ది రింగ్ ఆఫ్ రౌడీస్'. మలయాళంలో విడుదలై సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోన్న ఈ మూవీని తెలుగులో ఫిబ్రవరి 13న సురేష్ ప్రొడక్షన్స్ భారీ ఎత్తున విడుదల చేస్తోంది. ఈ క్రమంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.హీరో రోషన్ మాథ్యూ మాట్లాడుతూ 'మా 'చథా పచ్చ' మూవీని తెలుగులో రిలీజ్ చేస్తున్న సురేష్ ప్రొడక్షన్స్ టీంకు థాంక్స్. అయితే ఇందులో ఓ స్పెషల్ కేమియో కారెక్టర్ ఉంది. ఆ పాత్రకి మమ్ముట్టిని అప్రోచ్ అవ్వడం, మా కోసం ఆయన అంగీకరించడం గొప్ప విషయం. ఆయన పాత్ర ఈ సినిమాకి టర్నింగ్ పాయింట్‌లా ఉంటుంది. సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధి ప్రవీణ్ మా ట్లాడుతూ .. 'స్పోర్ట్స్ డ్రామాతో తెరకెక్కించిన 'చథా పచ్చా' మూవీని ఫిబ్రవరి 13న రి లీజ్ చేయబోతోన్నాం. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. సురేష్ ప్రొడక్షన్స్ ను ంచి ఇలానే మంచి కంటెంట్ సినిమాల్ని అందించేందుకు ప్రయత్నిస్తుంటామ'ని అ న్నారు. కెమెరామెన్ అనెంద్ సి చంద్రన్, స్క్రీన్ ప్లే, సంభాషణలు స నూప్ తైకూడం, ఫిల్మ్ ఎడిటర్ ప్రవీణ్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జార్జ్ సెబాస్టియన్.

## ఫోరెన్సిక్ ల్యాబ్ దగ్ధంపై విచారణ జరిపించాలి

### ఘటన వెనుక బిజెపి, కాంగ్రెస్ పెద్దల హస్తంపై అనుమానం : కెటిఆర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (టిజిఎఫ్ ఎస్‌ఎల్)లో భారీ అగ్ని ప్రమాదం ఘటనపై కేంద్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో స్థానిక బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ దగ్ధం వెనుక కుట్ర కోణం దాగి ఉందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించి కేసును నిగ్గ తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ ల్యాబ్ దగ్ధం కారణంగా ఎంతో మంది నేరాల నుండి తప్పించుకొనే ప్రమాదం నెలకొందని, రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు వివరాలు కనుమరుగు చేసేందుకే ఈ ఘటనకు తెరలేపారని అనుమానం ఉందన్నారు. ఈ ఘటన వెనుక బిజెపి, కాంగ్రెస్ పెద్దల హస్తం ఉండవచ్చని, ఎందుకంటే రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని బిజెపి కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెప్పినా చర్యలు లేవని, బడేబాయి, చోటేబాయి బంధం బలంగా ఉందని, ఈ ల్యాబ్ దగ్ధం ఘటనతో ఇది మరోసారి నిరూపితమైందన్నారు. ఇటీవల సింగరేణిలో జరిగిన కుంబకోణం విషయములో కూడా తాము వెలుగులోనికి తెచ్చినా ఎలాంటి చర్యలు లేవని, దాంతో కాంగ్రెస్, బిజెపి పెద్దలు కలిసే ఈ కుట్రకు పాల్పడ్డాయా అన్న అనుమానం ఉందన్నారు. కేంద్రానికి రేవంత్ రెడ్డితో లాలూచీ లేకుంటే రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ దగ్ధం సంఘటనపై నిగ్గ తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వారికి ఎందుకు ఓటు వేయాలి ?

# ప్రశ్నించండి.. ఆలోచించండి

పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోపిడీ చేసినందుకా?
బిఆర్‌ఎస్ పార్టీ ఒక్క ఇళ్లు, ఇంటి స్థలం ఇవ్వలేదు
ప్రతి పైసా పోగు చేస్తాం..పేదలకు పంచుతాం
అర్హత కలిగిన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు
డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/వైరా :** మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని బిఆర్‌ఎస్ నాయకులు అడుగుతున్నారు. వారికి ఎందుకు ఓటు వేయాలని పట్టణ ప్రజలంతా ప్రశ్నించండి, ఆలోచించండని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు అన్నారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోపిడి చేసినందుకు వారికి ఓటు వేయాలా? మనందరిని తాకట్టు పెట్టి రాష్ట్రాన్ని 8లక్షల కోట్ల అప్పుల్లో ముంచినందుకు వారికి ఓటు వేయాలా అని డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. ఇక చాలు వారి పరిపాలన ముగిసిపోయిందన్నారు. టిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక ఇళ్లు కాని, ఒక ఇంటి స్థలం కాని ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల క్రితం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాయి. తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, ఈ విషయాన్ని పేదల ఇంటికి సంబంధించిన ఏ ఇటుక పెళ్లని అడిగినా చెబుతుందన్నారు. రాష్ట్ర వనరులు, ఆస్తులు, వ్యవస్థలు ప్రజల కోసం ఖర్చు పెడతామని, మాయమాలు చెప్పే అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి పోయిందన్నారు. పేదలు, బడుగుల బాధలు అర్థం చేసుకునే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వచ్చాకే పేదలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఖర్చు చేస్తున్నావ్, రాష్ట్రంలో మొదటి దశలో నాలుగున్నర లక్షల నిర్మాణం జరుగుతుంది. ఇందుకు గాను రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం, వారు ఆత్మ గౌరవంతో తలెత్తుకొని జీవించేలా చేస్తామన్నారు. టిఆర్‌ఎస్ 10 సంవత్సరాల కాలం పాలనలో పేదలు రేషన్‌కార్డు కోసం తిరిగి తిరిగి అలిసిపోయారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌కార్డులను మంజూరు చేశాం, రాష్ట్రంలో 1.15 కోట్లు కుటుంబాలు ఉండగా 1.02 కోట్లు కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం తినలేక కోళ్ళ దానాకు ఉపయోగించేవారు. కాని నేడు కిలో రూ.50ల ఖరీదు చేసే సన్నబియ్యాన్ని మనిషికి 6కిలోల చొప్పున ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. వృద్ధులు, కుటుంబ సభ్యులు అనారోగ్యంత పాలైతే ఆస్తులు పుస్తెలు తాకట్టు పెట్టుకునే పరిస్థితి ఇబ్బంది నుంచి పేదలను బయటపడేసేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామని, పేదల సంక్షేమం కోసం ఎంతటి ఖర్చుకైనా ప్రజా ప్రభుత్వం వెనుకాడబోదని తెలిపారు. మహిళలను మహాలక్ష్మి గా చూసుకునే సంప్రదాయం మనది. పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని ప్రకటించాం. పది సంవత్సరాలు గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేక పోయారు. కానీ ప్రజా ప్రభుత్వం రాగానే గ్రూప్ వన్ పపరీక్షను విజయవంతంగా నిర్వహించడమే కాదు, ప్రజల సమక్షంలో ఉద్యోగ పత్రాలు అందజేశామని, అదేవిధంగా గ్రూప్ టు త్రీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. రెండు సంవత్సరాల కాలంలో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు పలువురు నాయకులు పాల్గొన్నారు.





## సిపిఐతోనే సాధ్యం

**(మొదటి పేజీ తరువాయి)**

సమగ్రాభివృద్ధి సాధ్యమని, సిపిఐ అభ్యర్థుల గెలుపు ద్వారా కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగురవేద్దామన్నారు. నిత్యం ప్రజలతో ఉండే వారికే ప్రజా సమస్యల పై పట్టు ఉంటుందని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తారని, ఓట్లు అడిగేందుకు ఎన్నికల సమయంలో కొందరు వస్తుంటారని, వారు మాయమాటలు చెప్పి ప్రలోబాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల కోసం వచ్చే వారు ఎన్నికలు పూ ర్తయిన తర్వాత మళ్లీ కనిపించరని, సమస్యల కోసం విన్నవించుకుందామన్నా కనీసం ముఖం కూడా చూపించరన్నారు. పదువులున్నా లేకున్నా ప్రజలతో నిత్యం ఉండేది ఎర్రజెండానే అని, ఆ ఎర్రజెండాను కార్పోరేషన్‌పై ఎగురవేయడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. ఎవరు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజల నుండి ఎర్రజెండాను ఎవ్వరూ దూరం చేయలేరని తెలిపారు. కార్పొరేషన్ కావడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయని, పరిశ్రమలు రావడంతో ఆర్థిక శక్తి మెరుగు పడుతుందని, ఇది ఈ ప్రాంతానికి వరమని చెప్పారు. ఈ ఎన్నికలు అహంకారానికి ఆత్మ గౌరవానికి మధ్య జరగుతున్నాయని, ఎవరు ఎన్నిజిమ్మిక్కులు చేసినా కార్పోరేషన్ పై ఎగిరేది ఎర్రజెండానే అన్నారు. కార్యక్రమాల్లో అభ్యర్థులు దాసరి శ్రీనివాస్, ఎర్ర లింగేశ్వర్, పల్లపోతు భాగ్యలక్ష్మీ, సిపిఐ నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, గెద్దాడు నగేష్, నెరేళ్ల రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతతో వ్యవహరించినప్పుడే..

**(మొదటి పేజీ తరువాయి)**

అసలైన విజయమని స్పష్టం చేశారు. సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఒకే బృందంగా పనిచేయడం వల్లే నగరంలో శాంతిభద్రతలు సమర్థంగా ఉన్నాయని కొనియాడారు. పురస్కారాలు అందుకున్న వారిలో అదనపు డిసిపిలు, ఎసిపిలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి ఎం.శ్రీనివాసులు, జాయింట్ సిపి నార్త్ రేంజ్ ఎన్.శ్వేత, డిసిపిలు ఎస్.చైతన్య కుమార్, శిల్పవల్లి, వి.అరవింద్ బాబు, లావణ్య నాయక్ జాదవ్, కె.వెంకట లక్ష్మి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మౌనం వెనుక అర్థం ఏమిటో?

**(మొదటి పేజీ తరువాయి)**

ఎలాంటి స్పందన లేదు. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ జనాతికంగా ప్రకటనలు ఇస్తున్నారు. అమెరికాతో ఒప్పందాన్ని ఒక అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. ఒప్పందం మొత్తం భారత్‌కు అనుకూలమంటూ పదేపదే చెప్తున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేయవద్దని అమెరికా హుకుం జారీ చేయడం, అందుకు అంగీకరించని భారత్‌పై అదనపు సుంకాలను విధించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యతను సతరించుకున్న అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ విస్పష్టమైన వివరణ ఎందుకు ఇవ్వడం లేదన్నది ప్రశ్న. రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను న్యూఢిల్లీ ధ్రువీకరించడం లేదా ఖండించడం చేయలేదు. ఈ మౌనం కేవలం దౌత్యపరమైన జాగ్రత్తనా? లేక వ్యూహాత్మక అస్పష్టతనా? లేదా అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య చిక్కుకున్న భారత ప్రభుత్వ సంక్లిష్ట స్థితిగతుల ప్రతిబింబమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే వాణిజ్య ఒప్పందంపై లాంఛనాలు పూర్తయ్యాయి. భారత ఉత్పత్తులపై విధించిన 25 శాతం అదనపు టారిఫ్‌ను ఉపసంహరిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. ఈ ఒప్పందం... టారిఫ్ తగ్గింపు... అమెరికా పత్రంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా భారత్‌లో చేర్చిన మ్యాప్‌ను ఉంచడం వంటి వన్నీ యాదృచ్ఛికాలా? లేక వ్యూహాత్మక ముందస్తు ప్రణాళికలా? అనేది తేలాలి. అమెరికా నుంచి భారత్ ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, రాబోయే పదేళ్ల పాటు రక్షణ సహకారాన్ని విస్తరించే ఫ్రేమ్‌వర్క్‌కు కట్టుబడిందని కూడా ట్రంప్ తెలిపారు. అంతే కాదు, భవిష్యత్తులో భారత్ మళ్లీ రష్యా చమురు దిగుమతులు ప్రారంభిస్తే, తిరిగి 25శాతం అదనపు టారిఫ్ విధించే అవకాశాన్ని కూడా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ప్రస్తావించారు. కాబట్టి, అమెరికాతో కుదిరింది కేవలం వాణిజ్య ఒప్పందంగా మాత్రమే చూడడం సరి కాదు. దీనిని ఒక స్పష్టమైన రాజకీయ వ్యూహాత్మక ఒత్తిడి కోణంలోనూ చూడాల్సి ఉంటుంది. కాగా, ఇంత తీవ్రమైన ప్రకటనల అనంతరం భారత ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడం అసాధారణమే. సాధారణంగా ఇటువంటి కీలక అంతర్జాతీయ ఒప్పందాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇస్తుంది. కానీ ఈ విషయంలో మాత్రం న్యూఢిల్లీ మౌనాన్నే ఆశ్రయించింది. ప్రశ్నించగా, అధికారులు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను మాత్రమే ఉదహరించారు. 'భారతకు 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతే అత్యున్నత ప్రాధాన్యం. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, మార్కెట్ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని ఇంధన వనరులను దిగుమతి చేసుకోవడమే మా వ్యూహం' అంటూ ముగిచారు. నిజానికి ఈ వ్యాఖ్యల్లో ఎక్కడా 'రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేస్తాం' అనే స్పష్టమైన అంగీకారం లేదు. అదే సమయంలో 'ట్రంప్ చెప్పింది తప్పు' అనే ఖండన కూడా లేదు. ఈ మధ్యస్థ విధానం అనేక అనుమానాలకు తావిస్తోంది. అమెరికా చాలా కాలంగా భారత్‌పై రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉంది. ట్రంప్ తాజా ప్రకటనలు ఈ అసంతృప్తిని కొత్త స్థాయికి తీసుకెళ్లాయి. టారిఫ్‌లను ఆయుధంగా ఉపయోగిస్తూ, రష్యా చమురును నిలిపివేయాలన్న షరతు విధించడం, అమెరికా వాణిజ్య–రాజకీయ విధానంలో కొత్త దశను సూచిస్తోంది. ఇలావుంటే, ఇటీవలి వారాల్లో భారత్ రష్యా ముడిచమురు దిగుమతులు గణనీయంగా తగ్గినట్లు సమాచారం. ఇది అధికారికంగా ప్రకటించిన నిర్ణయం కాకపోయినా, మార్కెట్ పరిస్థితులు, రవాణా ఖర్చులు, బీమా సమస్యలు వంటి కారణాలతో ఈ తగ్గుదల చోటుచేసుకుంటోందని విశ్లేషకులు చెబుతున్నారు.

అంటే భారత్ బహిరంగంగా అంగీకారం చెప్పకుండా, ఆచరణలో మాత్రం నెమ్మదిగా రష్యా చమురుపై ఆధారాన్ని తగ్గిస్తున్నదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇది కూడా వ్యూహాత్మక మార్గమే కావచ్చు. ఒకేసారి పూర్తిగా నిలిపివేయడం కంటే, దశలవారీగా తగ్గించుకుంటూ వెళ్లడం ద్వారా, అంతర్జాతీయ ఒత్తిళ్లను, దేశీయ ప్రభావాలను రెండింటినీ సమతుల్యం చేయవచ్చనే ఆలోచన ఉండవచ్చు. కారణాలు ఏవైనా, అత్యంత కీలక అంశాల్లోనూ ప్రభుత్వం మౌనం పాటించడమే అనుమానాలకు కారణం. ఇంధన భద్రత, వాణిజ్య ఒప్పందాలు, అంతర్జాతీయ సంబంధాలు వంటిని దేశ ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపే అంశాలు. అలాంటి విషయాల్లో పారదర్శకత అవసరం అనే వాదన బలంగా వినిపిస్తోంది. భారత్ నిజంగా రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేయడానికి అంగీకరించిందా? లేక ట్రంప్ తన రాజకీయ అవసరాల కోసం అతిశయోక్తి చేశారా? లేక ఇరు పక్షాల మధ్య ఉన్న ఒప్పందం చాలా సున్నితమైనదిగా ఉండి, బహిరంగ ప్రకటనకు అనువుగా లేదా? ఈ ప్రశ్నలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com